ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 3
ప్రకాశం
జిల్లా వార్తలు
గురువారం 12, జూన్ 2025



బడికి వేళాయె..

● నేటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం

ఒంగోలు కలెక్టరేట్ , జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు గురువారం నుంచి పునఃప్రారంభమవుతున్నాయి. పాఠశాలల ప్రారంభానికి విద్యాశాఖాధికారులు అన్ని ఏర్పాట్లూ చేశారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చాక విద్యారంగంపై ప్రత్యేకదృష్టి సారించింది. గత వైసీపీ ప్రభుత్వ హయంలో అస్తవ్యస్తంగా ఉన్న విద్యారంగాన్ని గాడిలో పెట్టేందుకు అనేక చర్యలను తీసుకుంది. అందుకోసం ఏడాది కాలంగా పాఠశాలల పునర్విభజనను కూడా పూర్తి చేసింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టి పెట్టడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు జిల్లావ్యాప్తంగా 3103 పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో చదువుతున్న సుమారు లక్షా 20వేల మంది విద్యార్థులకు విద్యా కిట్లను పాఠశాలల ప్రారంభం రోజునే అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో తదనుగుణంగా అధికారులు చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు విద్యా కిట్లు చేరాయి. అక్కడి నుంచి పాఠశాలల ప్రారంభం రోజున చేర్చనున్నారు. మరోవైపు పాఠశాలల్లో మౌలిక సదుపాయాలపై కూడా ప్రభుత్వం దృష్టి సారించింది. మరోవైపు స్కూలు కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంది.

పాఠశాలల్లో కొత్త టీచర్లు

జిల్లాలో ఉపాధ్యాయుల బదిలీలు జరుగుతున్నాయి. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులు, స్కూలు అసిస్టెంట్ల బదిలీలు పూర్తి కాగా సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ జరుగుతోంది. ఈ ప్రక్రియ కూడా రెండు రోజుల్లో పూర్తి కానుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా పాఠశాలల పునఃప్రారంభం రోజునే కొత్త టీచర్లు పాఠశాలల్లో చేరే విధంగా చర్యలు తీసుకున్నారు. అయితే సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల్లో కొంత మేర జాప్యం జరిగినా ఆ ప్రక్రియను కూడా విద్యాశాఖాధికారులు వేగవంతం చేశారు. రెండు రోజుల్లో ఈ ప్రక్రియ ముగిసిన వెంటనే కొత్త టీచర్లు పాఠశాలల్లో చేరనున్నారు.

రైతుల్లేరు.. వారితో మాటల్లేవు..

బలప్రదర్శన.. అరాచకం



మూకలు విసిరిన రాళ్లు

రాళ్ల దాడిని అడ్డుకుంటున్న పోలీసులు



దాడిలో గాయపడిన కానిస్టేబుల్

పొగాకు రైతుల సమస్యలు తెలుసుకుని పోరాడతానని జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన పోరుబాట చివరకు ఆ రైతులకే కష్టాలను తెచ్చిపెట్టింది. 'సీఎం.. సీఎం..' అంటూ అరుపులు, కేకలు... కార్యకర్తల అదుపులేని ఆగడాలతో పొదిలిలో బుధవారం జగన్ పర్యటన ఆద్యంతం అల్లరిగా సాగింది. పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మొదట ర్యాలీ చేపట్టారు. ఆ సమయంలో నిరసన తెలిపిన కొందరు మహిళలపై వైసీపీ మూకలు రాళ్లు, చెప్పుల దాడి చేశారు. దీంతో ఆ ప్రాంతమంతా భీతావహంగా మారింది. ఏకంగా పోలీసులకు గాయాలయ్యాయి. ఆ తర్వాత వేలం కేంద్రంలోనూ కార్యకర్తలు రెచ్చిపోయారు. తోసుకుంటూ వెళ్లి రైతుల బేళ్లను నాశనం చేశారు. దీంతో జగన్ పర్యటన ఎవరికోసమంటూ ప్రశ్నలు మొదలయ్యాయి.

● భారీగా వచ్చిన వైసీపీ శ్రేణులు..
● సీఎం..సీఎం అంటూ నినాదాలు
● రభసగా సాగిన జగన్ పర్యటన
● మహిళలపై దాడిని సీరియస్‌గా తీసుకున్న ప్రభుత్వం
● రెండు కేసులు నమోదు.. పలువురు గుర్తింపు..

వేలం అధికారి, బయ్యర్లతో ముఖాముఖి



శ్రేణులకు అభివాదం చేస్తున్న జగన్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

పొగాకు రైతులతో ముఖాముఖి అన్న వైఎస్ జగన్ వేలం అధికారి, పొగాకు బయ్యర్లతో తూతూమంత్రంగా మాట్లాడి ఇలా వచ్చి అలా వెళ్లిపోయారు. ఆయన కోసం వైసీపీ నేతలు భారీగా సమీకరించిన ఆ పార్టీశ్రేణులు హంగామా చేసి మహిళలపై రాళ్ల రువ్వటంతో పాటు వేలం కేంద్రంలో పొగాకు బేళ్లను తొక్కి కార్యక్రమం రసాభాసకు కారణమయ్యారు. పొగాకు సమస్యలపై రైతులతో ముఖాముఖి అంటూ పొదిలి వచ్చిన వైసీపీ అధినేత జగన్ కార్యక్రమాల్లో చోటుచేసుకున్న ఈ ఘటనలతో జనం విస్తుపోయారు. నిర్ణీత సమయం కన్నా గంట ఆలస్యంగా బుధవారం పొదిలి వచ్చిన ఆయనకు హెలిప్యాడ్ వద్ద ఆ పార్టీ నాయకులు స్వాగతం పలికారు. అక్కడ నుంచి భారీగా కార్యకర్తలు వెంటరాగా ప్రత్యేక వాహనంలో పొదిలి పొగాకు వేలం కేంద్రానికి చేరారు. అలా వేలం కేంద్రంలోకి వెళ్లిన జగన్ తొలుత వేలం కేంద్ర అధికారితో రెండు నిమిషాలు మాట్లాడారు. అక్కడే ఉన్న వేలంలో పాల్గొన్న ఆయా వ్యాపార సంస్థల బయ్యర్లతో మరి కొద్దిసేపు మాట్లాడారు.

వేలం కేంద్రంలోనూ నినాదాలు

జగన్‌తోపాటు లోపలకు చొచ్చుకొచ్చిన కార్యకర్తలు 'జై జగన్.. జై సీఎం' అంటూ నినాదాలతో హడావుడి చేయటంతో ఆ కొద్దిసేపు వేలం అధికారి, బయ్యర్లతో జగన్ ఏం మాట్లాడింది, వారు ఏం చెప్పింది పక్కవారికీ వినిపించలేదు. 'ఆయనేమి అడిగాడో.. మేము ఏం చెప్పామో.. మాకే అర్థంకానంతగా వైసీపీ శ్రేణుల నినాదాలు ఉన్నాయి' అని బయ్యర్లు ఆంధ్రజ్యోతితో వ్యాఖ్యానించటం విశేషం. అప్పటికే వేలం కేంద్రంలో పొగాకు విక్రయించుకునేందుకు వచ్చిన రైతులు ఉన్నారు. వారిని కలిసే ప్రయత్నం జగన్ చేయలేదు. వారు జగన్ వద్దకు వచ్చి చెప్పేందుకు వైసీపీ శ్రేణులు అవకాశం ఇవ్వలేదు. ఆ తర్వాత జగన్ బయటకు వచ్చి మీడియాతో మాట్లాడి వెళ్లిపోయారు. ఆ సందర్భంగా కూడా ఆయా అంశాలపై మాట్లాడుతూ పొగాకు ధర, ఇతర గణాంకాలపై గజిబిజిగా మాట్లాడటం విశేషం.

మహిళలపై రాళ్ల దాడి

జగన్ వస్తున్న విషయాన్ని తెలుసుకొని కొందరు మహిళలు ఒక ప్రాంతంలో నిలబడి సాక్షి చానల్‌లో అమరావతి మహిళలను కించపర్చుతూ చేసిన వ్యాఖ్యల పట్ల నిరసన తెలిపేందుకు సిద్ధమయ్యారు. జగన్ కాన్వాయ్ వచ్చినప్పుడు వారు దూకుడుగా ముందుకు రావచ్చనే ఉద్దేశంతో పోలీసులు వలయంగా నిలబడ్డారు. రోడ్డుకు రెండవవైపు మహిళలకు ఎదురుగా కొందరు వైసీపీ శ్రేణులు ముందుగానే చేరారు. జగన్ కాన్వాయ్ రాగానే ఎదురుగా ఉన్న వైసీపీ శ్రేణులు మహిళలపై ఒక్కసారిగా చెప్పులు, రాళ్ల వర్షం కురిపించారు. ముగ్గురు మహిళలకు గాయాల య్యాయి. ఒక డీఎస్పీపై చెప్పు పడింది. ఒక సీఐ తోపులాటతో సొమ్మసిల్లి పడిపోయాడు. ముగ్గురు కానిస్టేబుళ్ల గాయపడ్డారు. పరిస్థితి అదుపుచేసే సమయంలో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఇవేమీ పట్టనట్లు జగన్ తన కాన్వాయ్‌లో ముందుకెళ్లారు. ఇలా రైతుల ముఖాముఖి కోసం వచ్చిన జగన్ కార్యక్రమం అసలు లక్ష్యానికి దూరంగా నిలిచిపోయింది. అయితే ముందు నుంచి ప్రణాళిక ప్రకారం పనిచేసిన వైసీపీ నాయకులు పొగాకు పంట సాగుకాని ప్రాంతాల నుంచి ఆ పార్టీ శ్రేణులను భారీగానే తరలించారు. దర్శి, మార్కాపురం, వైపాలెం నియోజకవర్గాల నుంచే ఎక్కువమంది వైసీపీ శ్రేణుల సమీకరణ జరిగినట్లు కనిపించింది.

ఎందుకొచ్చారో..



ఇక్కడ దాక వచ్చిన జగన్ వేలం కేంద్రంలో చొరవ తీసుకొని రైతుల వద్దకు వెళ్లి వారిని కలిసే ప్రయత్నంగాని, వారి ద్వారా సమస్య తెలుసుకునే ప్రయత్నంగాని చేయలేదు. దీంతో జగన్ రైతులతో ముఖాముఖికి వచ్చారా.. లేక మొక్కుబడిగా ఇలా వచ్చి వెళ్లారా అనే విమర్శలు బహిరంగంగానే వినిపించాయి. వేలంకేంద్రంలో జగన్ రైతులను కలవకపోగా ఆయనతోపాటు చొచ్చుకొచ్చిన వైసీపీ శ్రేణులు మాత్రం వేలం కేంద్రంలో పొగాకు బేళ్ల తొక్కి పడేశారు. బేళ్లపై చిందులేశారు. పొగాకు చెక్కులను అడ్డదిడ్డంగా తొక్కేశారు. జగన్ వెళ్లిన తర్వాత జరిగిన వేలంలో అలాంటి చెక్కులను తీసుకునేందుకు వ్యాపారులు నిరాకరించటంతో రైతులు లబోదిబోమన్నారు.

నేడు ఏడాది పండుగ

● జిల్లాలో కూటమి పార్టీల విజయోత్సవ ర్యాలీలు
● భారీ ఏర్పాట్లలో తెలుగు తమ్ముళ్లు
● పాలనలో అభివృద్ధిపై విస్తృత ప్రచారం
● సాయంత్రం అమరావతిలో జరిగే సభకు కీలక ప్రజాప్రతినిధులు పయనం



ఒంగోలు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా గురువారం విజయోత్సవ ర్యాలీలకు కూటమి పార్టీలు, ప్రత్యేకించి తెలుగు తమ్ముళ్లు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో వైసీపీ పాలన పోయి కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవాల నిర్వహణకు టీడీపీ పిలుపునిచ్చింది. గత ఏడాది జూన్ 4న ఎన్నికల ఫలితాలు రాగా 12వ తేదీన మంత్రి వర్గ ప్రమాణస్వీకారం జరిగింది. దీంతో ఆరోజుకు ఏడాది పూర్తవుతుండటంతో ఈ కాలంలో సాధించిన విజయాలు, అమలు చేసిన పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని ప్రభుత్వం భావించింది. అందుకోసం నియోజకవర్గ కేంద్రాల్లో ఏడాది పాలన విజయోత్సవ ర్యాలీలు చేపట్టాలని ఆదేశించడంతో తదనుగుణంగా జిల్లాలో ఆ కార్యక్రమాలపై టీడీపీ శ్రేణులు దృష్టి సారించాయి. ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జుల నేతృత్వంలో ఇవి జరగనున్నాయి. సాయంత్రం అమరావతిలో ప్రభుత్వం తరుపున ఏడాది పాలన విజయోత్సవ సభ నిర్వహిస్తూ ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులను ఆ సభలో పాల్గొనాలని ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో జిల్లాలో విజయోత్సవ ర్యాలీలను ఉదయం పూట నిర్వహించేలా అన్ని ప్రాంతాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. అనంతరం కీలక ప్రజాప్రతినిధులంతా అమరావతిలో జరిగే సభకు హాజరుకానున్నారు. జిల్లాలో జరిగే విజయోత్సవ ర్యాలీలలో టీడీపీతో పాటు కూటమిలోని ఇతర భాగస్వామ్య పార్టీల నాయకులు, కార్యకర్తలు కూడా పాల్గొనున్నారు.

'రెవెన్యూ'లో బదిలీలు

66 మంది డీటీలు, మరో 44మంది ఆర్‌ఐలు, సీనియర్ అసిస్టెంట్లు ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

5

ఏరువాకను ప్రారంభిస్తున్న మంత్రులు స్వామి, గొట్టిపాటి





గరుడ వాహనంపై కొలువుదీరిన లక్ష్మీనరసింహుడు

గరుడ వాహనంపై లక్ష్మీనరసింహుడు విహారం

● పాతసింగరాయకొండలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
● స్వామివారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు

5

నెగ్గిన అవిశ్వాసం

మార్కాపురం మున్సిపాలిటీలో ఖాళీ అయిన వైసీపీ చైర్మన్ పీఠం
ఎమ్మెల్యే కందులతోపాటు 23 మంది కౌన్సిలర్లు హాజరు
సమావేశంలో పాల్గొన్న ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు

5

రైతుల సంక్షేమమే లక్ష్యం

పొగాకు రైతులకు బాసటగా ప్రభుత్వం
మంత్రులు డాక్టర్ స్వామి, గొట్టిపాటి
ఒంగోలు-2 కేంద్రం వద్ద ఏరువాక ప్రారంభం
నల్లబర్లీ కొనుగోళ్లపై ఇప్పటికే నిర్ణయం
ఏ ముఖం పెట్టుకొని రైతుల వద్దకు వచ్చావంటూ జగన్‌పై ఫైర్

ఒంగోలు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులు సంతోషంగా ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రులు డాక్టర్ డీఎస్‌బీవీ స్వామి, గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ప్రత్యేకించి పొగాకు రైతులకు సమస్య వచ్చిన ప్రతి సందర్భంలోనూ అండగా ఉన్నామని, ఇప్పుడు కూడా నల్లబర్లీ, ఎఫ్‌సీవీ పొగాకు రైతులకు మేలు చేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఒంగోలు-2 వేలం కేంద్రం రైతు కమిటీ ఆధ్వర్యంలో బుధవారం త్రోవగుంట వద్ద ఏర్పాటు చేసిన ఏరువాక కార్యక్రమంలో ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్‌లతో కలిసి పాల్గొన్నారు. ఎద్దుల అరక దున్ని రైతులను ఉత్సాహపర్చడంతో పాటు వేలం కేంద్రంలో పొగాకు కొనుగోళ్లను పరిశీలించారు. అనంతరం రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మంత్రులు, ఎమ్మెల్యేలు, బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ డాక్టర్ సీతారామయ్య, కలెక్టర్ తమీమ్ అన్సారియా పాల్గొన్నారు. మంత్రి డాక్టర్ స్వామి మాట్లాడుతూ నల్లబర్లీ రైతులు సంక్షోభంలో ఉంటే వారిని ఆదుకొనే చర్యలను ప్రభుత్వం తీసుకుంటుందన్న ఆయన ఎఫ్‌సీవీ రైతుల సమస్యలపై కూడా ప్రభుత్వం దృష్టి సారిస్తుందన్నారు. ఈ-మార్కెట్‌కు ఫెసిలిటేటర్‌గా ఉన్న పొగాకు బోర్డు కూడా అపరాధ రుసుం నుంచి కొంత ఖర్చు చేసి రైతులకు ధరలు వచ్చేలా చూడాలన్నారు.

వ్యాపారులు ముందుకు రావాలి : మంత్రి గొట్టిపాటి

గిట్టుబాటు ధర కోసం రైతులు ఆందోళన చెందుతున్నప్పుడు లాభాలను భారీగా పొందే వ్యాపారులు ముందుకు వచ్చి కొనుగోలు చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కోరారు. నల్లబర్లీ రైతుల విషయంలో ప్రభుత్వం చేస్తున్న కృషి, తీసుకున్న చర్యలను వివరించిన ఆయన ఈనెల 16 నుంచి ప్రభుత్వం కూడా బర్లీ పొగాకు కొనుగోలు చేస్తుందన్నారు. ఎఫ్‌సీవీ పొగాకు రైతుల సమస్యలపైనా దృష్టి పెడతామని, వ్యాపారులు కూడా గతంలో ఇచ్చిన హామీలకు అనుగుణంగా కొనుగోలు చేయాలని సూచించారు. నెల రోజుల క్రితం జరిగిన సమావేశంలో చెప్పిన మాటలను వ్యాపారులు ఎంత వరకు అమలు చేశారని సభలో ఉన్న ఐటీసీ జీపీఐ కంపెనీల ప్రతినిధులను ప్రశ్నించారు. వ్యాపారులు సరిగా కొనడం లేదని, మంత్రులు చొరవ చూపి సీఎం ద్వారా కేంద్రానికి లేఖ రాయాలని సూచించారు. ఎమ్మెల్యేలు దామచర్ల జనార్దన్, బీఎన్ విజయకుమార్ కోరారు. బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్, కలెక్టర్ అన్సారియా మాట్లాడారు.



మదర్ న్యూబర్న్ కేర్ యూనిట్ శిలాఫలకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

శిశు మరణాలను నివారించాలి

● ఇదే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి స్వామి

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : శిశు మరణాలు తగ్గించడంతోపాటు, ప్రభుత్వ వైద్యశాలలో కార్పొరేట్ వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి పేర్కొన్నారు. ఒంగోలులోని జీజీహెచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్పెషల్ న్యూ బర్న్ కేర్ యూనిట్ (ఎస్ఎన్‌సీయూ), మదర్ న్యూ బార్న్ కేర్ యూనిట్ (ఎంఎన్‌సీయూ) లను మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారీయా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ కంగారూ మదర్ కేర్ సెంటర్‌ను కనిగిరిలో ప్రారంభించుకోవడంతోపాటు, జిల్లా కేంద్రంలో కూడా ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఎంసీహెచ్‌లో ఎస్ఎంసీయూలు ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ తల్లీ, బిడ్డ సంరక్షణ దిశగా, ఆరోగ్యవంతమైన ఎదుగుదల కోసం ఎంఎన్‌సీయూ సెంటర్‌లు కనిగిరి, ఒంగోలులో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ మాట్లాడుతూ జీజీహెచ్ అభివృద్ధిలో మరో అడుగు ముందుకు వేసిందన్నారు. ఒంగోలులోని జీజీహెచ్‌లో ఇప్పటికే కార్పొరేట్ వైద్యం అందించడంతోపాటు, దీర్ఘ కాలిక వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాతతోపాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏడుకొండలు, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ నామినేని కిరణ్ కుమార్, కేఎంసీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ రెడ్డి, డాక్టర్ చెంచయ్య, స్థానిక కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

● నేటితో ముగియనున్న గడువు : డీటీసీ



ఒంగోలు క్రైం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్కూలు, కాలేజీ బస్సులు ఫిట్‌నెస్‌లు తప్పనిసరిగా చేయించుకోవాలని రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల ఓ ప్రకటనలో బుధవారం తెలిపారు. ఈనెల 12తో ఫిట్‌నెస్ గడవు ముగియనుంది. దీంతో ప్రతి బస్సును రెన్యువల్ చేయించుకోవాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వానికి పెండింగ్‌లో ఉన్న ట్యాక్స్ వెంటనే చెల్లించాలని అన్నారు. వాహనచోదకుడి వద్ద బస్సు పర్మిట్, ఇన్సూరెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్ ఉండాలని తెలిపారు. కచ్చితంగా ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్‌ను బస్సులో ఏర్పాటు చేయాలని చెప్పారు. గురువారం అన్ని ప్రాంతాలలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్లు తనిఖీలు చేపడతారని అన్నారు. ఫిట్‌నెస్ ఉన్న బస్సులు మాత్రమే రోడ్డుమీద తిరగాలని ఆమె స్పష్టం చేశారు.

హాస్టళ్లలో దోమల నివారణకు చర్యలు



ఏపీ రెసిడెన్షియల్ స్కూల్‌లో దోమల నివారణ మందును స్ప్రే చేయిస్తున్న డీఎంవో మధుసూదనరావు

సంతనూతలపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పాఠశాలలు తెరుచుకుంటున్న నేపథ్యంలో ప్రభుత్వ హాస్టళ్లలో దోమల నివారణకు చర్యలు చేపట్టినట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి (డీఎంవో) మధుసూదనరావు పేర్కొన్నారు. బుధవారం సంతనూతలపాడు పీహెచ్‌సీ పరిధిలోని ఏపీ రెసిడెన్షియల్ స్కూల్, ఎస్సీ బీసీ హాస్టల్‌ల్లో దోమల నివారణకు ఆయన స్ప్రే చేయించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దోమకాటు వల్ల మలేరియా, డెంగ్యూ, గున్యా వంటి వ్యాధులు రాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఇందుకోసం స్కూల్స్, హాస్టళ్లలోని గదులు, వంటగదుల్లో దోమల నివారణ మందును స్ప్రే చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ పమిడి హరిణి, సబ్‌యూనిట్ అధికారి పాతూరి శ్రీనివాసరావు, హెల్త్‌సూపర్‌వైజర్ కృష్ణ, సీహెచ్‌వో ప్రసాద్, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణం తక్షణమే పూర్తి చేయాలి

సంతనూతలపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సంతనూతలపాడులోని అంబేడ్కర్‌నగర్‌లో నాడు-నేడు కింద అరకొరగా నిర్మించిన మండల పరిషత్ పాఠశాలను వెంటనే పూర్తి చేయాలని బీజేపీ నాయకుడు ఎస్.సుబ్బారావు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అసౌకర్యాల నడుమ విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రతి రైతూ పాడిపంటలతో వర్ధిల్లాలి

- మంత్రులు గొట్టిపాటి, స్వామి
- త్రోవగుంటలో ఏరువాక సాగు ప్రారంభం
- హాజరైన కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్



పొగాకు వేలం కేంద్రంలో మాట్లాడుతున్న మంత్రులు రవికుమార్, స్వామి, ఎమ్మెల్యేలు దామచర్ల, బీఎన్, కలెక్టర్ అన్సారియా

ఒంగోలు(రూరల్), జూన్11(ఆంధ్రజ్యోతి): ప్రతి రైతూ పాడిపంటలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఆకాంక్షించారు. బుధవారం ఒంగోలు నగరం త్రోవగుంటలోని ఒంగోలు పొగాకు బోర్డు వేలం కేంద్రం-2 వద్ద గల పొలాలలో జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏరువాక పౌర్ణమి సాగు కార్యక్రమాలను వారు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్, కలెక్టర్ తమీమ్‌అన్సారియాలతో కలిసి ఘనంగా ప్రారంభించారు. పలు గ్రామాలకు చెందిన రైతులు తమ ఎడ్ల జతలను అందంగా అలంకరించి ఏరువాక ప్రారంభోత్సవానికి తీసుకురావడంతో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం 10.30 గంటలకు వారు పండగ వాతావరణంలో మేడిపట్టి ఎడ్లజతలను తోలుతూ సాగును ప్రారంభించారు. అనంతరం పొగాకు వేలం కేంద్రంలో జరుగుతున్న వేలం ప్రక్రియను వారు పరిశీలించారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, పీడీసీసీ బ్యాంకు అధ్యక్షుడు కామేపల్లి సీతారామయ్య, పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోత యశ్వంత్‌కుమార్, వైస్ చైర్మన్ బొడపాడి బ్రహ్మయ్య, బోర్డు సభ్యులు పొద వరప్రసాద్, పంబి బదిరిరెడ్డి, కామేపల్లి శ్రీనివాసరావు, తెలుగు రైతు నాయకుడు పోలవరపు వెంకటరామయ్య, గుత్తా వాసుబాబు, వడ్డెళ్ల ప్రసాద్, పోతుల నరసింహారావు ,పెనుబోతు సునీల్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసరావు, ప్రకృతిసేద్యం ప్రాజెక్ట్ అధికారి సుభాషిణి, ఉద్యానశాఖ అధికారి గోపీచంద్, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, డీడీ లక్ష్మీనాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, పొగాకు బోర్డు కార్యదర్శి దివి వేణుగోపాల్, విస్తరణ అధికారి జాగర్లమూడి సురేఖ, వేలం కేంద్ర నిర్వహణ అధికారి జె.తులసి, తహసీల్దార్ నాయబ్‌రసూల్, ఏవోలు జి.కిషోర్‌బాబు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో కూటమి ప్రభుత్వ విజయోత్సవ ర్యాలీ

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా గురువారం ఒంగోలులో విజయోత్సవ ర్యాలీ నిర్వహించనున్నారు. ఉదయం 9గంటలకు నెల్లూరు బస్టాండ్ సెంటర్‌లోని రాజధాని వద్ద నుంచి అద్దంకి బస్టాండ్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పాల్గొననున్నారు.

12, 13 తేదీల్లో ఆర్టీసీ బస్‌పాస్‌లు మంజూరు నిలుపుదల

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మంజూరు చేసే ఆర్టీసీ బస్‌పాస్‌లు 12, 13వ తేదీలలో నిలుపుదల చేస్తున్నట్లు ఆర్ఎం సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్‌పాస్‌ల రంగు మార్చడంతోపాటు ఐడీ, టికెట్ స్టాకును కంప్యూటర్ సిస్టంలో అప్‌డేట్ చేసేందుకు, ఇతర సాంకేతిక కారణాల వల్ల గురువారం, శుక్రవారం కౌంటర్ తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

నేడు ఎస్‌జీటీల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి జిల్లాలోని సెకండరీ గ్రేడ్ టీచర్ల బదిలీల కౌన్సెలింగ్ గురువారం ఒంగోలులోని పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రమసంఖ్య 601 నుంచి 1200 వరకు ఉన్న ఉపాధ్యాయులు బదిలీల కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. స్పెషల్ పాయింట్స్, స్పౌజ్ కేటగిరి, ప్రిఫరెన్షియల్ క్యాటగిరి కింద దరఖాస్తులు చేసుకున్న ఉపాధ్యాయులు వారి సేవా పుస్తకాలతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని ఆయన కోరారు.



జిల్లా ఎక్సైజ్ అధికారి ఆయేషాబేగం బాధ్యతల స్వీకరణ



మంత్రి స్వామికి బొకే అందజేస్తున్న ఆయేషాబేగం

ఒంగోలు క్రైం, జూన్11(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఆయేషా బేగం బుధవారం ఒంగోలులోని కార్యాలయంలో బాధ్యతల స్వీకరించారు. నెల్లూరు జిల్లా డిపో మేనేజర్‌గా పనిచేస్తున్న ఆమె బదిలీపై జిల్లా ఎక్సైజ్ అధికారిగా ఒంగోలు వచ్చారు. అనంతరం ఉన్నతాధికారులకు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయేషాబేగం ఓ ప్రకటన విడుదల చేశారు. మద్యం షాపులు, బార్లు యజమానులు సమయపాలన పాటించాలన్నారు. జిల్లాలో ఉన్న 188 మద్యం దుకాణాలు ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటలవరకు, బార్లు ఉదయం 10 నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే మద్యం విక్రయాలు చేయాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

మంత్రిని కలిసిన ఎక్సైజ్ సూపరింటెండెంట్

సింగరాయకొండ: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా నియమితులైన షేక్ ఆయేషాబేగం బుధవారం రాత్రి టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి క్యాంపు కార్యాలయంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. మంత్రి స్వామికి పుష్పగుచ్ఛం అందజేశారు.

జగన్మోహన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలి

సంతనూతలపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మహిళలంటే గౌరవం లేని నాయకుడు జగన్మోహన్‌రెడ్డి అని, వెంటనే రాజధాని మహిళలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీడీపీ రాష్ట్ర సెక్రటరీ అడకాస్వాములు బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాసరావు జర్నలిస్టు ముసుగులో ఓ వ్యక్తిని కూర్చోబెట్టి మహిళల గురించి పైశాచికంగా మాట్లాడటం అన్యాయమని ఆయన విమర్శించారు.

నవధాన్యాల సాగు లాభదాయకం

మద్దిపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ ముందు వేసవిలో నవధాన్యాలు వేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందని వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ అన్నారు. బుధవారం గుండ్లాపల్లిలోని పల్లకి సత్యనారాయణరెడ్డి పొలంలో నవధాన్యాలను ఆయన చల్లారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ రైతులు తమ భూమి సారవంతంగా ఉండేందుకు నవధాన్యాలను చల్లుతారని తెలిపారు. ఇందుకోసం ప్రత్యేకంగా నవధాన్యాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌జీవో హర్ష, ఐటీసీ ప్రతినిధులు జస్వంత్, శరత్, పల్లకి రామసుబ్బారెడ్డి, పల్లకి సత్యనారాయణరెడ్డి, వీరగంధం రఘుబాబు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

















రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

- 66 మంది డీటీలు, మరో 44మంది ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పలు మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని బదిలీచేస్తూ జిల్లా కలెక్టర్ తమీమ్అన్సారియా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రధానంగా డిప్యూటీ తహసీల్దార్లు(డీటీ)లు 66 మంది ఉండగా ఆర్ఐలు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు మరో 44 మంది ఉన్నారు. పలు మండలాల్లో పనిచేస్తున్న డిప్యూటీ తహసీల్దార్లు, ఎన్ఫోర్స్‌మెంట్ డిప్యూటీతహసీల్దార్లు, సర్వే డిప్యూటీ తహసీల్దార్లు, ఎంఎల్ఎస్ పాయింట్లలో పనిచేస్తున్న డీటీలు బదిలీ అయ్యారు. జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు ఇలా ఉన్నాయి...

- సింగరాయకొండ రీసర్వే డీటీగా పనిచేస్తున్న పి.గాయత్రిని చీమకుర్తి, ఒంగోలులోని పీవీఎస్‌వీపీ యూనిట్‌లో పనిచేస్తున్న ఎన్‌టీవీ రాజేష్‌ను ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ-1గా, గిద్దలూరులో పనిచేస్తున్న నాయబ్ రసూల్‌ను గిద్దలూరు రీసర్వే డీటీగా, వైపాలెం రీసర్వే డీటీగా పనిచేస్తున్న ఎస్.ప్రవీణ్‌కుమార్‌ను సింగరాయకొండ రీసర్వే డీటీగా, వైపాలెంలో పనిచేస్తున్న ఎస్.మలికార్జున్‌ను దోర్నాలకు, సంతనూతలపాడులో పనిచేస్తున్న ఎస్.మాబుసుభాన్‌ను మర్రిపూడి రీసర్వే డీటీగా, కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న ఎం.రమేష్‌ను హనుమంతునిపాడు రీసర్వే డీటీగా, దోర్నాల రీసర్వే డీటీగా పనిచేస్తున్న కేవీ సాయిప్రద్యుమ్నను టంగుటూరు రీసర్వే డీటీగా, లింగసముద్రంలో పనిచేస్తున్న కే శ్రీనివాసరావును నాగులుప్పలపాడు, సింగరాయకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ కే శివరామకృష్ణను పామూరు, జరుగుమల్లి రీసర్వే డీటీ సాయిపవన్‌ను ఆర్అండ్ఆర్ యూనిట్ మార్కాపురం, కంభం ఆర్అండ్ఆర్ యూనిట్‌లో పనిచేస్తున్న కేఆర్ భూపతిని కనిగిరి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, హనుమంతునిపాడులో పనిచేస్తున్న కే నర్సయ్యను పామూరు రీ సర్వే డీటీగా, పుల్లలచెరువులో పనిచేస్తున్న కే కిరణ్‌ను త్రిపురాంతకం, కొండపి రీసర్వే డీటీ కాశయ్యను సింగరాయకొండ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, కొండపిలో పనిచేస్తున్న కే ధర్మతేజ్‌పాల్‌ను పీసీపల్లి, కొండపి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ డేవిడ్‌రాజును పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, ఒంగోలు అర్బన్‌లో పనిచేస్తున్న కే అశోక్‌కుమార్‌ను ఒంగోలు రూరల్ డీటీగా, మార్కాపురం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న కే అర్చనను మార్కాపురం ఎంఎల్ఎస్ పాయింట్‌కు, తాళ్లూరులో పనిచేస్తున్న జే ఇమ్మానియేల్ రాజును కనిగిరి ఆర్డీవో కార్యాలయానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- కనిగిరిలో పనిచేస్తున్న జీ రమేష్‌ను పామూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు, త్రిపురాంతకంలో పనిచేస్తున్న జి.గోపాల్‌రెడ్డిని పుల్లలచెరువు, ఎన్‌జిపాడు రీసర్వే డీటీ జి.పణీంద్రను తాళ్లూరుకు, రాచర్ల రీసర్వే డీటీ భారతి బాయ్‌ని బేస్తవారపేటకు, ఒంగోలులోని డ్వామా కార్యాలయంలో పనిచేస్తున్న జి. ఆశాజ్యోతిని ఒంగోలులోని పీవీఎస్‌వీపీ యూనిట్‌కు, మర్రిపూడి రీ సర్వే డీటీ డి ప్రకాష్‌ను ఆర్అండ్ఆర్‌యూనిట్ మార్కాపురం, మార్కాపురం ఆర్అండ్ ఆర్ యూనిట్‌లో పనిచేస్తున్న డి.పార్వతిబాయ్‌ని కంభం ఆర్అండ్ఆర్ యూనిట్‌కు, ఒంగోలు ఆర్అండ్ఆర్ యూనిట్‌లో పనిచేస్తున్న డీసీహెచ్ కోటేశ్వరరావును కలెక్టరేట్‌కు, దర్శి రీ సర్వే డీటీ సీహెచ్ శ్రీనివాస్‌ను సంతనూతలపాడు రీసర్వే డీటీగా, పీసీపల్లిలో పనిచేస్తున్న సీహెచ్ పృథ్వీరాజ్‌ను కనిగిరి ఆర్డీవో ఆఫీసుకు, కొత్తపట్నంలో పనిచేస్తున్న సీహెచ్ కృష్ణమోహన్‌ను ఒంగోలు అర్బన్ డీటీగా, అర్ధవీడులో పనిచేస్తున్న బీవీఎస్ఎన్ ప్రసాద్‌ను గిద్దలూరు ఎంఎల్ఎస్ పాయింట్‌కు, సంతమాగులూరులో పనిచేస్తున్న బీవీ భాస్కరరెడ్డి వైపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న బీ రాజ్యలక్ష్మిని జరుగుమల్లి రీసర్వే డీటీగా, సంతనూతలపాడు రీ సర్వే డీటీ గోపాలకృష్ణను ఒంగోలులోని డ్వామా కార్యాలయం, పామూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న పి. మధుసూదనరావును వీవీ పాలెం, పీవీఎస్‌వీపీ ఒంగోలులో పనిచేస్తున్న సీహెచ్ లక్ష్మమ్మను కురిచేడు, కురిచేడులో పనిచేస్తున్న బి.రామానాయుడును కొత్తపట్నం డీటీగా బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న వై.స్వాతిని రాచర్ల రీసర్వే డీటీగా, టంగుటూరు రీసర్వే డీటీగా పనిచేస్తున్న వై.మాధవిని ఒంగోలు పీవీఎస్‌వీపీ యూనిట్‌కు, దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న వీవీఎల్ ప్రసన్నను కురిచేడు రీ సర్వే డీటీగా, పీసీపల్లి రీసర్వే డీటీని వీ వీరయ్యను కంభం ఆర్అండ్ఆర్‌యూనిట్‌కు, పామూరులో పనిచేస్తున్న బ్రహ్మయ్యను కొండపి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, తర్లుపాడులో పనిచేస్తున్న యు.విజయభాస్కర్‌ను వైపాలెంకు, హనుమంతునిపాడు రీ సర్వే డీటీ టి. విష్ణువర్ధన్‌ను ఎన్‌జీపాడు రీసర్వే డీటీగా, పొన్నలూరు రీసర్వే డీటీ టీ తిరుమలరావును సింగరాయకొండ రీ సర్వే డీటీగా, మార్కాపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న టీ రామకృష్ణను పెద్దారవీడు, మార్కాపురం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న టీ ప్రసాద్‌ను సింగరాయకొండకు, దొనకొండ ఎంఎల్ఎస్ పాయింట్‌లో పనిచేస్తున్న ఎస్‌కే సుష్మను మార్కాపురం రీసర్వే డీటీగా, చీమకుర్తి రీసర్వే డీటీ ఎస్‌కే షమీవుల్లాను ఒంగోలులోని సెప్ కార్యాలయానికి, బేస్తవారిపేటలో పనిచేస్తున్న ఎస్‌కే పర్వీన్‌ను అర్ధవీడు డీటీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.
- సింగరాయకొండలో పనిచేస్తున్న ఎస్‌కే ముస్తాక్‌ను కనిగిరి ఎంఎల్ఎస్ పాయింట్‌కు, మద్దిపాడు రీసర్వే డీటీ ఎస్‌కేఎండీ రఫీని సంతనూతలపాడు ఎలక్షన్ డీటీగా, పెద్దారవీడులో పనిచేస్తున్న ఎస్‌కే ఇబ్రహీంను గిద్దలూరు ఎలక్షన్ డీటీగా, ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా పనిచేస్తున్న ఎస్‌కే ఫిరోజ్‌బాషాను మార్కాపురం రీసర్వే డీటీగా, గిద్దలూరు ఎలక్షన్ డీటీగా పనిచేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఎస్ రామానారాయణరెడ్డిని గిద్దలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, అర్ధవీడు రీసర్వే డీటి ఎస్.రహమాన్‌బాషను పుల్లలచెరువు రీసర్వే డీటీగా, వైపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాధాకృష్ణను దర్శి ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, వైపాలెం ఎలక్షన్ డీటీ ఎస్ చంద్రశేఖర్‌ను వైపాలెం ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీగా, కలెక్టరేట్‌లో పనిచేస్తున్న ఆర్‌వీఎస్ కృష్ణమోహన్‌ను ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ-2గా, దోర్నాలలో పనిచేస్తున్న ఆర్ సల్మాను దోర్నాల రీసర్వే డీటీగా, పొదిలి ఎన్‌ఫోర్స్‌మెంట్‌డీటీగా పనిచేస్తున్న సురభిని ఆర్డీవో ఆఫీసు ఒంగోలు, కురిచేడు రీ సర్వే డీటీ శ్రీనివాసులును దర్శి రీ సర్వే డీటీగా, గిద్దలూరు రీ సర్వేడీటీ నరేష్‌ను సంతమాగులూరు రీ సర్వే డీటీగా నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

మార్కాపురం మున్సిపాలిటీలో నెగ్గిన అవిశ్వాసం


అవిశ్వాస తీర్మాన ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ప్రిసైడింగ్ అధికారి ఓబులేసు

- వైసీపీ నుంచి చేజారిన చైర్మన్ పీఠం
- ఎమ్మెల్యే కందులతోపాటు 23 మంది కౌన్సిలర్లు హాజరు
- సమావేశంలో పాల్గొన్న ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు

మార్కాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఎట్టకేలకు మార్కాపురం మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణారావు గద్దె దిగారు. ఆయనపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. మున్సిపాలిటీ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన అవిశ్వాస తీర్మాన సమావేశానికి ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డితోపాటు 23 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. పది మంది వైసీపీ, ఒక టీడీపీ కౌన్సిలర్లు సమావేశానికి గైర్హాజరయ్యారు. డీఆర్వో ఓబులేసు ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేసినా కౌన్సిలర్లు ఎవరూ రాకపోవడంతో ప్రిసైడింగ్ అధికారి ఓబులేసు మధ్యాహ్నం 3.00 గంటలకు సమావేశం నిర్వహించారు. క్యాంపులో ఉన్న టీడీపీ కౌన్సిలర్లు 16 మంది ఎమ్మెల్యేతో కలిసి ఒక్కసారిగా మున్సిపల్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వారంతా సమావేశ మందిరంలోకి వెళ్లగానే, మరో ఏడుగురు వైసీపీ కౌన్సిలర్లు కూడా కార్యాలయం వద్దకు చేరుకున్నారు. 2/3వ వంతు కౌన్సిలర్లు హాజరుకావడంతో ప్రిసైడింగ్ అధికారి అవిశ్వాస తీర్మాన ప్రక్రియను ప్రారంభించారు. తొలుత మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణారావు మీద పెట్టిన అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా చేతులు ఎత్తాలని కోరారు. హాజరైన 23 మంది కౌన్సిలర్లలో 18 మంది, ఎక్స్అఫీషియో సభ్యులైన ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి కూడా చేతులు ఎత్తారు. దీంతో అవిశ్వాస తీర్మానం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి ఓబులేసు ప్రకటించారు. దీంతో చైర్మన్ చిర్లంచర్ల పదవీచ్యుతుడయ్యారు. ఈ మేరకు అవిశ్వాస తీర్మానంపై జరిగిన నివేదికను కలెక్టర్‌కు నివేదించనున్నట్లు పీవో ఓబులేసు తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ డీవీఎస్ నారాయణరావు పాల్గొన్నారు.

పటిష్ట పోలీసు బందోబస్తు

మున్సిపాలిటీలో అవిశ్వాస తీర్మానం సమావేశం నేపథ్యంలో పోలీసులు గట్టి బందోబస్తు చర్యలు చేపట్టారు. కార్యాలయ ప్రాంతంలో 144 సెక్షన్ విధించారు. కార్యాలయంలోకి ఉద్యోగులు, సిబ్బందిని మినహా ఎవరినీ అనుమతించలేదు. కౌన్సిలర్లను కూడా తనిఖీ చేసి ఫోన్‌లు స్వాధీనం చేసుకుని లోపలికి పంపారు. పలువురు టీడీపీ, జనసేన పార్టీ నాయకులు సమావేశ మందిరం వద్దకు వెళ్లాలని ప్రయత్నించినా పోలీసులు సహకరించలేదు. సీఐ సుబ్బారావు పర్యవేక్షణలో టౌన్, రూరల్ ఎస్సైలు సైదుబాబు, అంకమ్మరావు సుమారు 50 మంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.


అవిశ్వాస తీర్మానంలో పాల్గొన్న కౌన్సిలర్లు

వైసీపీ కౌన్సిలర్ల మద్దతుతో నెగ్గిన అవిశ్వాసం

మున్సిపల్ కౌన్సిల్‌లో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, టీడీపీ బలం కేవలం ఐదుగురుమాత్రమే. కొన్నాళ్ల కిందట 12 మంది వైసీపీ కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్ల సంఖ్య 17కు చేరింది. మున్సిపాలిటీ అవినీతి, అక్రమాలకు నెలవుగా మారడం, అభివృద్ధి పనులకు ఆటంకం కలుగుతుండడంతో ఎలాగైనా వైసీసీకి చెందిన చైర్మన్ చిర్లంచర్లను గద్దెదించాలని నిర్ణయించుకున్నారు. అవిశ్వాస తీర్మానానికి కొందరు వైసీపీ కౌన్సిలర్లు కూడా మద్దతు తెలుపుతామని చెప్పడంతో మార్గం సుగమమైంది. ముఖ్యంగా సొంత పార్టీకి చెందిన కౌన్సిలర్లకు కనీస మర్యాద ఇవ్వకపోవడం, చిన్నపాటి పనులకు కూడా పర్సంటేజీలు అడగడం, చివరికి బర్త్, డెత్ సర్టిఫికెట్లకు కూడా డబ్బులు డిమాండ్ చేస్తుండడాన్ని వైసీపీ కౌన్సిలర్లు జీర్ణించుకోలేకపోయారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఈ నెల 11న అవిశ్వాసానికి సమావేశం నిర్వహించాలని ఆదేశాలు ఇచ్చారు. ఆ మేరకు బుధవారం జరిగిన సమావేశంలో అవిశ్వాసం నెగ్గింది. చైరన్‌పీఠం ఖాళీ అయింది.

నేడు 104 సంచార వైద్యశాలల్లో ఇంటర్వ్యూలకు హాజరుకావాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 104 సంచార వైద్యశాలల్లో డ్రైవర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల నియామకానికి గురువారం ఉదయం పది గంటలకు పాత రిమ్స్‌లోని 108, 104 కార్యాలయంలో తమ దరఖాస్తులు, ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని 104 సేవల సర్వీస్ ప్రొవైడర్ హెచ్ఆర్ మేనేజర్ భవ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు డిగ్రీ పూర్తయ్యి కంప్యూటర్ కోర్సు చేసి ఉండాలని, డ్రైవర్ నియామకానికి పదో తరగతి పాసై హెవీ డ్రైవింగ్ లైసెన్సు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు.

ప్రశాంతంగా మెగా డీఎస్సీ

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో జరుగుతున్న మెగా డీఎస్సీ కంప్యూటర్ ఆధారిత పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం సెషన్‌లో రెండుపరీక్షా కేంద్రాల్లో 315 మంది అభ్యర్థులను కేటాయించగా 299 మంది హాజరు కాగా 16 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం సెషన్‌లో ఐదు పరీక్షా కేంద్రాల్లో 604 మందిని కేటాయించగా 536 మంది హాజరు కాగా 69 మంది గైర్హాజరయ్యారు. పరీక్షలు రెండు సెషన్లలో ప్రశాంతంగా జరిగాయి.

ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడానికే వచ్చిన జగన్

ఆయన పొదిలి పర్యటనలో చోటుచేసుకున్న ఘటనలపై ఎమ్మెల్యే కందుల ధ్వజం

కొనకనమిట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతాన్ని కలుషితం చేయడానికే జగన్ పొదిలి పర్యటనకు వచ్చారని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రాజధాని మహిళా రైతులపై జగన్‌రెడ్డి సొంత మీడియా సాక్షిలో కొమ్మినేని శ్రీనివాసరావు, కృష్ణంరాజు చేసిన అసభ్య వ్యాఖ్యలను నిరసిస్తూ బుధవారం మహిళలు పెద్దఎత్తున నిరసన ర్యాలీ చేపట్టారు. వారికి సంఘీభావంగా ఎమ్మెల్యే కందుల పాల్గొని మాట్లాడారు. ఈ ఏడాది రైతులు పొగాకుకు ఇచ్చిన లక్ష్యానికి మించి పండించారన్నారు. అంతర్జాతీయ మార్కెట్ దృష్ట్యా కొంత ధరలు తగ్గిన మాట వాస్తవమేనని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలతో పొదిలి పొగాకు బోర్డుకు వెళ్లి కంపెనీ యాజమాన్యాలతో మాట్లాడి కొనుగోలులో వేగం పెంచినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అంతా సవ్యంగా జరుగుతుండగా ఇప్పుడు జగన్‌రెడ్డి వచ్చి ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమన్నారు. అన్ని వర్గాల రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని కందుల స్పష్టం చేశారు. వైసీపీ పాలనలో రైతులు, అన్ని వర్గాల ప్రజలు నష్టపోయారని గుర్తు చేశారు. నాడు రైతులను పట్టించుకోని జగన్ నేడు కపటప్రేమ చూపుతున్నారని కందుల ధ్వజమెత్తారు. అమరావతి మహిళలను కించపరిచిన వారిపై, ఆ చానల్‌పై చర్యలు తీసుకోవాలని శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మహిళలపై వైసీపీ నాయకులు రాళ్లు రువ్వడం అమానుషమన్నారు. ఈ నిరసన ర్యాలీ కొనకనమిట్ల బస్టాండ్ సెంటర్ నుంచి పోలీస్‌స్టేషన్ వరకు సాగింది. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


నిరసన ర్యాలీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ప్రశాంతంగా ఎస్‌జీటీల బదిలీల కౌన్సెలింగ్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుల బదిలీల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. స్థానిక పాత జిల్లా పరిషత్ సమావేశపు హాలులో బుధవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. డీఈవో కిరణ్‌కుమార్ నేతృత్వంలో కౌన్సెలింగ్ ప్రారంభం కాగా విద్యాశాఖ గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ అబ్రహంలు పాల్గొన్నారు. మంగళవారం కొంత వివాదం జరగడంతో కౌన్సెలింగ్‌ను నిలిపిన విషయం తెలిసిందే. బుధవారం మాన్యువల్ కౌన్సెలింగ్‌ను పటిష్టంగా అమలు చేశారు. సీరియల్ నెంబరు 1 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభించారు. ఉపాధ్యాయుల ఖాళీల వివరాలను కంప్యూటర్ స్క్రీన్‌పై డిస్‌ప్లేచేస్తూ ఉపాధ్యాయులు వారికి కావాల్సిన స్థానాలు కోరుకునే విధంగా ఏర్పాటు చేశారు. అలా రాత్రి పొద్దుపోయే సరికి సుమారు 600 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. కాగా ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో పాత జిల్లా పరిషత్ హాలు బయట వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు టెంట్లతోపాటు చల్లటి నీరు కూడా ఏర్పాటు చేశారు.

జగన్ పర్యటనను అడ్డుకొనేందుకు కుట్రలు

- ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వేల సంఖ్యలో ప్రజలు
- సమావేశంలో ఎమ్మెల్యే బూచేపల్లి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు బాసటగా నిలిచేందుకు పొదిలి వచ్చిన వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పర్యటనను అడ్డుకొనేందుకు మహిళల ముసుగులో టీడీపీ నాయకులు కుట్ర పన్నారని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి శాసన సభ్యుడు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి చెప్పారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డిని అడ్డుకొనేందుకు టీడీపీ నాయకులు మహిళలను తీసుకొచ్చి రభస చేసేందుకు కుట్ర పన్నడం దుర్మార్గంగా ఉందని చెప్పారు. జగన్ పర్యటనకు వేలాది మంది వచ్చారని, తాము ఊ.. అంటే వారు ఎక్కడ ఉండేవారని ప్రశ్నించారు. వైసీపీ ప్రభుత్వంలో మార్క్‌ఫెడ్ ద్వారా పొగాకు కొనుగోలు చేసి ఆదుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి మెప్పుపొందేందుకు రెండు రోజుల నుంచి కొందరు తిరుగుతూ రెచ్చగొట్టే ప్రయత్నం చేశారన్నారు. రానున్న రోజుల్లో ఇదేవిధంగా వ్యవహరిస్తే తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మేరుగ నాగార్జున, వైసీపీ ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు బత్తుల బ్రహ్మానంద రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవి బాబు పాల్గొన్నారు.

ఇద్దరి ఫిర్యాదు మేరకు రెండు కేసుల నమోదు

పొదిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పొదిలిలో బుధవారం నిర్వహించిన వైసీపీ అధినేత జగన్ పర్యటనలో జరిగిన దాడిలో ఇద్దరు ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చేసినట్లు సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడినందుకు శాంతియుతంగా నిరసన తెలియజేస్తున్న మహిళలపై రాళ్లు రువ్వడం, విధుల్లో ఉన్న పోలీసులపై దాడి చేసి గాయపరిచారని జ్యోతి మల్లికార్జున్, ముల్లా ఖుద్దూస్‌లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఇప్పటికే కొంతమందిని గుర్తించామని, వారిని త్వరలో అరెస్ట్ చేస్తామని సీఐ చెప్పారు.

గూడెంలో కేంద్ర బృందం పర్యటన

పథకాల అమలుపై ఆరా

పెద్దదోర్నాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మలబైలు చెంచుగిరిజన గూడెంలో కేంద్ర బృందం బుధవారం పర్యటించింది. గ్రామీణాభివృద్ధి శాఖల ద్వారా అమలవుతున్న పథకాలపై బృంద సభ్యులు గిరిజనులతో మాట్లాడారు. వాటి అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మండలంలోని తుమ్మలబైలు గిరిజన గ్రామాన్ని కేంద్ర గ్రామాభివృద్ధి శాఖ దిశ విభాగం జాయింట్ డైరెక్టర్ ఉమేష్ కుమార్‌రామ, అడ్మిన్‌స్ట్రేటివ్ అధికారి జీఎస్ రావత్, కమిషనర్ ఆఫ్ పంచాయతీ రాజ్ అండ్ గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ షణ్ముఖ్‌కుమార్, ఐటీడీఏ స్టేట్ ప్రోగ్రాం మేనేజర్ కేజీ నాయక్ డ్వామా పీడీ జోసఫ్‌కుమార్, డీఆర్‌డీఏ ఏరియా కోఆర్డినేటర్ లక్ష్మీరెడ్డి, ఏపీడీ నిర్మలా దేవి సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో గిరిజనులు మాట్లాడుతూ విస్తర్ల తయారీ కేంద్రానికి బిల్డింగ్ సరిపోవడం లేదని మరో భవనాన్ని నిర్మించాలని, అదే విధంగా అటవీప్రాంతం లోపలకు మాడపాకులు తెచ్చుకునేందుకు అటవీ శాఖాధికారులు అడ్డుకుంటున్నారని, జూట్ సంచుల తయారీకి రామెటీరియల్ సరఫరా చేయాలని చెంచులు బృందం దృష్టికి తెచ్చారు. అంతేగాక కొన్ని గ్రామాల్లో విద్యుత్ త్రీఫేజ్ సరఫరా ఏర్పాటు చేసి తమ గ్రామానికి చేయలేదని తెలిపారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా సాగు చేసిన మామిడి తోటను బృందం పరిశీలించింది. జలసిరి ద్వారా బోరుబావులు తవ్విస్తే మరిన్ని ఎకరాలు పండ్ల తోటలు సాగు చేస్తామని గిరిజనులు తెలిపారు. అనంతరం దోర్నాల వెలుగు కార్యాలయంలో పొదుపుమహిళలతో సమావేశమయ్యారు.

గరుడ వాహనంపై వరాహ లక్ష్మీనరసింహుడు విహారం

- పాతసింగరాయకొండలో వైభవంగా బ్రహ్మోత్సవాలు
- స్వామివారిని దర్శించుకున్న వేలాదిమంది భక్తులు

సింగరాయకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు కన్నులపండువలాజరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన బుధవారం శ్రీదేవి, భూదేవి సమేత వరాహ లక్ష్మీనరసింహస్వామి, యోగానంద లక్ష్మీనరసింహస్వామి, స్వయంభు ఆంజనేయుడిని పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పూజలు తరువాత లక్ష్మీనరసింహుడు చప్పరం వాహనంపై మోహినిరూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం మోతకాపులు స్వామివారిని గ్రామోత్సవానికి తీసుకెళ్లారు. రాత్రికి స్వామి గరుత్మంతుడి వాహనంపై కొలువుదీరారు. రాత్రికి ఏర్పాటు చేసిన డ్యాన్స్ కార్యక్రమం, కోలాటం, భజనా కార్యక్రమాలు భక్తులను అలరించాయి.


మోహిని వాహనంపై లక్ష్మీనరసింహుడు


స్వామి గ్రామోత్సవం

నేడు గజోత్సవం

స్వామివారికి గురువారం ఉదయం చప్పరసేవ జరుగుతుంది. రాత్రికి వసంతోత్సవం ఉంటుంది. తెల్లవారుజామున గజవాహనంపై భక్తులకు దర్శనమిస్తారు. శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో ప్రభ, సినీపాటకచేరి, కూచిపూడి, భక్త చింతామణి నాటకం ఏర్పాటు చేయనున్నారు.



సింహం బొమ్మను ఆవిష్కరించిన మంత్రి స్వామి, ఎమ్మెల్యే దామచర్ల, మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

నగరానికి 'సింహ'ం ద్వార ప్రవేశం

ఒంగోలు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సింహం బొమ్మను సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ బుధవారం ఆవిష్కరించారు. స్థానిక దక్షిణ బైపాస్‌లోని నగర ప్రవేశం ద్వారంలో గల సెంటర్ డివైడర్‌లో ఏర్పాటు చేసిన భారీ సింహం బొమ్మ నగర అందాలను తెలియజేస్తుందని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటేశ్వరరావు, మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కూటమి నాయకులు పాల్గొన్నారు.

- ఒంగోలు కార్పొరేషన్, (ఆంధ్రజ్యోతి)

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అధిక ఫీజులు వసూలు చేస్తున్న కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి.అవినాష్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు కాలేజీలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయని ఆరోపించారు. నిబంధనల ప్రకారం ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదన్నారు. ఆయా విద్యాసంస్థల్లోనే అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాంలు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తేళ్ల వర్షిత్, శామ్యూల్, సందీప్, చిన్నబాబు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

నగర అభివృద్ధి కోసం నిరంతరం కృషి

- ఏడాదిలోనే రూ.124 కోట్లతో పలు అభివృద్ధి పనులు
- ఎమ్మెల్యే దామచర్ల

ఒంగోలు కార్పొరేషన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం నగర అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి తన ఏడాది పాలనలో రూ.124 కోట్లతో నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు ఆయన చెప్పారు. బుధవారం ఒంగోలులోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గడిచిన ఎన్నికల్లో ప్రజలు తనపై నమ్మకం ఉంచి అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. వారి నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా బాధ్యతలు స్వీకరించిన తొలిరోజు నుంచే అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కాలంలో 670 అభివృద్ధి పనులు చేపట్టామని, అందులో 137 పనులు పూర్తయ్యాయని పేర్కొన్నారు. మరో 358 పనులు జరుగుతున్నాయని, ఇంకా 175 పనులు టెండర్ దశలో ఉన్నాయని వెల్లడించారు. నగర అభివృద్ధిలో భాగంగా రోడ్ల విస్తరణ, సీసీ డ్రైన్‌ల నిర్మాణం, కొత్తగా సీసీరోడ్లు, శ్మశాన వాటికల ప్రహరీలు, చెత్త



వెంగముక్కలపాలెంలో డ్రైనేజీ నిర్మాణం కోసం శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల

సేకరణకు కొత్త వాహనాలు, సెంటర్ డివైడర్స్ అభివృద్ధితోపాటు నగర అందాలను మరింతగా తీర్చిదిద్దేందుకు పచ్చని మొక్కలు, గ్రీన్ బెల్ట్‌ల ఏర్పాటు, ట్రిపుల్‌ఆర్ పార్కులు నిర్మాణం చేపట్టినట్లు దామచర్ల తెలిపారు. వర్షాకాలం రానున్న నేపథ్యంలో కార్పొరేషన్ నిధులు వెచ్చించి పోతురాజు కాలువలో పూడికతీత పనులు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతిరోజు తాగునీరు అందించే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. గత వైసీపీ పాలనలో నిర్లక్ష్యంగా వదిలేసిన నగరాన్ని అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని తెలిపారు. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, ఎంఈ చంద్రయ్య, అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నగరంలో పలు పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే దామచర్ల శంకుస్థాపనలు చేశారు. ముందుగా 18వ డివిజన్‌లోని వెంగముక్కలపాలెంలో రూ.54లక్షలతో నిర్మించనున్న సీసీడ్రైన్‌కు, 15వ డివిజన్‌లోని అగ్రహారం గేట్ వద్ద రూ.48 లక్షల వ్యయంతో సీసీడ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే 46వ డివిజన్‌లోని అంజయ్యరోడ్‌లో సూర్య బలిజ ఆరామ క్షేత్రాన్ని ప్రారంభించారు. అదే డివిజన్‌లో రూ.37లక్షలతో నిర్మించినున్న సీసీడ్రైన్‌కు శంకుస్థాపన చేశారు. కొత్తపట్నం మండలం రంగాయపాలెంలో రూ.90లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్‌ను ఎమ్మెల్యే దామచర్ల ప్రారంభించారు.

యరజర్ల గ్రామంలో...

ఒంగోలు(రూరల్): ఒంగోలు మండలం యరజర్ల గ్రామంలో సీసీరోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దామచర్ల బుదవారం శిలాఫలకం ఆవిష్కరించారు. 18పనులకు రూ.82 లక్షలు ఉపాధి నిధులతో సీసీరోడ్ల నిర్మాణాలు చేపట్టనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో ఎ.బాలచెన్నయ్య, ఏఈ రామ్‌ప్రసాద్, ఎంపీటీసీ జి.శ్రీనివాసులు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు కంకణాల శ్రీనివాసరావు, దామచర్ల కోటయ్య, జాజుల హరికృష్ణ, కర్పూరపు కోటేశ్వరరావు, చెన్నుపాటి భాస్కర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం రైతులు ఐక్యం కావాలి

- పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలి
- మాజీ మంత్రి శోభనాద్రీశ్వరరావు డిమాండ్

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం ఐక్యంగా రోడ్డెక్కి పోరాడాలని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పేర్కొన్నారు. ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో జరిగిన రైతు సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏ సమస్య పరిష్కారం అయినా ఐక్య పోరాటాల ద్వారానే సాధ్యమవుతుందని తెలిపారు. ఉత్తర భారతదేశ రైతుల్లో ఉన్న ఐక్యత రాష్ట్రంలో కొరవడిందన్నారు. పాలకులు రైతులను కులాలు, మతాలు, రాజకీయపార్టీలు, ప్రాంతాల పేరుతో విడగొట్టి సమస్యలు పరిష్కారం కాకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. రైతు నాయకుల పేరుతో కొందరు బ్రోకర్లు కార్పొరేట్ శక్తులకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బర్లీపొగాకు రైతు అనేక రూపాల్లో పోరాటాలు, నిరసనలు చేసి కంపెనీలు, ప్రభుత్వం చేత కొనుగోలు చేసేలా పోరాటం చేసి సాధించుకున్నారని తెలిపారు. డబుల్



సదస్సులో మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు

ఇంజన్ సర్కారు పాలనలో రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి కనిపిస్తుందన్నారు. విదేశాల్లో పరిశ్రమలతో పాటు వ్యవసాయానికి తగిన ప్రాధాన్యత ఇస్తుంటే, ఇక్కడ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. రిటైర్డ్ ప్రొఫెసర్ నాగమోతు వేణుగోపాలరావు మాట్లాడుతూ రాష్ట్రంలో రైతుల సమస్యలకు జిల్లా రైతాంగం దిక్సూచిగా నిలవాలన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పంటల బీమా పథకంలోని రైతుల సొమ్మును బీమా సంస్థలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెంట్యాల హనుమంతరావు మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సబ్సిడీతో ప్రభుత్వాలు అందించాలన్నారు. వేదిక జిల్లా అధ్యక్షుడు చుండూరి రంగారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో నాయకులు కోటేశ్వరరావు, కోడూరి నాంచార్లు, కె.వీరారెడ్డి, బి.సుబ్బారావు, చుంచు శేషయ్య, జె.జయంతిబాబు, చావలి సుధాకర్, ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలతో జిల్లా అభివృద్ధి

- బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి 'జీవీఎల్'

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు అనేక పథకాల ద్వారా లబ్ధి చేకూరిందని బీజేపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్.నరసింహారావు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ 11 సంవత్సరాల సేవా, సుపరిపాలన దినోత్సవంలో భాగంగా బుధవారం ఒంగోలులోని ఏకేవీకే కళాశాలలో



సభలో మాట్లాడుతున్న నరసింహారావు

జరిగిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అమ్మకోసం ఒక మొక్క అనే నినాదంతో ఒక మొక్కను నాటారు. అనంతరం జరిగిన సభలో జీవీఎల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా జిల్లాకు ప్రధానమంత్రి అవాస్‌యోజన కింద 69,798 ఇళ్లను కేటాయించగా 23,968 గృహాలు పూర్తయ్యాయని తెలిపారు. స్వచ్ఛ భారత్‌మిషన్ కింద ప్రతి ఇంటికి మరుగుదొడ్లను మంజూరు చేశారని చెప్పారు. భారత్ మాల ఫేజ్-1 కింద గిద్దలూరు నుంచి వినుకొండ వరకు ఎన్‌హెచ్-544డి అభివృద్ధి, గొట్లగట్టు నుంచి ఒంగోలు వరకు ఎన్‌హెచ్-565 నిర్మాణం చేసినట్లు తెలిపారు. పీఎం కిసాన్ యోజన కింద 3.79 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందన్నారు. జిల్లాలో వాడరేవుల ఫిషింగ్ హార్బర్ అభివృద్ధితో పాటు కనిగిరి వద్ద నిమ్జ్, అమృత్ పథకం కింద గిద్దలూరు, అద్దంకి, పొదిలి, ఒంగోలు, చీమకుర్తి, దర్శి, కనిగిరి, మార్కాపురం, కందుకూరు, చీరాలకు రూ.1017 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. జిల్లాకేంద్రమైన ఒంగోలు అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని వెల్లడించారు. జిల్లా అధ్యక్షుడు శెగ్గం శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 ఏళ్ళ మోదీ పాలనలో అనేక ఆర్థిక సంస్కరణలు, కశ్మీర్‌లో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించి ప్రపంచంలో భారతదేశాన్ని అగ్రగామిగా నిలిపారన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు పీవీ.శివారెడ్డి, పీవీ.కృష్ణారెడ్డి, కూకట్ల నాగేశ్వరరావు, మాకినేని అమరసింహ, దండు శ్రీనివాసరావు, కావూరి వాసు, జె.రమాదేవి, ఆశారావు, విజయారావు, బొద్దులూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా రామాలయ వార్షికోత్సవం

- ఎమ్మెల్యే బీఎన్ ప్రత్యేక పూజలు

చీమకుర్తి, జూన్11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మర్రిపాలెం గ్రామంలో కోదండరామస్వామి ఆలయ పదో వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ ఈ వేడుకల్లో పాల్గొన్ని ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, పాలడుగు నారాయణ, రావిపాటి రాంబాబు, వేల్పుల శ్రీనివాసరావు, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, బొడ్డు రవి, బ్రహ్మాజీ. బొడ్డు రామలింగం, బొడ్డు రామారావు, అవనిగడ్డ శేషారావు, స్థానికులు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సంతనూతలపాడు: మండలంలో ఆరుగురు లబ్ధిదారులకు వైద్యఖర్చుల నిమిత్తం సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.2,81,801లను ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ అందజేశారు. బుధవారం ఒంగోలులోని బీఎన్ నివాసంలో ఈమేరకు వారికి చెక్కులను అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొ న్నారు.



రామాలయంలో స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్, నాయకులు

పలువురు తహసీల్దార్లు బాధ్యతల స్వీకరణ

మద్దిపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మద్దిపాడు తహసీల్దార్‌గా వేమూరి ఆదిలక్ష్మి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు పనిచేసిన నారాయణరెడ్డి సంతనూతలపాడుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆదిలక్ష్మి మాట్లాడుతూ గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కాగా పలువురు టీడీపీ నాయకులు, డీటీ టి.అజయ్‌కుమార్‌రెడ్డి, ఆర్ఐ రమణయ్య, సీనియర్ అసిస్టెంట్ నాగేశ్వరరావు, వీఆర్వోలు తహసీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిలక్ష్మికి సత్కారం

సంతనూతలపాడు: తహసీల్దార్ ఆదిలక్ష్మి మద్దిపాడుకు బదిలీ అయిన నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో సిబ్బంది ఆమెను ఘనంగా సత్కరించారు. వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో కార్యాలయ అధికారులు పాల్గొన్నారు.

కొండపిలో శ్రీనివాసరావు..

కొండపి: కొండపి తహసీల్దార్‌గా శీలం శ్రీనివాసరావు బుధవారం మధ్యాహ్నం తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సాధారణ బదిలీల్లో భాగంగా వలేటివారిపాలెం నుంచి కొండపి తహసీల్దార్‌గా రాగా, ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పనిచేసిన పి.మురళి జరుగుమల్లి మండలానికి బదిలీపై వెళ్లారు.

కొత్తపట్నంలో శాంతి..

కొత్తపట్నం: కొత్తపట్నం తహసీల్దార్‌గా కె.శాంతి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆమె దోర్నాల మండల తహసీల్దార్‌గా పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన మధుసూదనరావు ఇటీవల ఒంగోలు బదిలీ అయ్యారు. అయనే ఇప్పటి వరకు ఇన్‌చార్జి బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఇప్పుడు శాంతిని రెగ్యులర్ తహసీల్దార్‌గా కలెక్టర్ ఉత్తర్వులు విడుదల చేయగా ఆమె బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కార్యాలయం సిబ్బంది బొకేలు అందజేశారు.



అమ్మవారిని గ్రామంలో ఊరేగిస్తున్న ఆచారవంతులు

ఘనంగా పోలేరమ్మ నగరోత్సవం

జరుగుమల్లి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): కామేపల్లిలోని పోలేరమ్మ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం రాత్రి అమ్మవారి నగరోత్సవం ఘనంగా జరిగింది. ఆలయం వద్ద నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఆచారవంతులు రథంపైకి ఎక్కించి, గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అమ్మవారికి హారతులిచ్చి స్వాగతం పలికారు. నీటితో వారుపోసి టెంకాయలు కొట్టి కర్పూర హారతులిచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ ఈవో బైరాగి చౌదరి పర్యవేక్షించారు.

'బౌద్ధధర్మంతో సామాజిక న్యాయం'

ఒంగోలు కలెక్టరేట్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బౌద్ధ ధర్మం ఆచరణతోనే సామాజిక న్యాయం, ప్రపంచ శాంతి సాధ్యపడుతుందని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ సుధాకర్‌బాబు అన్నారు. ఒంగోలులో బౌద్ధ ధర్మ ప్రచార కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. ఓపీడీఆర్ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా అశాంతి, యుద్ధోన్మాదం నెలకొన్నాయన్నారు. దేశంలో మతోన్మాదం పెరుగుతోందని, వీటన్నింటికి ఏకైక మార్గం అంబేడ్కర్ చూపించినటువంటి బౌద్ధ మార్గమని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సి.మోహన్‌రావు, నాగేశ్వరరావు, పేరం సత్యం, కరవది సుబ్బారావు, దాసరి సుందరం, లక్ష్మీనారాయణ, ప్రభుదాస్, బ్రహ్మయ్య తదితరులు ఉన్నారు.

చిన్నారులు అంగన్‌వాడీల్లో చేరాలి

- సీడీపీవో సుశీలాదేవి



ర్యాలీ నిర్వహిస్తున్న సీడీపీవో సుశీలాదేవి

కొండపి, జూన్11 (ఆంధ్రజ్యోతి): మూడు సంవత్సరాలు నిండిన చిన్నారులందరూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చేరాలని ఐసీడీఎస్ కొండపి ప్రాజెక్ట్ సీడీపీవో సుశీలాదేవి అన్నారు. 'అంగన్‌వాడీ పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా కొండపిలోని కామేపల్లి రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రం నుంచి రామాలయం వరకు ర్యాలీ కార్యక్రమాన్ని అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ చిన్నారులు బడి వెలుపల ఉండకూడదన్నారు. వెంటనే చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రానికి పంపించాలని కోరారు.

పొగాకు గరిష్ఠ ధర కిలో రూ.280

మద్దిపాడు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రంలో బుధవారం పొగాకు గరిష్ఠ ధర కిలో రు.280 లభించగా, కనిష్ఠ ధర రూ.180 లభించినట్లు వేలం కేంద్రం కార్యనిర్వహణాధికారి కోవి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేలిమి పొగాకుకు గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. నాణ్యతలేని పొగాకు సీఆర్, నోబిడ్‌లు పెట్టాల్సి వస్తుందని రైతులు గమనించి నాణ్యమైన పొగాకును కొనుగోళ్లకు తీసుకొని రావాలని కోరారు. వ్యాపారులందరూ వేలం కేంద్రంలో పాల్గొనాలని ఆదేశించారు. వెల్లంపల్లి రైతు సంఘం నాయకులు అబ్బూరి శేషగిరి రావు మాట్లాడుతూ వ్యాపారులు రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నారిపెద్ది వరహాలచౌదరి, మండవ గోవిందరాజులు, మండవ శ్రీరామమూర్తి, కె.విజయ్‌కుమార్, ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాదాడి పోటీలు

- సత్తాచాటిన కృష్ణాజిల్లా ఎడ్లజత

సింగరాయకొండ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : దక్షిణ సింహాచలంగా ప్రసిద్ధిగాంచిన పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సల సందర్భంగా ఆరో రోజు బుధవారం ఆలయ సమీపంలో గ్రామానికి చెందిన శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి రాదాడి (బండి) పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి 11 జతల ఎడ్లు పోటీల్లో పాల్గొన్నాయి. కృష్ణా జిల్లాకి చెందిన ఎలిశెట్టి ఉమామహేశ్వరరావు, వెలగపూడి కిరణ్‌కుమార్ ఎడ్లజత నిర్ణీత 10 నిమిషాల్లో 3,371 అడుగల దూరంలాగి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. బాపట్ల జిల్లా, చెరుకుపల్లి మండలం, పగడవారిపాలెంకు చెందిన కుంచాల వేదశ్రీ, లలితారెడ్డి ఎడ్లజత 3,252 అడుగుల దూరంలాగి ద్వితీయ స్థానంలో నిలిచింది. బాపట్ల జిల్లా చినగంజం మండలం కడవకుదురు గ్రామానికి చెందిన కొక్కు మహేశ్వరరెడ్డి ఎడ్లజత 3,061 అడుగుల దూరంను లాగి తృతీయ స్థానాన్ని దక్కించుకుంది. సింగరాయకొండ మండలం సోమరాజుపల్లికి చెందిన అలహరి వెంకట రమణయ్య ఎడ్లజత నిర్ణీత సమయంలో 3,058 అడుగుల దూరంలాగి చతుర్థస్థానాన్ని, గుంటూరు జిల్లా చెబ్రోలు మండలవ తోటపాలెంకి చెందిన కామినేని రత్తయ్య ఎడ్లజత 3,046 అడుగల దూరంను లాగి ఐదో స్థానాన్ని కైవసం చేసుకున్నాయి. బాపట్ల జిల్లా ఆవులదొడ్డి కొత్తగొల్లపాలెంకు చెందిన గోగినేని జ్ఞానసాయి, దీపక్‌చౌదరి ఎడ్ల జత 3,000 అడుగుల దూరంలాగి ఆరో స్థానంలో నిలిచాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు వరుసగా బహుమతులను మూలగుంటపాడు యాదవ్ యూత్ ఫోర్స్ రూ.50వేలు, చిమట కిషోర్ రూ.30వేలు, చీమకుర్తి శ్రీకాంత్, కృష్ణ రూ.20వేలు, హర్షయూత్ ఫోర్స్ రూ.15వేలు, పిగిలి సుధాకర్, నక్కా మాలకొండయ్య రూ.12వేలు, శ్రీకృష్ణయూత్‌ఫోర్స్ రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు శ్రీకృష్ణ యాదవ్ యూత్ ఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.



బండిని లాగుతున్న ఎడ్ల జత

నేడు టీడీపీ విజయోత్సవ ర్యాలీ

మార్కాపురం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు ఈ నెల 12న పట్టణంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. స్థానిక తర్లుపాడు రోడ్డులోని అల్లూరి పోలేరమ్మ దేవస్థానం నుంచి ఉదయం 9.30 గంటలకు బైక్ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. పూలసుబ్బయ్య కాలనీ, ఆర్టీసీ బస్టాండ్, కంభం బస్టాండ్ మీదుగా గడియార స్తంభం మీదుగా నాలుగు ప్రధాన వీధుల్లో ర్యాలీ సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం, బీజేపీ. జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ వారివారి బైక్‌లతో ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

గిద్దలూరు టౌన్ : ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. టీడీపీ కార్యాలయం నుంచి ఉదయం 9గంటలకు ర్యాలీ ప్రారంభం అవుతుందని, తెలిపారు. కావున తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆ ప్రకటనలో కోరారు.

ఉనికి కోసమే జగన్ పాట్లు

- ఎమ్మెల్యే కందుల
- రైతుల కోసం వచ్చి.. బయ్యర్లను కలిసి వెనక్కి
- మహిళలు, పోలీసులపై వైసీపీ మూకల దాడి అమానుషం

పొదిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ఉనికి కోసమే జగన్‌రెడ్డి పడరానిపాట్లు పడుతున్నారని ఎమ్మెల్యే కందుల ఎద్దేవా చేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద విలేకరులతో ఆయన మాట్లాడారు. పొగాకు రైతులను పరామర్శించేందకు వచ్చిన జగన్ ఒక్క నిమిషమైనా రైతులతో మాట్లాడలేదన్నారు. నియోజకవర్గాల నుంచి కార్యకర్తలను సమీకరించుకొని బలం నిరూపంచుకునేందుకే ఈ పర్యటన తప్ప, రైతులపై ప్రేమతో కాదన్నారు. అంతే కాకుండా పొగాకు రైతుల పరామర్శ పేరుతో పర్యటన పెట్టుకొని అరాచకం సృష్టించారని మండిపడ్డారు. తన చానల్‌లో డిబేట్ ఏర్పాటు చేసి మహిళలను తిడుతుంటే కనీసం జగన్‌రెడ్డి స్పందించలేదన్నారు. జగన్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని కోరిన మహిళలపై రాళ్లు, చెప్పులతో దాడికి పాల్ప డడం దుర్మార్గమన్నారు. కేవలం 30 నిమిషాలు బయ్యర్లతో మాట్లాడి వెనుదిరిగారన్నారు. నేను పర్యటనకు వస్తున్నానని ఎమ్మెల్యేలు, మంత్రులు పొగాకు బోర్డును సందర్శించి, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారని జగన్ చెప్పడం అబద్ధమన్నారు. రైతుల కోసం వచ్చి కనీసం వారి సమస్యలను తెలుసుకొనే ప్రయత్నం చేయలేదన్నారు. మహిళలపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం వైసీపీ మూకల దాడిలో గాయపడిన మహిళలను, పోలీస్ సిబ్బందిని ఆయన పరామర్శించారు.



ప్రభుత్వ వైద్యశాలలో కానిస్టేబుల్ రత్నాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

రాళ్లు రువ్విన వారిపై కేసులు నమోదు చేస్తాం

సీఐ వెంకటేశ్వర్లు

జగన్ పర్యటన సందర్భంగా మహిళలపై రాళ్లు రువ్విన వారిపై కేసులు నమోదు చేస్తామని సీఐ వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం మాట్లాడుతూ అమరావతి మహిళలను కించపరచడాన్ని ఖండిస్తూ మహిళలు నిరసన తెలిపారు. అదే సమయంలో జగన్‌రెడ్డి వస్తున్నారని తెలుసుకొని జగన్ క్షమాపణ చెప్పాలని పాత పోస్టాఫీస్ వద్ద మహిళలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఆ సమయంలో వైసీపీ మూకలు మహిళలపై రాళ్లు, చెప్పులను విసిరారని తెలిపారు. దాడికి పాల్పడిన వారిని గుర్తించే పనిలో ఉన్నామని ఆయన తెలిపారు. వారిని త్వరలోనే అరెస్ట్ చేసి కేసులు నమోదు చేస్తామని తెలిపారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులు

ఘనంగా గిరి ప్రదక్షిణ

త్రిపురాంతకం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పుణ్యక్షేత్రమైన త్రిపురాంతకేశ్వరస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ఆలయ గిరి ప్రదక్షిణ వైభవంగా జరిగింది. బుధవారం ఆలయ ప్రధాన అర్చకులు దూపాటి విశ్వనారాయణస్వామి ఆధ్వర్యంలో పూజలు చేసి ఆగమ నియమాల ప్రకారం గిరి ప్రదక్షిణ ప్రారంభించారు. ఆలయ తూర్పు మెట్ల మార్గం వైపు నుంచి మొదలైన ప్రదక్షిణ మహానందీశ్వరుడు, కాలభైరవుడును దర్శించుకుని తూర్పుమెట్ల మార్గం వద్ద ముగించారు. ఈ సందర్భంగా విశ్వం స్వామి మాట్లాడుతూ యుగయుగాల నాటి త్రిపురాంతక క్షేత్రం ఎన్నో అద్భుతాలకు నెలవుగా మారిందన్నారు. అనంతరం భక్తులకు ప్రత్యేక అభిషేకాలు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సమరసత ఫౌండేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ పర్యటన



ఆర్టీసీ స్థలాన్ని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

పెద్ద దోర్నాల,జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్ బుధవారం దోర్నాలలో పర్యటించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు 5 ఎకరాల స్థల సేకరణ కోసం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో కేటాయింపు, ఆర్టీసీ బస్టాండు నిర్మాణం కోసం నటరాజ్ కూడలిలోని స్థలాన్ని, యడవల్లి సమీపంలోని కొండ ప్రాంతంలో 9 ఎకరాల స్థలాన్ని సోలార్ ప్రాజెక్టు ఏర్పాటుకు స్థలాలను ఆయన పరిశీలించారు. పూర్తి వివరాలతో నివేదికలు రూపొందించాలని తహసీల్దారు అశోక్‌రెడ్డి, వీఆర్‌వోలకు త్రివినాగ్ సూచించారు.

ఎర్రగొండపాలెం : మండలంలోని, మిల్లంపల్లి, వైకొత్తపల్లి గ్రామాల్లో వ్యవసాయేతర భూములను బుధవారం సబ్ కలెక్టర్ వెంకటత్రివినాగ్ తహసీల్దార్ మంజునాథరెడ్డితో కలసి పరిశీలించారు. మిల్లంపల్లి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 423లో 2 ఎకరాల భూమిలో డ్రిప్ సిస్టమ్ పైపుల తయారీ కంపెనీ ఏర్పాటుకు పర్మిషన్ కోసం దరఖాస్తు చేశారు. వైకొత్తపల్లి గ్రామంలో ముగ్గురు రైతులు వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసి అనుమతి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు ఆయన ఆ భూములను పరిశీలించారు. ప్రభుత్వ బాలికల వసతి గృహం నిర్మాణానికి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఖాళీగా ఉన్న పార్కు స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కార్యదర్శి రవితేజ, సర్వేయర్లు పాల్గొన్నారు.

విద్యార్థి మిత్ర కిట్లు సిద్ధం

గిద్దలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులందరికీ పంపిణీ చేసేందుకు వీలుగా ప్రభుత్వం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను సిద్ధంగా ఉంచినట్లు ఎంఈవో-2 పి.నాగభూషన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థి మిత్ర కిట్‌లో ఒక విద్యార్థికి అవసరమైన పాఠ్య పుస్తకాలు, వర్క్‌పుస్తకాలు, నోటు పుస్తకాలు, డిక్షనరీ, 3 జతల యూనిఫాంలు, బ్యాగ్, బూట్లు, 2 జతల సాక్సులు, బెల్టు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. 1 నుంచి 8 తరగతుల విద్యార్థులకు యూనిఫాం కుట్టేందుకు రూ.120 రూపాయలు, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ.240 అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఒక్కొక్క కిట్టు కోసం ప్రభుత్వం రూ.2,279 ప్రభుత్వం ఖర్చు చేసిందని, అన్ని వస్తువులను ఒకేసారి అందే విదంగా గిద్దలూరు మండలంలో ఏర్పాట్లు చేశామని ఎంఈవో నాగభూషన్‌రెడ్డి తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలపై ఖండన

గిద్దలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): అమరావతి గౌరవాన్ని, అక్కడి మహిళలే కాక రాష్ట్రంలోని మహిళా మాతల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా సాక్షి చానల్‌లో వ్యాఖ్యలు చేసిన కృష్ణంరాజు, దానిని సమర్ధించిన కొమ్మినేని శ్రీనివాసరావుపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బీవీ రామాంజనేయులు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాంటి వ్యాఖ్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ప్రసారం చేస్తున్న సాక్షి చానల్ యాజమాన్యంపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

ప్రైవేటు స్కూళ్లు నిబంధనలు పాటించాలి : ఎంఈవో

ఎర్రగొండపాలెం రూరల్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు నేటితో ముగిసి పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఎర్రగొండపాలెం మండలంలో 78 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, అందులో మొత్తం సుమారు 10వేల మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. మండలంలో 17 ప్రైవేటు పాఠశాలలు ఉండగా, మొత్తం సుమారు 3వేల మంది విద్యార్థులు ఆయా పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి మండలంలో షీలా స్కూల్, గౌతమి స్కూల్‌కు అనుమతులు లేవని వారికి నోటీసులు పంపినట్లు విద్యా శాఖ అధికారులు తెలిపారు.


ఉద్యోగోన్నతిపై మండలానికి 25 మంది రాక

- పీ ఆంజనేయులు, ఎంఈవో

ఇటీవల విద్యాశాఖలో బదిలీ, ఉద్యోగోన్నతులు జరిగాయి. అందులో భాగంగా ఎర్రగొండపాలెం మండలానికి 25 మంది ఉద్యోగోన్నతిపై ప్రధానోపాధ్యాయులుగా వచ్చినట్లు ఎంఈవో పీ ఆంజనేయులు తెలిపారు. గతంలో మండలంలో ప్రధానోపాధ్యాయుల సమస్య ఎక్కువగా ఉందని ఈ విద్యా సంవత్సరానికి ఆ సమస్య పూర్తిగా తగ్గిందని ఆయన తెలిపారు. ఉద్యోగోన్నతిపై వచ్చిన వారికి సోమవారం జాయినింగ్ చేసుకొని ఖాళీల్లో భర్తీ చేసినట్లు ఆయన తెలిపారు. అలాగే ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని లేకుంటే చర్యలు తప్పవని ఎంఈవో ఆంజనేయులు హెచ్చరించారు.

ఘాట్‌లో రోడ్డు ప్రమాదం

- కారు, ద్విచక్ర వాహనం ఢీ
- ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు



రామాంజనేయులు మృతదేహం

గిద్దలూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నల్లమల ఘాట్ రోడ్డులో బుధవారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ రోడ్డు ప్రమాదంలో కారు, మోటార్ సైకిల్ ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వ్యక్తిని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అందిన సమాచారం మేరకు గిద్దలూరు మండలం దిగువమెట్ట సమీపంలో గల బొగద వద్ద నంద్యాల నుంచి గిద్దలూరు వైపు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని నంద్యాల వైపు వెళ్తున్న వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న ముండ్లమూరు మండలం ఈదర గ్రామానికి చెందిన రామాంజనేయులు (28) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో వ్యక్తికి ముండ్లమూరు మండలం వేముల గ్రామానికి చెందిన షేక్ బాజీ తీవ్రంగా గాయపడ్డాడు. బాజీని 108లో గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కాడెద్దులతో దున్నతున్న టీడీపీ నాయకుడు కృష్ణకిశోర్‌రెడ్డి

రైతుల పండుగ ఏరువాక పౌర్ణమి

గిద్దలూరు టౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతకు ప్రత్యేకమైన పండుగ ఏరువాక పౌర్ణమి అని టీడీపీ నాయకులు ముత్తుముల కృష్ణకిశోర్ రెడ్డి అన్నారు. బుధవారం ఏరువాక పౌర్ణమి సందర్భంగా మండలంలోని తాళ్లపల్లె గ్రామంలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని నిర్వహించారు. క్రిష్ణకిశోర్‌రెడ్డి కాడెద్దులతో పొలంలో దుక్కిదున్నారు. ఆయన మాట్లాడుతూ దేశ ప్రగతి మొత్తం వ్యవసాయం మీదనే ఆధారపడి ఉందని, అందుకే మన దేశంలో ఎన్నటికీ రైతే రాజు అన్నారు. ఏటా జ్యేష్ట శుద్ధ పౌర్ణమి రోజున ఏరువాక పౌర్ణమి జరుపుకుంటామన్నారు. కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు డి.బాలాజీనాయక్, మండల వ్యవసాయాధికారులు విజయభాస్కర్‌రెడ్డి, అబ్దుల్ రఫిక్, రాజశ్రీ, మెర్సీ, మహబూబ్‌బాషా, మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, టీడీపీ నాయకులు బైలడుగు బాలయ్య, రామసుబ్బారెడ్డి, జయరామిరెడ్డి, నంది శ్రీను, గోపాలకృష్ణ, వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా అశోక్‌రెడ్డి బాధ్యతలు

పెద్దదోర్నాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తహసీల్దార్‌గా చింతలపూడి అశోక్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు తహసీల్దార్‌గా పని చేస్తున్న కిన్నెర శాంతి కొత్తపట్నం వెళ్లగా, రాచర్ల మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై దోర్నాల వచ్చారు. కార్యాలయం సిబ్బంది, టీడీపీ నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, షేక్ మంజూర్ బాషా, కే సుబ్బారెడ్డి, వలి ఆయనకు అభినందనలు తెలిపారు.



ప్రజలకు పాలన చేరువ చేసిన ఘనత టీడీపీదే



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎరిక్షన్‌బాబు

త్రిపురాంతకం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు పాలన చేరువ చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదేనని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. బుధవారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజల వద్దకే పాలన, జన్మభూమి వంటి పథకాల ద్వారా పాలనను ప్రజలకు చేరువ చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ప్రజలు గ్రామ సచివాలయాల్లో అందుతున్న సేవలు పొందాలని, అధికారులు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన సూచించారు. ముందుగా గ్రామస్థులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో మండల నాయకలు అధికారులు పాల్గొన్నారు.

వైభవంగా తిరుమలనాథస్వామి కల్యాణోత్సవం

పెద్దారవీడు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాజంపల్లిపై వెలసిన శ్రీ గొడ్రాలికొండ తిరుమలనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు మంగళవారం అర్ధరాత్రి అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వేద పండితులు భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన క్రతువులు నిర్వహించారు. ఆనవాయితీగా మండలంలోని రాజంపల్లి గ్రామస్థులు స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను దేవస్థానానికి తరలించారు. అనంతరం విష్వక్సేన పూజ, సంప్రోక్షణ, పుణ్యాహవాచనం, రుత్వీకరణ, అంకురార్పణ, అగ్ని ప్రతిష్ఠాపన తదితర పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున స్వామివారిని ఉత్సవ మండపంలో కల్యాణ వేదికపై ప్రతిష్ఠించి కల్యాణ ఘట్టాన్ని పూర్తిచేశారు. ఈసందర్భంగా కల్యాణ ఉభయదాతలు స్వామి, అమ్మవార్లకు పుష్పాదికాలు, ప్రసాదాలను సమర్పించారు. వివిధ కుల సత్రాలవారు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.



కల్యాణ వేదికపై తిరుమలనాథుడు

గాయత్రీ మాతకు పూజలు

గిద్దలూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గాయత్రీ మాత దేవాలయంలో జ్యేష్ట పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. అమ్మవారికి సహస్ర నామ పూజ, కుంకుమార్చన నిర్వహించారు. గాయత్రి మహాయజ్ఞంను నిర్వహించగా భక్తులు సామూహికంగా యజ్ఞంలో పాల్గొన్నారు. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా ఆలయ, విగ్రహ ప్రతిష్ఠ

పెద్దదోర్నాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : శివ సదన్ సమీపంలో నూతనంగా నిర్మించిన శ్రీ షిరిడీ సాయిబాబా ఆలయం, విగ్రహ, గోపుర కలశ ప్రతిష్ఠ వేడుకలు బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా వేదవరాణాలు, కుంభారాధనం, రత్నన్యాసం, యంత్రస్థాపన, విగ్రహ ప్రతిష్ఠ, విమానకలశ ప్రతిష్ఠ మహాపూర్ణాహుతి, పుణ్యాహవాచనం అగ్నికుంభ ప్రదక్షిణం, జీవ కల్యాణాసం, గోదర్శనం, కూష్మాండ దర్శనం, కుంభ దర్శనం, నీరాజనం తదితర క్రతువులను నిర్వహించారు. స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు విశేషంగా హాజరయి సాయి నాథున్ని దర్శించి తరించారు. అనంతరం అన్నదానం స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక రథంపై సాయి గ్రామోత్సవం కనులపండువగా సాగింది.



సాయిబాబా విగ్రహం వద్ద భక్తులు

ముగిసిన బ్రహ్మోత్సవాలు

రాచర్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యడవల్లి గ్రామంలో జరుగుతున్న లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అవభ్రద స్నానం, చక్రతీర్థం కార్యక్రమాలతో బుధవారం అట్టహాసంగా ముగిశాయి. ఈనెల 6 నుంచి ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు 11వ తేదీతో ముగిశాయి. కార్యక్రమాలను అర్చకులు కందనూరి హరీష్‌కుమార్, కందనూరి పార్థసారధి, నంద్యాల శ్రీనివాసులచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో పెద్దవత్తున ప్రజలు పాల్గొని స్వామి వారికి పూజలు చేశారు.

వైసీపీ శ్రేణుల అత్యుత్సాహం

- పొగాకు బేళ్లు ధ్వంసం
- జగన్ వెంట వేలం కేంద్రంలోకి కార్యకర్తల చొరబాటు
- అంతా ముక్కయిందని రైతుల ఆవేదన

పొదిలి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పొగాకు రైతుల సమస్యలు తెలుసుకునేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా పొదిలి పట్టణంలోని పొగాకు వేలం కేంద్రంలోకి జగన్ వెళ్లిన సమయంలో పోలీసులు 208 మంది రైతులను 20మంది వైసీపీ నాయకులను మీడియాను మాత్రమే లోపలికి అనుమతించే విధంగా మొదట పోలీసులు ప్రణాళిక చేశారు. జగన్ వాహనం లోపలికి వచ్చిన సమయంలో కొందరిని మాత్రమే పోలీసులు లోపలికి అనుమతించి మిగిలిన వారిని గేటు బయట నిలిపేసే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో కార్యకర్తలు ప్రధాన గేటును నెట్టుకొని లోపలికి వచ్చే ప్రయత్నంలో గేటు గడి విరిగిపోయి ఆ పార్టీ కార్యకర్తలంతా లోపలికి చొచ్చుకొచ్చారు. వేలంకేంద్రంలోకి పొగాకు అమ్మకానికి తెచ్చుకున్న రైతులు చాలామంది లోపలికి వెళ్లలేక బయటే ఉండిపోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

బేళ్లపైకి ఎక్కి తొక్కి హడావుడి

ఏ రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం జరిగిందో వారికే నష్టం కూడా మిగిల్చారు. వేలం కేంద్రంలోకి వచ్చిన శ్రేణులు సీఎం అంటూ నినాదాలు చేస్తూ అక్కడ అమ్మకానికి ఉంచిన పొగాకు బేళ్లపైకి ఎక్కి తొక్కారు. రైతులు ఎంతగా వారిని వారించినా ఎవ్వరూ అదుపు చేయలేకపోయారు. ఆ సమయంలో వారి వీరంగం కొంత భయానక వాతావరణాన్ని తలపించిందని కొందరు రైతులు చెప్పారు. అప్పటికే కొన్ని బేళ్ల రేటు పలికి ఉండగా, మరికొన్ని బేళ్లకు బయ్యర్లు అప్పటికి ఇంకా ధర నిర్ణయించలేదు. ఈ రెండు వరుసల్లోని బేళ్లను వైసీపీ కార్యకర్తలు తొక్కిన కారణంగా పొగాకుకు నష్టం వాటిల్లింది. కొన్ని బేళ్ల తొక్కిసలాట కారణంగా కొనుగోలు కాకుండా వెనక్కి పంపారు. తొక్కిన కారణంగా ముక్క ఆకుగా మారిందని రైతులు చెప్తున్నారు. ధర వేయకుండా వెనక్కి పంపడంతో గత్యంతరం లేక రైతులు ఆ బేళ్లను తిరిగి ఇళ్లకు తీసుకెళ్లారు. కొందరు రైతులు ధర పలికిన వారి బేళ్లలోని పొగాకు తొక్కిసలాటలో ధ్వంసమైంది. వేలం కేంద్రంలోని వాటర్‌ఫిల్టర్ కూడా ధ్వంసమైనట్లు చెప్పారు.

తొక్కిన కారణంగా ఆకు ముక్కగా మారింది

జగన్‌తో పాటు లోపలికి చొరబడి వచ్చిన కార్యకర్తలు పొగాకు బేళ్లపైకి ఎక్కి తొక్కారు. బేళ్లలోని ఆకు చెల్లాచెదరుగా పడిపోయింది. దానిని తెచ్చి మళ్లీ బేళ్లుగా సరిచేసుకుని అమ్మకానికి పెట్టాం. తీరా కొన్నిబేళ్లు ముక్క ఆకుగా చూపి బయ్యర్లు వెనక్కి పంపారు. విరిగిన పొగాకు గ్రేడింగ్ చేసుకున్నాక మళ్లీ అమ్మకానికి తెచ్చుకోవాలి.

- పి.చిన్ననారాయణ, రైతు

నన్ను లోపలికి అనుమతించలేదు

పొగాకు అమ్మకునేందుకు వేలం కేంద్రానికి తెచ్చి లోపల ఉంచిన నన్ను లోపలికి అనుమతించలేదు. అసలు రైతు అనేవారినే లోపలికి పంపకుండా కేవలం రాజకీయ నాయకులు లోపలికి వెళ్లి ఏ సమస్య తెలుసుకున్నారో అర్థం కావడం లేదు. కేవలం రాజకీయాల కోసం రైతుల సమస్యను అడ్డుపెట్టుకున్నట్లు కనిపిస్తోంది. లోపల తొక్కిసలాటలో పొగాకు కూడా ధ్వంసమైంది.

- వేల్పుల సుబ్బారావు, రైతు

సమస్య తీరుస్తామని సమస్య చేశారు

రైతుల సమస్యలు తీరుస్తామని వచ్చిన జగన్ పర్యటన మాకు సమస్యగా మార్చింది. అమ్మకానికి తెచ్చిన పొగాకు బేళ్ల కార్యకర్తల తొక్కిసలాట కారణంగా దెబ్బతిన్నాయి. రైతుకు నష్టం జరుగుతుందన్న ఆలోచన అక్కడకు వచ్చిన వారిలో కనిపించలేదు. నా బేళ్లలో కూడా రిటన్ అయ్యాయి.

- పుట్టా నారాయణ, రైతు

ప్రభుత్వ తోడ్పాటును పేద విద్యార్థులు అందిపుచ్చుకోవాలి

● మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా

కనిగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగంలో పేద కుంటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటును అందిపుచ్చుకోవాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖమంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలోని రూ. 41.10 లక్షలతో ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నూతన ఆధునీకరణ భవనాన్ని బుధవారం మంత్రి స్వామి, కలెక్టర్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రలతో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యరంగాలపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ. 143 కోట్లతో సాంఘిక సంక్షేమ హాస్టల్ ఆధునీకరణ పనులు చేపట్టామన్నారు. అందులో భాగంగా కనిగిరిలోని బాలికల సమీకృత హాస్టల్‌ను మంజూరు చేస్తామని తెలిపారు. హాస్టల్‌లో నాణ్యమైన బియ్యాన్ని ఇస్తామని ప్రకటించటం మేరకు ఆయా బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కనిగిరి ప్రాంతంలో విద్యా, వైద్య రంగాల అభివృద్ధి సౌకర్యాల కల్పనలో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర చేసిన కృషి పట్ల కనిగిరి ప్రాంత ప్రజలు అభినందించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం కనిగిరి మండల పరిధిలోని పునుగోడు వద్ద పునుగోడు నుంచి మర్రిపూడి వరకు మంచినీటి సరఫరా పైపు లైను ఏర్పాటును మంత్రి స్వామి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ డీడీ లక్ష్మానాయక్, ఎస్‌సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్‌నాయక్, వివిధ శాఖల అధికారులు, నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, వీవీఆర్ మనోహరరావు(చిరంజీవి), సానికొమ్ము తిరుపతిరెడ్డి (ఎస్‌టీఆర్), నంబుల వెంకటేశ్వర్లు, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, గాయం తిరుపతిరెడ్డి, తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

మాతా శిశు సంరక్షణే ప్రభుత్వం లక్ష్యం

కనిగిరిలో కంగారు మదర్‌కేర్ యూనిట్‌ను ప్రారంభించిన మంత్రి

ఎమ్మెల్యే కృషి, కలెక్టర్ సహకారం అభినందనీయం

కనిగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మాతా శిశు సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. కనిగిరి డివిజన్ కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన కంగారు మదర్ కేర్ సెంటర్‌ను బుధవారం మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆసుపత్రిలోని ప్రతి విభాగాన్ని నిశితంగా పరిశీలించి రోగులకు ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కాన్పు, లేబొరేటరీ, నవజాతశిశువు విభాగం, ప్రాథమిక చికిత్స యూనిట్, ఓపీ విభాగాలను ఆయన పరిశీలించి వైద్యాధికారులకు తగు సూచనలు ఇచ్చారు. ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు, అధికారులు రోగులతో అమర్యాదగా మాట్లాడవద్దన్నారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించటంతో పాటు వారికి వైద్యంపై నమ్మకం కల్గించేలా మనోధైర్యాన్నివ్వాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి దాతల సహకారంతో పాటు తన సొంత నిధులతో ఆసుపత్రిని అభివృద్ధి చేయటం పట్ల ఎమ్మెల్యేను అభినందించారు. అంతేకాకుండా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ప్రతి నెలా తన సొంత నిధులతో ఆరు గురు వైద్య సిబ్బందికి జీతాలు ఇస్తూ వారికి ఉపాధి కల్పించటంతో పాటు కనిగిరి ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవల అందించటంపై మంత్రి సంతోషం వ్యక్తం చేశారు. కనిగిరిలో కంగారు మదర్ కేర్ సెంటర్ ఆదర్శంగా నిలిచిందన్నారు. దీంతో జిల్లాలో పలు చోట్ల ప్రత్యేకంగా ఇదే అధునాతన పరికరాలతో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పుట్టిన ప్రతి శిశువు ఆరోగ్యంగా ఉండాలన్నదూ కంగారు మదర్‌కేర్ సెంటర్ ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీనివాసనాయక్, కనిగిరి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటసుబ్బయ్య, డాక్టర్లు సునీత, తిరుపతిరెడ్డి, అబ్దుల్ కలాం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కంగారుకేర్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి స్వామి



దళితవాడలో రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర

దళితవాడల అభివృద్ధే ధ్యేయం

● రహదారుల ప్రారంభంలో ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న దళిత వాడల్లో మౌలిక వసతులు కల్పించి అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. మండలంలోని పడమటకట్టకిందపల్లిలో రూ, 45 లక్షలు, బీసీ కాలనీలో రూ, 5 లక్షలు చిలంకూరులో రూ, 48 లక్షలు, వీరభద్రాపురంలో రూ, 47 లక్షలు, తూర్పుకోడిగుడ్లపాడులో 48 లక్షల ఉపాధి హామీ నిధులతో గ్రామ మెయిన్ రోడ్డు నుంచి ఎస్సీ లోకేషన్ రోడ్లను అనుసంధానం చేస్తూ నిర్మించిన రోడ్లను ఎమ్మెల్యే ఉగ్ర బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 5 నెలలోనే ఉపాధి హామీ నిధులతో నియోజకవర్గంలో సుమారుగా రూ. 20 కోట్లతో అంతర్గత సిమెంటు రోడ్లు నిర్మించి రహదారుల కష్టాలు తొలగించిందన్నారు. ఈ సందర్భంగా పడమటకట్టకిందపల్లి గ్రామంలో నిర్మించి ఉన్న రైతు భరోసా కేంద్రం, హెల్త్‌క్లినిక్ కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా థ్యాంకు ఉగ్ర సార్ అంటు ప్ల కార్డులు ప్రదర్శిస్తు కృతజ్ఞతలు తెలుపుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమాల్లో టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు, యారవ శ్రీనివాసులు, బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్ చౌదరి, వై. ప్రసాద్‌రెడ్డి, ఎంపీడీవో బ్రహ్మయ్య, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యవసాయ ఆధారిత పనులకు ప్రాధాన్యం

వీసీపల్లి,జూన్11(ఆంధ్రజ్యోతి):ఉపాధిహామీ పథకంలో రైతులకు ఉపయోగపడే విధంగా వ్యవసాయ పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో హనుమంతరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధిహామీ పథకంపై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యానపంటలైన బత్తాయి, నిమ్మ, యాపిల్‌బేర్ తదితర పంటలను ఎక్కువమొత్తంలో సాగుచేసేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఏపీవో జహంగీర్ బాషా, టీఏలు, ఎఫ్ఏలు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ డీజీఎం ఉమామహేశ్వరరావు

స్త్రీనిధి బకాయిలు చెల్లిస్తేనే రుణాలు

● జోనల్ డీజీఎం ఉమామహేశ్వరరావు

తాళ్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): సెర్ఫ్ నిబంధనల మేరకు ప్రస్తుతం తీసుకున్న స్త్రీనిధి రుణాల బకాయిలు పూర్తిస్థాయిలో చెల్లిస్తేనే తదుపరి రుణాలు మంజూరు చేస్తామని జోనల్ డీజీఎం ఉమామహేశ్వరరావు తెలిపారు.స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏల సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో స్త్రీనిధి బకాయిలు రూ. 29లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. బకాయిలు చెల్లించని కారణంగా రూ. 13కోట్ల స్త్రీ నిధిరుణాలు మంజూరు జరగలేదన్నారు. స్త్రీనిధి రుణాలు తీసుకున్న కొందరు మహిళలు చెల్లింపులో జాప్యం చేయటం, చెల్లింపు గురించి పట్టించుకో పోవటం వల్ల బకాయిలు ఎన్‌పీఎల్‌లో పడ్డాయన్నారు. దీనివల్ల ఈ మండలానికి స్త్రీ నిధి రుణాలు నిలిచి పోయినట్లు తెలిపారు. గ్రామసంఘాలు కూడా స్త్రీ నిధి రుణాలు తీసుకున్న మహిళలు బకాయిలు చెల్లించే విధంగామార్గాలు అన్వేషించి బకాయిలు వసూలు చేయాలన్నారు. రుణాల చెల్లింపులు మొబైల్‌ద్వారా చేయాలని, రసీదులు కూడా తీసుకోవచ్చున్నారు. ఈనెలాఖరులోపు స్త్రీ నిధి బకాయిలు రూ. 29 లక్షలు చెల్లిస్తేనే తదుపరి తాళ్లూరు మండలానికి స్త్రీనిధి రుణాలు అందిస్తామన్నారు.ఈకార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఎం.సుజాత, ఏజీఎం ఉదయ్‌కుమార్, ఏసీ పవన్ కళ్యాణ్, ఏపీఎం దేవరాజ్, వీవోఏలు పాల్గొన్నారు.

పంట మార్పిడితో లాభదాయకం

పంటను మార్పు చేస్తూ సాగు చేపడితే మంచి దిగుబడులు వచ్చి సాగు లాభదాయకంగా ఉంటుందని కేవీకే నోడల్ అధికారి మానస అన్నారు. మండలంలోని దోసకాయలపాడులో వికసిత్ సంకల్ప్ అభియాన్ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ ఎక్కువగా సేంద్రియ ఎరువులను వాడుకోవాలన్నారు. కోళ్ల పరిశోధన శాస్త్రవేత్త డాక్టర్ లెస్లిలియా ప్రిన్స్ మాట్లాడుతూ మిశ్రమ వ్యవసాయంలో భాగంగా కోళ్ల పెంపకం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. వ్యాధుల నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ విస్తరణాధికారి స్వర్ణలత, నరసింహ, కోటిరత్నం, రైతులు పాల్గొన్నారు.

కనుల పండువగా గ్రామోత్సవం

స్వామివారిని అధిక సంఖ్యలో దర్శించుకొన్న భక్తులు

ఆకట్టుకున్న విచిత్ర వేషధారణ, కోలాట నృత్య ప్రదర్శనలు

పామూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : పామూరులోని శ్రీ మదన వేణుగోపాలస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజు బుధవారం స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించిన రథంపై గ్రామోత్సవాన్ని అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం ఆలయ అర్చకులు నారాయణం సత్యబాబు విశేష పూజలు, హారతులు, నైవేద్యం సమర్పించి ఆలయ చుట్టూ ప్రదక్షణలు చేస్తు వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం స్వామివార్లను ఉలవపాడు నుంచి తెప్పించిన 25 అడుగుల రథంలో అందంగా అలంకరించి మేళ తాళాలతో కేరళ వాయిద్యాలతో, దేవతమూర్తులు, రాక్షసుల విచిత్ర వేషధారణలతో, కోలాట నృత్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లను అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు దేవస్థానంలో మహా అన్నదానం నిర్వహించారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రథోత్సవం సందర్భంగా విద్యుత్‌శాఖ సిబ్బంది గ్రామోత్సవానికి అడ్డంకిగా ఉన్న విద్యుత్ తీగలను తొలగించడంతో పాటు ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ సందర్భంగా సీఐ ఎం. భీమానాయక్, ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పట్టణంలోకి వాహనాలు రాకుండా బైపాస్ మీదుగా ట్రాఫిక్‌ను మళ్లించారు. అంతే కాకుండా రథంపై ఎక్కి భక్తులకు పలు సూచనలు చేస్తు గ్రామోత్సవం పూర్తిగా ముగిసే దాక ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలను తీసుకొన్నారు. ఈ కార్యక్రమాల్లో మాజీ మంత్రి ముక్కుకాశిరెడ్డి దంపతులు, పెంచల కోన దేవస్థాన డీసీ కోరెడ్డి శ్రీనివాసులరెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మీ, బైరెడ్డి జయరామిరెడ్డి, ఎంపీటీసీలు, పట్టణ ప్రముఖులు, ఉభయదాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.





రథోత్సవాన్ని ప్రారంభిస్తున్న ఉభయదాతలు (ఇన్‌సెట్లో) రథాన్ని లాగుతున్న భక్తులు

వజ్రాల వేటకు వెళ్లి వస్తూ ప్రమాదం

● ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న కారు

● ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

ముండ్లమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మనిషిలో ఆశ ఎంత దూరమైనా తీసుకు వెళ్తుంది. ఇందుకు నిదర్శనమే జిల్లాలోని గిద్దలూరు సమీపంలోని దిగువ మెట్ట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదం. ఈ ప్రమాదంలో మండలంలోని ఈదర గ్రామానికి చెందిన రొక్కం రామాంజనేయులు(26) మృత్యువాత పడ్డాడు. మండలంలోని వేముల గ్రామానికి చెందిన షేక్ బాజీ తీవ్ర గాయాలై ఆస్పత్రిలో కొట్టుమిట్టాడుతున్నాడు. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. వివరాల్లోకి వెళితే మండలంలోని ఈదర గ్రామానికి చెందిన రొక్కం బ్రహ్మయ్య కుమారుడు రామాంజనేయులు ఫొటో గ్రాఫర్‌గా రాణిస్తున్నాడు. తనకు పరిచయమైన వేముల గ్రామానికి చెందిన బాజీ, మరి కొందరు స్నేహితులతో కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలో వజ్రాల వేట కోసం ఐదు రోజుల క్రితం వెళ్లారు. వజ్రాల వేట అనంతరం తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామాలకు వస్తుండగా వాహనం ఢీకొట్టడంతో రామాంజనేయులు అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. రామాంజనేయులుకు గత ఏడాదే వివాహమైంది. మొత్తం మీద వజ్రాలు దొరుకుతాయన్న ఆశ ప్రాణాలకు తెచ్చి పెట్టింది.



రామాంజనేయులు మృతదేహం

సెలవులకు టాటా.. నేటి నుంచి బడిబాట

పాఠశాలలకు విద్యార్థి మిత్ర కిట్లు

బాధ్యతలు చేపట్టిన నూతన ఉపాధ్యాయులు

దొనకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇప్పటి వరకు వేసవి సెలవుల్లో ఆడుతూ, పాడుతూ హాయిగా గడిపిన విద్యార్థులు నేటి నుంచి బడిబాట పట్టనున్నారు. దాదాపు 48 రోజుల పాటు షికార్లతో, ఆటపాటలతో గడిపిన విద్యార్థులు ఇకపై భుజాన బ్యాగులు వేసుకొని పుస్తకాలతో కుస్తీ పట్టాల్సిన సమయం ఆసన్నమైంది. గ్రామాల్లో ప్రభుత్వ బడులను మరింత బలోపేతం చేసి విద్యా ప్రమాణాలను పెంపొందించేందుకు విద్యాశాఖ పటిష్ట కార్యాచరణను అమల్లోకి తెచ్చింది.

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వం ఉచితంగా అందించే విద్యార్థి మిత్ర కిట్లను అధికారులు ఇప్పటికే పాఠశాలలకు చేర్చారు. వేసవి సెలవులు ముగిసి నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం కానుండటంతో ప్రారంభంరోజే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టు, బూట్లు, యూనిఫాం, బ్యాగులను అందించేందుకు సంసిద్ధం చేశారు. విద్యార్థులకు పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయాలని ఇప్పటికే సన్నబియ్యాన్ని పాఠశాలలకు చేర్చారు. ప్రభుత్వం నిర్వహించిన బదిలీల ప్రక్రియలో ఇతర ప్రాంతాల నుంచి పలువురు హెచ్‌ఎంలు సహితం పలు గ్రామాల్లోని పాఠశాలల్లో ఇప్పటికే బాధ్యతలు చేపట్టారు. విద్యార్థుల తల్లితండ్రులు ఈ విద్యా సంవత్సరంకు వారి పిల్లలకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేసుకోవటం ప్రారంభించారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో 69 ప్రభుత్వ పాఠశాలల్లో గత ఏడాది దాదాపు 5,500 మంది విద్యార్థులు విద్యాభివృద్ధి కొనసాగించారు. ఈ ఏడాది టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు అందించే సౌకర్యాలు, పథకాల కారణంగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశాలు ఉన్నాయని ప్రజలు చర్చించుకుంటున్నారు.

ప్రీస్కూల్ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం

పామూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వగ్గంపల్లి సెక్టార్ డీవీపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి ఆధ్వర్యంలో పిల్లల తల్లిదండ్రులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించి ప్రీస్కూలు పిల్లలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం కొత్తగా చేరిన ప్రీస్కూల్ పిల్లలకు సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. 3 నుంచి 6 సంవత్సరాల పిల్లందరూ ను అంగన్‌వాడి కేంద్రాలకు పంపించాలని ఆమె సూచించారు. కార్యకర్తలు ఫణికుమారి, రజియాబేగం, మల్లేశ్వరి, కృష్ణవేణి, ఎలిజిబెత్, లక్ష్మీప్రసన్న, సహాయకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



గ్రాడ్యుయేషన్ డే పై నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీ

పాస్‌ల మంజూరులో జాప్యం

కనిగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌లో నూతన విద్యా సంవత్సరంలో విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇవ్వడానికి సాఫ్ట్‌వేర్ డౌన్‌లోడ్ చేస్తున్నందున 12,13, తేదీల్లో పాస్‌లు ఇవ్వడం లేదని డీఎం మహ్మద్ సయానాబేగం ఒక ప్రకటనలో తెలిపారు. 14 తేదీ శనివారం నుంచి విద్యార్థులకు బస్‌పాస్‌లు ఇస్తామని, విద్యార్థులు,వారి తల్లిదండ్రులు, విద్యా సంస్థలు గమనించాలని ఆమె తెలిపారు.

నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలి

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

దర్శి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పొదిలిలో మహిళలపై రాళ్లదాడి చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పొగాకు రైతుల పరామర్శ పేరుతో పులివెందుల ఎమ్మెల్యే జగన్‌రెడ్డి ఇక్కడకు వచ్చి ఉద్దేశపూర్వకంగా గొడవ సృష్టించాడని విమర్శించారు. వైసీపీ సైకోలు మహిళలపై బీరు బాటిల్స్ వేసి దాడి చేయటం దారుణమన్నారు. పోలీసులు ఈ చర్యలను తీవ్రంగా పరిగణించి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని, నిందితులను వెంటనే అదుపులోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సూపర్ సిక్స్‌తో ప్రజల్లో ఆనందం


సూపర్ సిక్స్ పథకాల అమలుతో అన్నీ వర్గాల ప్రజల్లో ఆనందం నెలకొంటుందని టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి తెలిపారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నేటి నుంచి తల్లికి వందనం పథకం అమలు చేస్తుండటంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికీ ఈ పథకం వర్తింపజేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటించటంతో తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు.

పలువురు అధికారుల బదిలీ

తాళ్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): బదిలీల ప్రక్రియలో భాగంగా మండలంలోని పలుకార్యాలయాల అధికారులను బదిలీ చేస్తూ ఆయాశాఖల ఉన్నతాధికారుల నుంచి బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీవో కె.సుందరామయ్యను పామూరుకు బదిలీ చేశారు.ఆయన స్థానే హనుమంతునిపాడు డిప్యూటీ ఎంపీడీవోను తాళ్లూరు డిప్యూటీ ఎంపీడీవోగా బదిలీ చేశారు. తాళ్లూరు డిప్యూటీ తహసీల్దార్‌ను కనిగిరి ఆర్డీవో కార్యాలయంలో డీటీగా బదిలీ చేసి, ఆయన స్థానంలో ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పని చేస్తున్న డీటీ గోపాలుని ఫణీంద్రను తాళ్లూరు డీటీగా బదిలీ చేశారు. కనిగిరి తహసీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ బి.శ్రీనివాసరావును తాళ్లూరుకు బదిలీ చేశారు. ఐసీడీఎస్ కార్యాలయంలో తాళ్లూరు ఏసీడీపీవోగా పని చేస్తున్న వై.అంజమ్మను ఒంగోలుకు,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ జి.జ్యోతిని మద్దిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టుకు బదిలీ చేశారు.

సీఎస్‌పురం ఎంపీడీవో బదిలీ

సీఎస్‌పురం(పామూరు) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురం ఎంపీడీవో కే వాణి గుంటూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమె తెనాలి నుంచి ఉద్యోగోన్నతి పై సీఎస్‌పురంకు ఎంపీడీవోగా గత నెల 13న బాధ్యతులు స్వీకరించారు. నెల రోజులు గడవక ముందే సాధారణ బదీలలో భాగంగా తిరిగి గుంటూరు జిల్లాకు బదిలీ కావడం విశేషం, పామూరు ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్యను సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా నియమిస్తూ జిల్లా అధికారుల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కాగా సీఎస్‌పురం ఇన్‌చార్జ్ ఎంపీడీవోగా పామూరు ఎంపీడీవో ఎల్. బ్రహ్మయ్య బాధ్యతలు స్వీకరించారు.



కే వాణి, సీఎస్‌పురం ఎంపీడీవో

షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్న దొనకొండ విద్యార్థిని

దొనకొండ, జూన్ 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రకటించిన షైనింగ్ స్టార్ అవార్డును దొనకొండ ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థిని షేక్ సఫియా అందుకున్నారు. కాలేజీకి చెందిన షేక్ సఫియా 2024-25 సంవత్సరంలో ఇంటర్ సెకండ్ ఇయర్ సీఈసీ చదువుతూ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబర్చటంతో షైనింగ్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. ఈ మేరకు ఒంగోలులో కలెక్టర్ తమీమ్‌అన్సారియా చేతులమీదుగా విద్యార్థిని సఫియా మంగళవారం షైనింగ్ స్టార్ అవార్డు అందుకున్నారు. అవార్డు అందుకున్న విద్యార్థిని సఫియాను కాలేజీ ప్రిన్స్‌పాల్ ధనుముని, అధ్యాపక సిబ్బంది ప్రత్యేక కానుక అందించి అభినందించారు.



షైనింగ్‌స్టార్ అవార్డు అందుకున్న విద్యార్థిని సఫియాను అభినందిస్తున్న కాలేజీ ప్రిన్స్‌పాల్, అధ్యాపక సిబ్బంది

వీకేజీజే కళాశాలలో ఆక్రమణలు

● తొలగించాలని అధికారులకు ప్రిన్సిపాల్ ఫిర్యాదు

తాళ్లూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ స్థలాలు, సైడు కాలువలపై ఆక్రణలు చేస్తే తొలగిస్తామని చెబుతున్నా ఆచరణలో అమలుకు నోచుకోవటం లేదు. తాళ్లూరులోని ఊటుకూరు కోటయ్య జూనియర్‌కళాశాల ముందు భాగంలో కొందరు వ్యాపారులుఎలాంటి అనుమతులు తీసుకోకుండా బంకులను ఏర్పాటు చేశారు. కళాశాలముందు భాగంలో వ్యాపార సంస్థలు ఏర్పాటు చేయటంతో నిత్యం ప్రజల రాక పోకలతో కళాశాల వద్ద రద్దీగా ఉంటోంది. పైగా కళాశాలకు వెళుతున్న విద్యార్థులు అసౌర్యానికి గురిఅవుతున్నారు. వ్యాపార సంస్థల వారు వేసిన వ్యర్థాలతో కళాశాల ముందు భాగం అపరిశుభ్రతగా మారుతున్నది. రాత్రి వేళవ్యాపార సంస్థలను మూసివేయగా చీకటి మాటున మద్యం ప్రియులు మద్యం సేవించి ఖాళీమద్యం సీసాలను కళాశాల ప్రహరీగోడ పక్కన పడవేస్తున్నారు. దీంతో కళాశాల ప్రాంగణంలో సీసాలు దర్శన మిస్తున్నాయి. ఈవిషయమై ప్రిన్సిపల్ కొండపల్లి ఆంజనేయులు బుధవారం స్థానిక ఎస్సై, ఎంపీడీవో, తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యదర్శులకు తగుచర్యలు తీసుకుని, కళాశాలముందు భాగంలో ఆక్రమణలు తొలగించాలని లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు.

ఏరువాకతో సేద్యపు పనులు

తాళ్లూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మృగశిర కార్తెను స్వాగతిస్తూ పౌర్ణమి రోజు రైతులు నాగలితో దుక్కి దున్నటంతో సేద్యపు పనులు ప్రారంభమవుతాయని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాదరావు తెలిపారు. తూర్పుగంగవరంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం దుక్కి దున్ని సాగు చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షం పడగానే రైతులు పొలాల్లో విత్తుకోవటం ముమ్మరం చేసి సాగు పనులు చేపడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



ఏరువాక పౌర్ణమి సందర్భంగా తూర్పుగంగవరంలో దుక్కి దున్నుతున్న రైతులు


ప్రజానేతకు శుభాకాంక్షలు
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు
ముఖ్యమంత్రివర్యులు, ఆంధ్రప్రదేశ్
స్వర్ణాంధ్ర రూపకర్త, ముఖ్యమంత్రి
శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు,
శ్రీ నారా లోకేష్‌బాబు గారి
ఆశీస్సులతో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి
నిరంతరం శ్రమిస్తూ... అభివృద్ధే అభిమతంగా
ప్రజానేతగా, ప్రజలమనిషిగా రాణిస్తూ...
విద్యుత్‌శాఖమంత్రిగా ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ
ఉత్తమ మంత్రిగా గుర్తింపు పొందిన
మా శ్రేయోభిలాషి
శ్రీ గొట్టిపాటి
రవికుమార్ గారు
పదవీ బాధ్యతలు చేపట్టి
ఏడాది పూర్తి చేసుకున్న
సందర్భంగా శుభాకాంక్షలు
తెలియజేస్తూ...
మీ...
శ్రీ గొట్టిపాటి రవికుమార్ గారు
రాష్ట్ర విద్యుత్‌శాఖామాత్యులు
కామేపల్లి లక్ష్మీప్రసాద్
కామేపల్లి ఎక్స్‌పోర్ట్సు అండ్ గ్రానైట్స్
జొన్నతాళి, మార్టూరు మండలం





ఉష్ణోగ్రత (అంచనా)

12-6-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	34	26
తెనాలి	35	26
నరసరావుపేట	32	25
బాపట్ల	35	27
రెంటచింతల	31	26
చీరాల	35	27



గణ.. గణ..

- నేటి నుంచి బడులు పునః ప్రారంభం
- విద్యార్థులకు విద్యా కిట్లు పంపిణీకి కార్యాచరణ
- సన్న బియ్యంతో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం
- కొలిక్కివస్తోన్న బదిలీలు.. తీరనున్న ఉపాధ్యాయుల కొరత
- 20న పాఠశాలల్లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం



గుంటూరు(విద్య), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవులు ముగిశాయి.. వాతావరణం చల్లబడింది.. గురువారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభం కానున్నాయి. ఆట పాటల్లో ఇంతకాలం సందడి చేసిన విద్యార్థులు బడికి బయల్దేరేందుకు సిద్ధమవుతున్నారు. దాదాపు 45 రోజుల తర్వాత పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఇందుకు అనుగుణంగా పాఠశాలల్ని ఉపాధ్యాయులు సిద్ధం చేశారు. పునః ప్రారంభం తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై ఇప్పటికే ఉపాధ్యాయులకు అవగాహన తరగతులను విద్యాశాఖ నిర్వహించింది. ప్రభుత్వ పాఠశాలలను ఉన్నతంగా తీర్చిదిద్దేలా నూతన ప్రభుత్వం కార్యాచరణ సిద్ధం చేసింది. ఇందులో భాగంగా అనేక నూతన సంస్కరణలు ఈ ఏడాది నుంచి అమల్లోకి రానున్నాయి. ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ యాజమాన్యాల్లోని పాఠశాలల విద్యార్థులకు విద్యాకిట్లు పంపిణీకి సన్నాహాలు చేస్తున్నారు. పాఠ్య, నోట్ బుక్స్, యూనిఫాం, బూట్లు, టై, బ్యాగుతో కూడిన కిట్లు పాఠశాలలకు చేరుకున్నాయి. వాటిని గురువారం నుంచి విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ఉపాధ్యాయులు సర్వం సిద్ధం చేశారు. పాఠశాలల్లో కొరత లేకుండా ఉపాధ్యాయులు ఉండేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. బదిలీల ప్రక్రియ తుది దశకు రావడంతో మరో వారంలో పూర్తిస్థాయిలో పాఠశాలలకు ఉపాధ్యాయులు రానున్నారు. ఈ విద్యా సంవత్సరంలో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి చర్చించేందుకు ఈ నెల 20న పాఠశాలల్లో మెగా పేటీఎం(పేరెంట్స్ టీచర్స్ మీట్) నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో మార్పులు రానున్నాయి. ఇందులో భాగంగా విద్యార్థులకు సన్న బియ్యంతోనే భోజనం అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే పాఠశాలలకు సన్న బియ్యం తరలించినట్లు పౌరసరఫరాలశాఖ అధికారులు చెప్పారు. కూరలతో పాటు మెనూలో మార్పులు రానున్నాయి. తల్లికి వందనం కార్యక్రమాన్ని కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తుంది.



అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనాలు

రుణ లక్ష్యాలు.. ఖరారు

- రంగాల వారీగా సిద్ధం చేసిన లీడ్‌బ్యాంక్
- ఎంఎస్‌ఎంఈ లక్ష్యం రూ.18,043.49 కోట్లు
- విద్యకు రూ.342.98 కోట్లు..
- గృహ రుణాలు రూ.1,217.78 కోట్లు

రూ.19,604.25 కోట్లతో ప్రణాళిక



క్యాటగిరీలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల వారీగా రుణ లక్ష్యాలు ఖరారయ్యాయి. 2025-26కు సంబంధించి లక్ష్యాలను లీడ్‌బ్యాంక్ నిర్దేశించింది. బ్యాంకుల వారీగా రుణాలకు సంబంధించి టార్గెట్లను ఇచ్చింది. మూడు జిల్లాల పరిధిలో ఆయా రంగాలలో రూ.19,604.25 కోట్ల రుణాలను పంపిణీ చేసేందుకు ప్రణాళికను సిద్ధం చేసింది. ఇందుకు సంబంధించి జిల్లాల వారీగా లబ్ధిదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించ నున్నారు. విద్య, గృహ రుణాలకు పెద్ద పీట వేయనున్నారు. విద్యకు సంబంధించి 20,036 మంది విద్యార్థులకు రుణాలు మంజూరు చేయాలని బ్యాంకులకు లక్ష్యాలు ఇచ్చారు. లక్ష్యాల మేర రుణాల పంపిణీ చేస్తే ఆయా వర్గాలు ఆర్థికంగా అభివృద్ధి సాధించే అవకాశాలు ఉన్నాయి. వివిధ రంగాలకు సంబంధించి సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు(ఎంఎస్‌ఎంఈ)లకు భారీగా రుణాలు పంపిణీ చేయనున్నారు.

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి రూ.19,604.25 కోట్లతో వార్షిక రుణ ప్రణాళికను లీడ్ బ్యాంక్ సిద్ధం చేసింది. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలతో పాటు విద్య, గృహ రుణాలకు లక్ష్యాలు నిర్దేశించింది. ఆయా రంగాలకు సంబంధించి ఆర్థిక సహాయం అందిం చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక పథకాలను అమలు చేస్తున్నాయి. రాయితీ రుణాలు కూడా అందజేస్తున్నాయి. సదరు సంస్థలకు అందజేసే రుణాల ద్వారా కార్యకలాపాలను విస్తరించడానికి, కొత్త ఆవిష్కరణలకు రుణాలు దోహద పడతాయి. సకాలంలో రుణాలు అందక సదరు సంస్థల నిర్వాహకులు ఆర్థికంగా ఇక్కట్లు పడుతు న్నారు. ఈ పరిస్థితుల్లో ఎం ఎస్ఎంఈలను గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో స్థాపించడానికి, ప్రోత్సహించేందుకు రాయితీ రుణాలను ప్రభుత్వం ప్రకటించింది. విద్యార్థులకు ఎటువంటి ష్యూరిటీ లేకుండా విద్యా రుణాలు పంపిణీ చేయాలని ప్రభుత్వం సూచించింది. విద్యా రుణాలు పల్నాడు జిల్లాలో 3777, గుంటూరు జిల్లాలో 11,288, బాపట్ల జిల్లాలో 4,971 విద్యార్థులకు రుణాలు ఇచ్చేందుకు లీడ్‌బ్యాంకు లక్ష్యాలు నిర్దేశించింది.

జిల్లాల వారీగా రుణ ప్రణాళిక ఇలా ఉంది

జిల్లా	ఎంఎస్‌ఎంఈ రుణాలు (కోట్లలో..)	విద్య రుణాలు (కోట్లలో..)	గృహ రుణాలు (కోట్లలో..)
పల్నాడు	2,604.99	74	293.34
బాపట్ల	1,291.50	70.29	184.50
గుంటూరు	14,147	198.69	739.94

ఆచరణ శూన్యం

ఏటా రుణ ప్రణాళిక ఘనంగా ఉన్నా ఆచరణ శూన్యంగా ఉంటుందన్న విమర్శలున్నాయి. బ్యాంకులు రుణాలు ఇచ్చేందుకు దరఖాస్తుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఎటువంటి హామీ లేకుండా కొన్ని రకాల రుణాలను మంజూరు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేసినా వాటిని బ్యాంకులు పట్టించుకోవడంలేదు. తీసుకున్న రుణానికి తగిన విధంగా ష్యూరిటీ ఇస్తేనే రుణం మంజూరు చేసే పరిస్థితి నెలకొంది. విద్యా రుణాలకు కూడా బ్యాంకులు ఆస్తులను హామీగా తనఖా పెట్టించుకుంటున్నాయి. బ్యాంకర్ల తీరుపై బాధితులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకుంటున్న పరిస్థితి లేదు. దీంతో బ్యాంకులు రుణాలు మంజూరు చేసేందుకు అనేక ఆంక్షలు విధిస్తున్నాయి. గత ఏడాది ప్రకటించిన ప్రణాళికలో నామమాత్రంగా కూడా రుణాలను బ్యాంకులు మంజూరు చేయలేదని లెక్కలు తెలియజేస్తున్నాయి. రుణ ప్రణాళిక ప్రకటించడం.. బ్యాంకులకు లక్ష్యాలు ఇవ్వడంతో తమ పని అయిపోయిందని లీడ్ బ్యాంకులు భావిస్తున్నాయి. ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలు మంజూరు చేశాయా లేదా అన్న అంశంపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకుండా పోయింది.

నేడు.. ఏడాది విజయోత్సవాలు

- వేడుకలకు కూటమి శ్రేణులు సిద్ధం
- బైక్‌ర్యాలీలు.. కేక్ కటింగ్‌లకు ఏర్పాట్లు
- అన్ని నియోజకవర్గాల్లోనూ ప్రత్యేక కార్యక్రమాలు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఐదేళ్ల అరాచకం.. అకృత్యాలతో.. అల్లాడిన ఓటర్లు పోటెత్తడంతో వైసీపీ పాలన అంతమై కూటమి అధికారం చేపట్టి గురువారంతో ఏడాది అవుతుంది. గత ఏడాది జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగ్గా.. అదే నెల 12న ముఖ్య మంత్రిగా చంద్రబాబు నేతృత్వంలో కూటమి పాలనా పగ్గాలు చేపట్టింది. నాడు పండుగ వాతావరణంలో ప్రమాణ స్వీకార మహోత్సవం జరగ్గా.. అది గురువారానికి ఏడాది అవుతుంది. ఏడాది పాలన పూర్తయిన సందర్భాన్ని వేడుకగా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. సుపరిపాలన.. స్వర్ణాంధ్రప్రదేశ్ పేరుతో నిర్వహించే వేడుకల్లో ఎమ్మెల్యేలు పాల్గొనున్నారు. ఈ క్రమంలో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో విజయోత్సవాలకు కూటమి శ్రేణులు సిద్ధమయ్యారు. గురువారం అన్ని నియోజకవర్గాల్లో ఏడాది పాలనా ఉత్సవాలను ఘనంగా కూటమి శ్రేణులు జరుపుకోనున్నాయి. ఇందుకోసం అన్ని ప్రాంతాల్లో ఎక్కడికక్కడ నాయకులు, కార్యకర్తలు భారీగా ఏర్పాట్లు చేశారు. యువత ఆధ్వర్యంలో పట్టణాల్లో బైక్‌ర్యాలీలు నిర్వహించనున్నారు. కేక్ కటింగ్‌లతో పాటు బాణసంచా పెద్దఎత్తున కాల్చేందుకు శ్రేణులు సిద్ధమ య్యాయి. ప్రదర్శనలతో పాటు సంబరాలను జయప్రదం చేయాలని కూటమి నేతలు, కార్యకర్తలకు ఎమ్మెల్యేలు పిలుపు నిచ్చారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఏడాది విజయోత్సవ సంబరాల ద్వారా ప్రజలకు నేతలు వివరించనున్నారు. ఈ ఏడాదిలో నియోజకవర్గాల్లో కూటమి నేతృత్వంలో జరిగిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేయనున్నారు.

వేడుకగా ఏరువాక

- పల్లెల్లో రైతుల సంబరాలు
- దుక్కిదున్ని సాగు పనుల ప్రారంభం
- మంతెనవారిపాలెం ఏరువాకలో ఎమ్మెల్యే వేగేశన



పొలంలో హలం దున్నుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, రైతులు, కూటమిశ్రేణులు

పిట్టలవానిపాలెం, వేమూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ఏరువాక సాగారోరన్న అంటూ.. పల్లె కదిలింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా కుల, మతాలకు అతీతంగా ఏరువాక ఉత్సవంలో పల్లెల్లో సందడి నెలకొంది. బుధవారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో పండుగ వాతావరణంలో ఏరువాక ఉత్స వాలు జరిగాయి. జిల్లా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో జరిగిన ఏరువాక పౌర్ణమిలో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ పాల్గొన్నారు. ఎద్దులను, అరకలను ప్రత్యేకంగా అలంకరించి సంప్రదాయ దుస్తులతో రైతులు కుటుంబాలతో ఊరేగింపుగా ఆలయాలకు తరలివచ్చి పూజలు చేశారు. వేమూరులోని గణపతి ఆలయంలో ఏరువాక పూర్ణిమ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. జంపనిలోని సిద్ధి గణపతి, రత్నగర్భ గణపతి, వేమూరులోని లక్ష్మీగణపతి, చావలి, పెరవలి, చదలవాడ, అబ్బనగూడవల్లి గ్రామాల్లోని శివాలయాల్లో పంచామృతాభిషేకాలు జరిపారు. రైతుల గోత్రనామాలతో పూజలు జరిపించు కుని ఎడ్లతో కూడిన నాగళ్లతో ఆలయాల్లో ప్రదక్షిణలు చేశారు. తలపాగ చుట్టి, చంద్రకోలు చేతబట్టి అరకలతో పొలాల కు రైతన్నలు తరలివెళ్లారు. కోటి ఆశలతో భూ మాతకు నమస్కరించి సాగును ప్రారంభించారు.



ఖాజీపాలెం నుంచి మంతెన వారిపాలెం వరకు ట్రాక్టర్లతో ర్యాలీగా వస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తదితరులు

ట్రాక్టర్లతో రైతుల ర్యాలీ

ఖాజీపాలెం నుంచి జీఎస్‌పాలెం, పిట్టలవానిపాలెం గ్రామాల మీదగా ఎమ్మెల్యే వేగేశనతో కలిసి ట్రాక్టర్లతో భారీ ర్యాలీగా మంతెనవారిపాలెం గ్రామానికి రైతులు చేరుకున్నారు. మంతెనవారిపాలెంలో వేగేశన సత్యంరాజు పొలం దున్నిన ఎమ్మెల్యే ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంతకముందు రైతులు, కూటమిశ్రేణులతో కలిసి ఎమ్మెల్యే భూమాతకు పూజలు చేశారు. అనంతరం జిల్లా వ్యవసాయశాఖాధికారి వై.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు లేకపోతే ఆహారోత్పత్తులు అందుబాటులో ఉండావన్నారు. వ్యవసాయశాఖాధికారుల సహకారంతో రైతులు మంచి ఫలితాలను సాధించాలన్నారు. ఈ కార్యక్ర మంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, జిల్లా ఉద్యాన వన శాఖాధికారిణి జెన్నెమ్మ, శాస్త్రవేత్తలు డి.కృష్ణవేణి, ఎం.ఉష, డీపీఎమ్ వి.వాణిశ్రీ, డీఏహెచ్‌వో డి.వేణుగోపాల్, డీఆర్సీ టి.రత్నకుమారి, ఏడీఏ ఎస్‌కె.అక్తార్ హుస్సేన్, తహసీల్దారు డి.వెంకటేశ్వరరావు, ఏడీఏ ఎ.లక్ష్మి, ఎంఈవో సి.హెచ్.సత్యానంద్, ఏవో తిరుమలరావు, చంద్రశేఖర్, టీడీపీ మండల అధ్యక్షుడు అఫ్జల్, సర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మీ వెంకటపతిరాజు, నాయకులు కనుమూరి సాంబమూర్తిరాజు, పిట్టు సాయిబాబారెడ్డి, మురళిరాజు, బొలగాని వెంకటసులోచన నారాయణ,కలకోట చక్రధర్‌రెడ్డి, కలకోట కిశోర్‌రెడ్డి, సయ్యద్ నిజాం, మంతెన గంగరాజు, మంతెన కృష్ణమూర్తిరాజు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రజలకు చేరువ కావాలి

- నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి
- బాపట్ల డిపో, గ్యారేజీలో ఆకస్మికంగా తనిఖీలు



ఆర్టీసీ అధికారులకు సూచనలు ఇస్తున్న సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మరింతగా సేవలను ప్రజలకు చేరువ చేయాలని, సర్వీస్‌లు పెంచాలని ఆర్టీసీ నెల్లూరు జోన్ చైర్మన్ సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బాపట్ల పర్యటనలో భాగంగా బుధవారం ఆయన స్థానిక డీపో, గ్యారేజీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. డిపో ఆవరణలో రోడ్డు ధ్వంసమై గుంతల్లో నిలిచిన నీటిని పరిశీలించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని అధికారులకు తెలిపారు. ప్రాంగణంలో కళావిహీనంగా ఉన్న దీన్ దయాళ్ ఉద్యానవనానికి పూర్వ వైభవం తీసుకురావాలన్నారు. ఆర్ఎం ఎం.రవికాంత్, డీఎం బి.శ్రీమన్నారాయణలకు పలు సూచనలు చేశారు. డిపోలో పోస్టుల భర్తీ, జిల్లాలోని అన్ని ప్రాంతాలకు కొత్తగా సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు బి.తిరుమలరెడ్డి, మున్నంగి కుమార్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. గ్యారేజి, డిపోలో గుంతల రోడ్లలో బస్సులను నడపడం కష్టంగా ఉందని వెంటనే మరమ్మతులు చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూరి బంగారు బాబు, మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు బ్రహ్మాండం బాలనారాయణ, నాయకులు బి.బాబునాగేంద్ర, వెంకట్రావు, కొండారెడ్డి అనీల్‌కుమార్, రాంపల్లిజగన్నాథశాస్త్రి, మామిడి రమేష్‌కుమార్, జీవీఎల్ మోహన్‌గౌడ్, జిట్టా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలి

ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

బాపట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నాటుసారాను పూర్తిగా నిర్మూలించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశించారు. నవోదయం 2.0పై జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో బుధవారం ఎస్‌హెచ్‌వోలతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా రాహుల్‌దేవ్‌శర్మ మాట్లాడుతూ జిల్లాలో నాటు సారా ప్రభావిత గ్రామాలు ఉండకూడదన్నారు. సారా నిర్మూలనకు చేపట్టాల్సిన చర్యలపై సూచనలు, సలహాలు తెలియపర్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ కె.హేమంత నాగరాజు, అసిస్టెంట్ కమిషనర్ ఎం.సుధాకర్‌రెడ్డి, ఏ.దయాసాగర్, జిల్లాఅధికారి బి.వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ సూపరింటెండెంట్ ఎ.జనార్ధనరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ రాహుల్‌దేవ్‌శర్మ

ఉపాధి నిధులతో పండ్లతోటల పెంపకానికి చేయూత

పంగులూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి):గ్రామాలలో పండ్లతోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం ద్వారా కల్పించే రాయితీలను సాగుదారులు సద్వినియోగం చేసుకోవాలని డ్వామా పీడీ విజయలక్ష్మి అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామంలో ఉపాధి నిధులతో రైతులు సాగుచేస్తున్న మామిడి తోటలను ఆమె బుధవారం పరిశీలించారు.

ప్రసన్నాంజనేయస్వామికి లక్ష తమలపాకుల పూజ

అద్దంకి, జూన్11 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా బుధవారం లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. ఐదు ఆవృత్తములుగా వేదపండితులు, పూజారులు లక్ష తమలపాకులతో పూజ నిర్వహించారు. అనంతరం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా గుంటూరు కు చెందిన న్యూ మార్నింగ్ స్టార్ ట్రావెల్స్ అధినేత పొనకాల శ్రీనివాసరావు, యశోద దంపతులు పాల్గొన్నారు. ఏరువాక పౌర్ణమి కావడంతో పలు గ్రామాల రైతులు కుటుంబసభ్యులతో స్వామి దర్శించుకున్నారు.

























అవీ..ఇవీ..

అక్రమంగా విద్యుత్‌ను వినియోగిస్తే చర్యలు

● చీరాల డివిజన్ విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్‌థామస్

పర్చూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని, ఎవరైనా విద్యుత్‌ను అక్రమంగా వినియోగిస్తే అట్టివారిపై చట్టపరమైన చర్యలు తప్పవని చీరాల డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జాన్‌థామస్ అన్నారు. బుధవారం పర్చూరు మండల పరిధిలోని పర్చూరు, ఉప్పుటూరు, వీరన్నపాలెం, చెరుకూరు, నాగులపాలెం, నూతలపాడు, చింతగుంటపాలెం, పెద్దివారిపాలెం, కొల్లావారిపాలెం, దేవరపల్లి, తిమ్మరాజుపాలెం గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారుల గృహాలను ఈఈ జాన్‌థామస్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. విజిలెన్స్ ఈఈ ఎం.భాస్కర్‌రావు, డీఈఈ ఆర్.విజయ్ శ్రీనివాసరావు, సిబ్బంది 35 బృందాలుగా ఏర్పడి 287 గృహాల్లో తనిఖీలు చేపట్టారు. అందులో భాగంగా అదనపు లోడు వినియోగిస్తున్న 287 సర్వీసులను గుర్తించి రూ.8,10,600 అపరాధ రుసుం విధించినట్లు ఏఈ రమేష్‌నాయక్ తెలిపారు. అనంతరం స్థానిక అద్దంకి నాంచారమ్మ అమ్మవారి కల్యాణ మండప ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈఈ జాన్‌థామస్ మాట్లాడుతూ అదనపు లోడు భారం తగ్గించుకునేందుకు ప్రభుత్వం రాయితీపై సోలార్ ప్లేట్లు ఇస్తుందని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పర్చూరు డీఈఈ హరిప్రసాద్, వేటపాలెం శ్రీనివాసులు, చీరాల డివిజన్ పరిధిలోని పలువురు ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్యఘర్‌పై రైతులకు అవగాహన

బల్లికురవ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియెగదారులు అందరు పీఎం సూర్యఘర్‌ను సద్వినియెగం చేసుకోవాలని విద్యుత్‌శాఖ అద్దంకి డివిజన్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు కోరారు. బుధవారం మండలంలోని అంబడిపూడి గ్రామంలో పీఎం సూర్యఘర్‌పై రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్బంగా అయన మాట్లాడుతూ గృహ విద్యుత్ వినియెగ దారులు అందరు వెంటనే సోలార్ యూనిట్ల ఏర్పాటుకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రాయితీలు కూడా అందిస్తుందన్నారు. ముందు మందు సోలార్ విద్యుత్ ఎంతో ఉపయెగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలుగు ఏపీఎం రాజారావు, మండల ఏఈ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రేపు మార్టూరులో జాబ్‌మేళా

మార్టూరు,జూన్11(ఆంధ్రజ్యోతి):ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఉపాధి కార్యాలయ, సిడాప్ వారి సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 13న శుక్రవారం స్థానిక వీఎస్ఆర్ఎఎం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి పి.ప్రణయ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్‌మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, మాస్టర్‌మైండ్స్, టెక్ మహీంద్ర తదితర కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారు. దాదాపుగా వాటిలో 250 వరకు ఉద్యోగ ఖాళీలు ఉన్నాయన్నారు. అందువలన ఏదైనా డిగ్రీ,లేదా బీఎస్సీ సైన్సు గ్రూపులవారు, 18 నుండి 30 ఏళ్ల వయస్సు ఉన్న నిరుద్యోగ యువతీ యవకులు నేరుగా జాబ్‌మేళాలలో ఇంటర్వ్యూకు హాజరుకావచ్చన్నారు. పూర్తి వివరాల కోసం 7989697996, 6302764962 నంబరును సంప్రదించాలన్నారు.

ద్రోణాదులలో ఏరువాక సందడి



ట్రాక్టర్ ర్యాలీ చేస్తున్న రైతులు

మార్టూరు, జూన్11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ద్రోణాదుల గ్రామంలో బుధవారం ఏరువాక సందడి నెలకొంది. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు ట్రాక్టర్లుతో, ఎడ్లజతలతో గ్రామంలోని ప్రధాన వీధులలో సందడి చేయడం ఆనవాయితీ. దీనిలో భాగంగా బుధవారం రాత్రి రైతులు ట్రాక్టర్లుకు పూలదండలతో అలంకరించారు. తోరణాలు కట్టి గ్రామంలోని వీధులలో ర్యాలీ చేశారు. అనంతరం గ్రామం ప్రధాన కూడలిలో బొడ్డురాయి వద్ద, రామాలయం, శివాలయంలో, సాయిబాబా గుడిలో కొబ్బరికాయలు కొట్టి పూజలు చేశారు. అదేవిధంగా ఎడ్లజతలను కూడా అందంగా అలంకరించి వీధులలో తిప్పారు. తరువాత దేవాలయాల్లో పూజలు చేసిన తర్వాత అరకలతో పొలాల సాగుకు వెళ్లారు. రైతులు తమ పంటలను సాగు చేసుకోవడానికి, వ్యవసాయం ప్రారంభించడానికి ఏరువాకను పండుగ నాడు రైతులు తమ పనులను ప్రారంభించడం ఈ గ్రామంలో ప్రత్యేకత అని పలువురు రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యుల వాగ్వాదం

● అనారోగ్యంతో ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్

● కేసు నమోదు చేసిన టూటౌన్ పోలీసులు

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల మృతిచెందిన కానిస్టేబుల్‌కు ప్రభుత్వం నుంచి వచ్చే ప్రయోజనాల కోసం కుటుంబ సభ్యులు వాగ్వాదానికి దిగారు. మృతుడు కిరణ్ జె.పంగులూరు వద్ద కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఈక్రమంలో ఆయా బెనిఫిట్స్ కోసం మృతుని భార్య, ఆడబిడ్డలు వాగ్వాదానికి దిగారు. దీంతో వివాదం పెద్దదికావడంతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

వేటపాలెం(చీరాల), జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతిచెందిన ఘటన వేటపాలెంలో చోటుచేసుకొంది. అందిన వివరాల మేరకు కారంచేడుకు చెందిన మంచికలపాటి సురేష్(36) వేటపాలెం కుందేరు వద్ద ఉన్న వినాయకగుడి సమీపంలో కొంతకాలంగా నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో అదే ప్రాంతంలో రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇతడిని ఆటో ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో స్థానికులు వైద్యశాలకు తరలించగా బుధవారం మృతి చెందాడు. వేటపాలెం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

శుభకార్యంలో బంగారు ఆభరణాలు అపహరణ

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక నవాబ్‌పేటలో ఓ ఇంట్లో శుభకార్యం జరుగుతుండగా సందట్లో సడేమియా అంటూ గుర్తుతెలియని వ్యక్తులు సుమారు రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరించారు. రెండు రోజుల తరువాత గ్రహించిన బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ ఎస్సై రాజ్యలక్ష్మీ కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నారు.

పొగాకు కొనుగోలు విధివిధానాలపై చర్చ

● వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడితో సమావేశమైన ఎమ్మెల్యే ● 17 నుంచి అధికారికంగా కొనుగోలు ప్రారంభం



మంత్రి అచ్చెన్నాయుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాంబశివరావు

పర్చూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నల్లబర్లీ పొగాకు కొనుగోలుపై వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు బుధవారం సమావేశమయ్యారు. పొగాకు కొనుగోలుకు సంబంధించి ఈనెల 13న సెక్రటరేట్ వేదికగా సమావేశం నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే ఏలూరి వెల్లడించారు. 17 మంత్రి సారథ్యంలో పర్చూరు వ్యవసాయశాఖ మార్కెట్ యార్డ్‌లో మార్క్‌ఫెడ్ ద్వారా అధికారికంగా నల్లబర్లీ పొగాకు కొనుగోలును ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో పొగాకు కొనుగోలు సమస్య తీవ్రంగా ఉండడంతో రైతుల సమస్యను ఏలూరి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రి కింజరావు అచ్చెన్నాయుడుతో పలుమార్లు సంప్రదింపులు జరిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ పొగాకు మొత్తాన్ని మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ఈనేపథ్యంలో మంత్రితో ఏలూరి భేటీ అయ్యారు.

13న విధివిధానాలపై సమీక్ష

పొగాకు కొనుగోలుకు సంబంధించి విధివిధానాలపై 13న సెక్రటరేట్ వేదికగా కీలక సమావేశం నిర్వహించనున్నారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి, వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రాజశేఖర్, కమిషనర్ ఢిల్లీరావు, మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొననున్నారు. ముఖ్యంగా గోడౌన్ సామర్థ్యం, నిల్వ ప్రక్రియ, హమాలీల నియామకం, ఏజెన్సీలు, ఆన్లైన్ టోకెన్ విధానాల విషయంపై సమావేశంలో ఖరారు చేయనున్నారు.

17 నుంచి నిరంతర కొనుగోలు

దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం బర్లీ పొగాకు కొనుగోలుకు కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నెల 17న ఉదయం 9 గంటలకు పర్చూరు మార్కెట్ యార్డ్ వేదికగా మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు కేంద్రాన్ని అధికారికంగా ప్రారంభించనున్నారు. దీంతో పాటు మార్టూరు, ఇంకొల్లు కేంద్రాల్లో కొనుగోలు ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో చివరి ఆకు వరకు రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేవిధంగా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

టీడీపీతోనే గ్రామాభివృద్ధి

ఆ పార్టీ మండల అధ్యక్షుడు పొద వీరయ్య



కడవకుదురు గ్రామంలో సిమెంట్ రోడ్ల శిలాఫలకానికి ఆవిష్కరిస్తున్న వీరయ్య, టీడీపీ నాయకులు

చినగంజాం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : టీడీపీ ప్రభుత్వ హయాంలోనే గ్రామాల అభివృద్ధి బాటలో పయనిస్తాయని ఆ పార్టీ మండల అధ్యక్షులు పొద వీరయ్య, టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా కన్వీనర్ నక్కల వీరరాఘవులు అన్నారు. మండలంలోని కడవకుదురు గ్రామంలో పల్లెపండుగ కార్యక్రమంలో భాగంగా ఉపాధిహామీ పథకం నిధులతో నూతనంగా నిర్మించిన సిమెంట్ రోడ్లు, గోకులం షెడ్లను బుధవారం వీరయ్య ప్రారంభించారు. కడవకుదురు గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ.65 లక్షలతో ఎస్సీ కాలనీ, ఎస్టీ కాలనీలతో పాటు, గ్రామంలో రెండు చోట్ల నూతనంగా నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లు, ఐదు గోకులం షెడ్లను ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ దండమూడి దాసు, ఏపీవో జె.లక్ష్మీదేవి, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, ఫీల్డ్‌అసిస్టెంట్ వడ్లమూడి రామకృష్ణ, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వడ్లమూడి శ్రీనివాసరావు, గుద్దేటి తిరుపతిరావు, నాయకులు కొండ్రగుంట శ్రీహరి, కత్తి లాజర్, నామన లక్ష్మణరావు పాల్గొన్నారు. మండలంలోని పూలవారిపాలెం గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డు, సోపిరాల గ్రామంలో రూ.1.30లక్షలతో నిర్మించిన కోళ్ల ఫామ్ షెడ్డులను గ్రామ సర్పంచ్, ఉపసర్పంచులు రాయని ఆత్మారావు, చెరుకూరి రాఘవయ్యలు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

'ఆపదలో తోడుంటా.. అధైర్య పడవద్దు'

● ఇంజనీరింగ్ విద్యార్థికి కలెక్టర్ మనోధైర్యం

● దత్తత తీసుకున్న డీఆర్‌డీఏపై ప్రశంసల జల్లు



నగదు సాయం అందజేస్తున్న కలెక్టర్ వెంకట మురళీ

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో అధైర్య పడకుండా ఎప్పుడైనా తనను కలవచ్చని, అన్నివిధాలుగా తోడ్పాటు అందిస్తానని ఓ విద్యార్థికి సాక్షాత్తు కలెక్టర్ వెంకటమురళీ భరోసా ఇచ్చి మనోధైర్యం నింపారు. మండల పరిధిలోని హస్తినాపురానికి చెందిన పముజుల వెంకటశిరీష గ్రామ సమాఖ్య సహాయకురాలిగా పనిచేస్తూ అనారోగ్యంతో మృత్యువాత పడింది. అయితే అంతకు మునుపే భర్త దూరంగా ఉంటున్నాడు. దీంతో తల్లిదండ్రులు లేని ఆమె కుమారుడు పవన్ ఇంజనీరింగ్ 4వ సంవత్సరం చదు వుతూ నిరాశ్రయుండి గా మిగిలాడు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 ద్వారా డీఆర్‌డీఏ విభాగం ఆయన్ను దత్తత తీసుకొంది. ఏకంగా జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా రూ.50 వేల ఆర్థిక సాయం అందించింది. ఉన్నత చదువుల కోసం డీఆర్‌డీఏ పాటు ఎల్లప్పుడు అండగా ఉంటానని, చక్కగా చదువుకుని ఉన్నతంగా రాణించాలని కలెక్టర్ పవన్‌కు సూచించారు. కలెక్టర్ వెంట ప్రాజెక్టు డైరక్టర్ శ్రీనివాసరావు, డీపీఎం రవి, ఏపీఎం మధు, సీసీ బుజ్జి, గ్రామ సంఘ సహాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీ లేదు : ఎమ్మెల్యే కొండయ్య



సీసీ రోడ్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : తనను విశ్వసించి విజయాన్ని అందించిన నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని, అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్య పేర్కొన్నారు. బుధవారం చీరాల, వేటపాలెం మండలాల్లోని పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. అలాగే రెండు రోజులుగా పట్టణంలో జరుగుతున్న డ్రెయినేజ్ పనులను పరిశీలించారు. డ్రయిన్ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. పారుదల లేని డ్రయిన్‌లు కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేయాలని సూచించారు. అలాగే వాడరేవు - పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణంలో స్థలాలు కోల్పోయిన వారికి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అబ్దుల్ రషీద్, డీఈ రఘురాం, ఎంపీడీవో రాజేష్‌బాబు తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం



యోగా నిర్వహిస్తున్న సిబ్బంది

పంగులూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): యోగాతో ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని మండల ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కృష్ణకుమార్ అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామ సచివాలయం వద్ద బుధవారం యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా డాక్టర్ కృష్ణకుమార్ ప్రజలకు యోగాపై అవగాహన కల్పించారు. ఈ నెల 21న జరిగే అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి కల్పిస్తాం.. సారా తయారీ మానేయ్యండి

● ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : నాటుసారా తయారీ, విక్రయాలు నిలిపివేసి ఉపాధితో సంతోషంగా జీవతాన్ని సాగించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ దయాసాగర్, సూపరిండెంట్ జనార్ధన్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నవోదయం 2.0లో భాగంగా చీరాల పరిధిలోని రామనగర్‌లో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సారాతయారీదారుల తో చర్చలు జరిపి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పీడీ యాక్టులతో జీవితాలు కోల్పోవడం అవివేకమని చెప్పారు. కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ రామారావు, సీఐ నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వేధింపులకు పాల్పడుతున్న భర్తపై కేసు

అద్దంకి,జూన్11(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై వేధింపులకు పాల్పడుతున్న భర్తపై భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. అద్దంకి పట్టణంలోని ఎస్‌టీఐ కాలనీలో నివాసం ఉండే పి.వెంకటసుబ్బయ్య, అనితలకు 17 సంవత్సరాల క్రితం వివాహమైంది. మద్యానికి బానిసైన వెంకటసుబ్బయ్య భార్య అనితను వేదింపులకు గురిచేస్తున్నాడు. అనిత ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

దివ్యాంగులు వైద్యపరీక్షలకు హాజరుకావాలి

అద్దంకిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): శారీరక వైపల్యం కలిగిన పెన్షన్ దారులకు నిర్ణయించిన తేదిలలో స్థానిక చీరాల లోని ఏరియా హస్పిటల్ నందు వైద్య పరీక్షలకు హజరు కావాలని ఎంపీడీవో బత్తిన సింగయ్య బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఇప్పటికే ఆ యా గ్రామాలలలోని శారీరక వైపల్యం కలిగిన వారందరికి వైద్య పరీక్షలు జరిగే తేదిలు, సమయాన్ని తెలియజేయడం జరిగిందని తెలిపారు.

వైభవంగా వేణుగోపాలస్వామి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

యద్దనపూడి, (మార్టూరు)జూన్11(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి మండలంలో పూనూరు గ్రామంలో బుధవారం సాయంత్రం శ్రీవేణుగోపాల స్వామి వారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం హోమాలు, గరుడోత్సవం, అనంతరం భక్తులకు తీర్థప్రసాదాల పంపిణీ చేపట్టారు. తరువాత స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. ఇక సాయంత్రం స్వామి వారి రథోత్సవంలో భాగంగా పురాతన ఆచార సాంప్రదాయాలకు అనుగుణంగా రథాన్ని భక్తులు మున్నంగివారిపాలెం వైపు భక్తులు, ప్రజలు రథోత్సవం నిర్వహించారు. అనంతరం మున్నంగి వారి పాలెం గ్రామస్థులు స్వామి వారి దంపతులకు పట్టు వస్త్రాలను సమర్పించారు.తరువాత గ్రామంలో రథోత్సవం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి బోయపాటి సాంబశివరావు, ఈదల అనిల్ కుమార్, సుధాకర్ తదితర గ్రామస్థులు సహకరించారు.

బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఏపీజీబీ మేనేజర్ వాసు

బల్లికురవ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం బ్యాంకులలో ఖాతాలు కలిగిన వినియెగదారులకు అందిస్తున్న పలు బీమా పథకాలను సద్వినియెగం చేసుకోవాలని కొప్పెరపాడు ఏపీజీబీ బ్యాంకు మేనేజర్ ఎం. వాసు పేర్కొన్నారు. ఇటీవల కూకట్లపల్లి గ్రామానికి చెందిన వేల్పుల యేసోబు విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. మృతుడు కొప్పెరపాడు ఏపీజీబీ బ్యాంకులో ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజనలో చేరాడు. ఈ పథకంలో నమోదు కావడంతో యేసోబు కుటుంబ సభ్యులకు బీమా పథకం ద్వారా రూ. 2 లక్షలను ప్రభుత్వం మంజూరు చేసింది. బుధవారం మేనేజర్ వాసు మృతుడి భార్య వెంకటరమణకు చెక్కును అందజేశారు. ఈసందర్బంగా మేనేజర్ మాట్లాడుతు బ్యాంకులో ఖాతా కలిగిన ప్రతి ఒక్కరు బీమా పథకంలో చేరాలన్నారు. ఈ పథకం ఎంతో ఉపయెగమని వివరించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు పందిరి అబ్రహాం పాల్గొన్నారు.

హోమియో వైద్యశాలకు వీడిన గ్రహణం

● ఎమ్మెల్యే ఏలూరి చొరవతో నిధులు మంజూరు



వైద్యశాల మరమ్మతులు చేస్తున్న స్థానికులు

పర్చూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) :పర్చూరు మండల పరిధిలోని ఉప్పుటూరు హోమియో వైద్యశాలకు గ్రహణం వీడనుంది. వైద్యశాలలో కనీస వసతులు లేక పోవడంతో పాటు, భవనం శిథిలావస్థకు చేరింది. కొద్దిపాటి మరమ్మతులను కూడా గత వైసీపీ ప్రభుత్వం చేపట్టక పోవడంతో ప్రజలకు హోమియో వైద్యం దూరంకావాల్సిన దుస్థితి నెలకొంది. భవనం అందుబాటులో లేకపోవడంతో స్థానిక పంచాయతీ కార్యాలయంలో వైద్యసేవలు నిర్వహించుకోవాల్సిన దుస్థితి. ఈ తరుణంలో స్థానికుల ద్వారా సమస్యను తెలుసుకున్న ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రత్యేక చొరవ చూపి భవనం మరమ్మతులకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేయించారు. దీంతో గ్రామంలోని స్థానిక నేతలు హోమియో వైద్యులు దాసరి చంద్రశేఖర్ నేతృత్వంలో వైద్యశాలను అభివృద్ధి చేసే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి.

రైలు నుంచి జారిపడి నెల్లూరు వాసి దుర్మరణం

చీరాల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కదిలే రైలు నుంచి జారిపడి నెల్లూరు జిల్లా కొండాపురానికి చెందిన షేక్ ఖాజా రహమతుల్లా(29) దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి ఈపూరుపాలెం స్రయిట్ కట్ కాలువ సమీపంలో చోటుచేసుకొంది. తిరుపతి - లింగంపల్లి రైలులో ప్రయాణిస్తూ, జారిపడి తీవ్రంగా గాయపడగా స్థానికులు 108 సహాయంతో చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో వైద్యులు చికిత్స అందిస్తుండగా నిముషాల వ్యవధిలోనే తుదిశ్వాస విడిచాడు. ఈ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని బుధవారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

గోశాలకు దాణా అందజేత

అద్దంకిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఏరువాక పౌర్ణమి సందర్బంగా రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో బుధవారం అద్దంకిలోని హరిహర గోశాలకు ఐదు బస్తాల తవుడును అందజేశారు. రోటరీ మిత్రుల సహకారంతో గోశాలకు దాణాలను అందజేసినట్లు రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, సందిరెడ్డి శ్రీనివాసరావు, శేషారెడ్డి, లక్ష్మారెడ్డి, గోశాల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండలంలో మంత్రి గొట్టిపాటి పర్యటన

పంగులూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పవరం గ్రామంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నేడు పర్యటించనున్నారు. ముప్పవరం గ్రామంలో గురువారం ఉదయం 9 గంటలకు జరిగే పలు అభివృద్ధి కార్యక్రమాలలో మంత్రి గొట్టిపాటి పాల్గొననున్నారు. అనంతరం 11 గంటలకు సంతమాగులూరు మండలం సజ్జాపురం గ్రామంలో మంత్రి గొట్టిపాటి పర్యటించనున్నారని కార్యాలయ ప్రతినిధి తెలిపారు.

నవ ధాన్యాల సాగుతో భూసారం పెంపు

అద్దంకిటౌన్, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): నవదాన్యాల సాగుతో భూసారాన్ని పెంపొందించుకోవచ్చని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని వెంకటాపురం, నాగులపాడు గ్రామాలలో రైతులతో గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్బంగా ఏవో మాట్లాడుతూ ప్రీమాన్‌సూన్ డ్రై సోయింగ్ కిట్స్ 10 కిలోల పరిమాణంతో 20 రకాల విత్తనాలు రైతులకు 800 రూపాయలకు అందిస్తున్నారన్నారు. ఇవి సాగు చేయడం ద్వారా 30నుండి 40 టన్నుల జీవద్రవం, భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, సేంద్రీయ కర్బనం వంటివి పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ సీత, రైతులు పాల్గొన్నారు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
గురువారం, 12 జూన్ 2025 | ఉమ్మడి ప్రకాశం | 4 పేజీలు



లోకేశ్‌తో మాట్లాడుతున్న మంత్రి రవికుమార్



వివిధ సంస్థలతో ఎంఓయూ సందర్భంగా లోకేశ్‌తో రవికుమార్

వరుసగా ఐదు పర్యాయాలు అసెంబ్లీకి ఎన్నిక.. అందునా తెలుగుదేశంకు ఎదురుగాలి సమయంలోనూ విజయం.. ఆపై విపక్షంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీలో కీలకపాత్ర.. ప్రస్తుతం రాష్ట్ర మంత్రివర్గంలో కీలకమైన విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ 22 ఏళ్ల రాజకీయ పయనమిది. తొలుత నియోజకవర్గానికే పరిమితమైన రవికుమార్ విపక్షంలో రాజకీయంగా రాటుదేలారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ నేరుగా రవికుమార్‌ను లక్ష్యంగా చేసుకొని అధికార బలంతో దాడి చేశారు. ఆయన వ్యాపార సంస్థను మూసివేయించి తన పార్టీలోని ప్రముఖులందరినీ అద్దంకిపైకి ఉసిగొల్పారు. రాజకీయంగా రవికుమార్‌ను అణగదొక్కేందుకు సకల ప్రయత్నాలూ చేశారు. ఆ ఎదురు దెబ్బలకు తలొగ్గకుండా రవికుమార్ రాటు తేలారు. అద్దంకి ప్రజల ఆదరణను కాపాడుకుంటూ తెలుగుదేశంలో నిలదొక్కుకున్నారు. రాజకీయాల్లో తనదైన ఓర్పు, నేర్పును వీడకుండా ఉమ్మడి జిల్లాలో టీడీపీని ఏకతాటిపై నడపడంలో కీలకపాత్ర పోషించారు. ఇవన్నీ గుర్తించిన చంద్రబాబు.. మంత్రివర్గంలో రవికుమార్‌కు కీలకమైన విద్యుత్ శాఖను అప్పగించి పక్కన కూర్చోబెట్టుకున్నారు. యువనాయకుడు నారా లోకేష్.. రవి అన్నా అంటూ చేరదీశారు. అయినా రవికుమార్ ఉప్పొంగిపోలేదు. మరింత కఠోర దీక్షతో అమాత్య పదవిలో ముందడుగు వేస్తున్నారు. మంత్రిగా విద్యుత్‌శాఖ వ్యవహారాలన్నింటినీ ఒంటబట్టించుకున్నారు. రాష్ట్రంలోని ఉన్నతాధికారులతోపాటు కేంద్రంలోని పెద్దలతో సమన్వయంగా నడక సాగిస్తున్నారు. విదేశీ, స్వదేశీ కార్పొరేట్ సంస్థలతో విద్యుత్తు ఒప్పందాలు.. ఇతర అంశాలపై చర్చల్లో వారిని ఒప్పించి, మెప్పించడంలో దిట్టగా పేరుపొందారు. గత వైసీపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలు, విధానాలను ఎండగట్టి కూటమి ప్రభుత్వ విద్యుత్ విధానంపై ప్రజల్లో సానుకూలత ఏర్పర్చడంలో సఫలీకృతులయ్యారు. అవినీతి, అశ్రితపక్షపాతం లేకుండా పాలన సాగిస్తూ తొలి ఏడాదిలో ఉత్తమ మంత్రిగా గుర్తింపు పొందారు. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనా వ్యవహారాల్లో, మంత్రి లోకేష్ పార్టీ వ్యవహారాల్లో రవికుమార్‌కు ప్రాధాన్యం ఇస్తూ పలు ముఖ్యమైన బాధ్యతలు అప్పగిస్తున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే తన ఎదుగుదలకు దోహదపడిన అద్దంకి.. రాజకీయంగా నిలదొక్కుకునేందుకు తోడ్పడిన ఉమ్మడి ప్రకాశం జిల్లాలో విద్యుత్ రంగ అభివృద్ధి ఆయన అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రజలందరి మన్ననలందుకుంటున్నారు.



గిరిజన గూడేలలో వెలుగులు..

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా విద్యుత్ వెలుగులకు నోచుకోని పశ్చిమప్రాంతంలోని గిరిజన గూడేల్లో మంత్రి రవికుమార్ విద్యుత్ సరఫరా సౌకర్యాన్ని కల్పించారు. రమారమి రూ.8 కోట్ల వ్యయంతో విద్యుత్ లైన్లు వేసి 1,600 వరకు గిరిజనుల ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. గిద్దలూరు, మార్కాపురం, ఎర్రగొండపాలెం నియోజకవర్గాల్లో ఈ పనులు చేశారు. అందులో కనీస రవాణా సౌకర్యం కూడా లేని పాలుట్ల గిరిజనగూడెం, నెక్కంటి, పెద్దారుట్ల గూడేల్లో 611 గిరిజన నివాసిత గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించటం విశేషం. అలాగే వివిధ ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వం ఒప్పందం చేసుకోవడంలోనూ రవికుమార్ కీలక ప్రాత పోషించారు. ఈ విషయంలో సీఎం చంద్రబాబు, లోకేష్ చొరవ తీసుకొని పలు సంస్థలను రాష్ట్రానికి తీసుకురాగా విద్యుత్ శాఖ మంత్రిగా తన పరిధిలో ఆయా సంస్థలకు అవసరమైన సహాయసహకారాలను మంత్రి రవికుమార్ అందించారు.

రవికుమార్.. వన్‌డర్



జిల్లాలో విద్యుత్ పారిశ్రామిక అడుగులు..

వ్యవసాయాధారితమైన ఉమ్మడి జిల్లాలో కరెంటు సరఫరా మెరుగుదలకు చర్యలు తీసుకోవడంతోపాటు విద్యుత్ పరిశ్రమలను తేవడంలో రవికుమార్ కీలకంగా వ్యవహరించారు. అందులో ముఖ్యంగా కొత్త ప్రకాశం జిల్లాలో ఐదు బయోగ్యాస్ ప్లాంట్లు మంజూరు వెనుక రవికుమార్ పాత్ర గణనీయంగా ఉంది. రాష్ట్రస్థాయిలో బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటుకు రిలయన్స్ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందంలో మంత్రి నారా లోకేష్‌తోపాటు ముఖ్యపాత్ర పోషించారు. రిలయన్స్ సంస్థ ఒప్పందం జరిగిన వెంటనే తొలిప్లాంటు జిల్లాలోని కనిగిరి నియోజకవర్గానికి మంజూరు చేయించడంలో రవికుమార్ కీలకంగా వ్యవహరించారు. తనకు మిత్రుడైన కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి సిఫార్సును పరిగణనలోకి తీసుకొని తొలి ప్లాంటును కనిగిరి నియోజకవర్గంలోని పీసీపల్లి మండలంలో ఏర్పాటు చేయించగలిగారు. దానికి శంకుస్థాపన జరిగిన తరుణంలో జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో అపారంగా ఉన్న ప్రభుత్వ భూములను లోకేష్ దృష్టికి తీసుకెళ్లి మొత్తం ఐదు ప్లాంట్ల ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇప్పించగలిగారు. అందులో భాగంగా ఇప్పటికే కురిచేడు-కొనకనమిట్ల మండలాల్లో ప్లాంట్ల ఏర్పాటుకు స్థల సేకరణకు అడుగులు పడ్డాయి. మరో రెండుప్లాంట్లు పశ్చిమ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇటు రైతులకు చేయూత.. అటు ఉపాధి అవకాశాల కల్పన.. ఇంకోవైపు ఉద్యోగ అవకాశాల కల్పనే ధ్యేయంగా ఈ బయోగ్యాస్ ప్లాంట్ల ఏర్పాటు జరగబోతుండటం విశేషం. ప్రజలకు ఉపయోగకరంగా ఉన్న ఈ ప్లాంట్లను ఉమ్మడి జిల్లాకు చెంది ప్రస్తుతం బాపట్ల జిల్లాలో ఉన్న అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయించాలన్న లక్ష్యంతో మరో అడుగు ముందుకేశారు. రెండు ఇతర దేశాల పారిశ్రామిక సంస్థలతో ఆవిషయమై చర్చలు కూడా జరిపారు. అందులో భాగంగా అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లో రెండు బయోగ్యాస్ విద్యుత్ ప్లాంట్లు ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీటికితోడు మరో రెండు సోలార్ విద్యుత్ ప్లాంట్ల ఏర్పాటుకు కార్యాచరణ రూపొందించారు. అటు కనిగిరి, దర్శి నియోజకవర్గాల్లో వాటి ఏర్పాటుపై పరిశీలన చేపట్టారు. కందుకూరు నియోజకవర్గంలోని రామాయపట్నం పోర్టుకు అనుసంధానంగా ఒక సోలార్ విద్యుత్ ప్రాజెక్టు ఏర్పాటుకు చర్యలు తీసుకోగలిగారు.



పీసీపల్లి మండలంలో రిలయన్స్ బయోగ్యాస్ ప్లాంట్‌కు శంకుస్థాపన చేస్తున్న రవికుమార్ (ఫైల్)

మంత్రిగా తొలి ఏడాదిలోనే సూపర్ సక్సెస్

- అటు నియోజకవర్గం.. ఇటు జిల్లాకు ప్రాధాన్యం
- విద్యుత్‌శాఖ మంత్రిగా ప్రత్యేక చొరవ
- వివిధ ప్రముఖ సంస్థలతో ఎంవోయూలు
- జిల్లాకు కూడా పలు ప్రాజెక్టులు
- కరెంటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

ఆంధ్రజ్యోతి, ఒంగోలు:

ఎమ్మెల్యేగా ఆదరించిన నియోజకవర్గం.. రాజకీయంగా గౌరవించిన జిల్లాకు తాను చేపట్టిన పదవి ద్వారా చేయూతనిచ్చేందుకు విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక చొరవ తీసుకున్నారు. మంత్రిగా ఎవరికివారు నిర్వహించే శాఖలో రాష్ట్రస్థాయి కార్యక్రమాలతోపాటు జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కొన్ని అభివృద్ధి పనులకు చేయూతనిచ్చే అవకాశం ఉంటుంది. అయితే అందుకు కావాల్సిందల్లా అంతోఇంతో నియోజకవర్గం, జిల్లాపై ప్రత్యేక అభిమానం ఉండటమే. ఈ విషయంలో రవికుమార్ చూపిన చొరవ అభినందనీయమని చెప్పుకోవచ్చు. అనేక సంస్కరణల నేపథ్యంలో విద్యుత్‌శాఖ మంత్రిగా రాష్ట్రస్థాయి వ్యవహారాల్లో బిజీగా ఉన్నప్పటికీ అటు నియోజకవర్గ, ఇటు ఉమ్మడి జిల్లాకు సంబంధించి అనేక విషయాల్లో ఆయన ప్రాధాన్యం ఇచ్చారు. అందులో ముఖ్యంగా తన పరిధిలోని విద్యుత్ శాఖ ద్వారా ఆయన అటు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గం, ఉమ్మడి జిల్లాకు అనేక కీలకమైన అభివృద్ధి పనులు మంజూరు చేయించగలిగారు. నాణ్యమైన కరెంటును ప్రజలకు అందించడం, విద్యుత్ రంగపరమైన అభివృద్ధి పనులకు నాంది పలకడంతోపాటు కొన్ని ప్రాజెక్టులను జిల్లాకు రాబట్టడంలో కీలకంగా వ్యవహరించారు. దశాబ్దాలుగా విద్యుత్ వెలుగులు చూడని గిరిజన గూడేల్లో కాంతులు వెదజల్లిస్తున్నారు. అటు నియోజకవర్గంతో పాటు.. ఇటు జిల్లాకు విద్యుత్ శాఖ మంత్రిగా తొలి ఏడాదిలోనే ఆయన చేసిన కొన్ని పనులను పరిశీలిస్తే ఔరా! అనిపించక మానదు.

సబ్‌స్టేషన్ల మంజూరు

ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో లోవోల్టేజీ సమస్యను దృష్టిలో ఉంచుకొని విద్యుత్ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు మంత్రి రవికుమార్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. అందులో భాగంగా సుమారు 12 విద్యుత్ సబ్ స్టేసన్లు తొలి ఏడాదిలోనే జిల్లాకు మంజూరయ్యాయి. గిద్దలూరు నియోజకవర్గంలోని కొమరోలు మండలం కాశినపల్లి, కొండపి నియోజకవర్గం టంగుటూరు మండలంలోని పి.నాయుడుపాలెంలో తొలి విడతగా రెండు 33/11 విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరు చేశారు. సుమారు రూ.7 కోట్ల వ్యయంతో చేపట్టిన ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వీటికి తోడు మరో రూ.17.50 కోట్ల వ్యయంతో ఆరు సబ్ స్టేషన్లు మంజూరు చేయగా వాటి నిర్మాణానికి టెండర్లు పిలుస్తున్నారు. అందులో ఒకటి ఒంగోలు నియోజకవర్గంలోని ఒంగోలులో గల హౌసింగ్ బోర్డు వద్ద, దర్శి నియోజకవర్గం, కురిచేడు మండలం, కల్లూరులో, ఎర్రగొండపాలెం నియోజకవర్గం పుల్లలచెరువు మండలం ఐటీవరంలో, మార్కాపురం నియోజకవర్గం పొదిలి మండలం ఏలూరులో, కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం మన్నేరుపల్లిలో ఈ సబ్ స్టేషన్ల నిర్మాణం జరగనుంది. పర్చూరు నియోజకవర్గం ఎనమదల వద్ద సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ.3 కోట్లు మంజూరయ్యాయి. ఇక తన సొంత నియోజకవర్గమైన అద్దంకిలో నాలుగు 33/11 కేవీ సబ్ స్టేషన్ల నిర్మాణానికి రూ.18.65 కోట్లు మంజూరయ్యాయి. చీరాల నియోజకవర్గంలో విద్యుత్ సరఫరా మెరుగుదలకు అవసరమైన పనులకు రూ.6.60 కోట్లు మంజూరు చేశారు. నియోజకవర్గ కేంద్రమైన కనిగిరిలో రోడ్ల విస్తరణ పనులు చేపట్టగానే అవసరమైన 200పైన స్తంభాలను, కొత్తలైన్ల నిర్మాణానికి అవసరమైన కండక్టర్‌ను ఆగమేఘాలపై మంజూరు చేయించారు.



అద్దంకి నియోజకవర్గంలో..

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గంలో భవిష్యత్తు అవసరాలను కూడా దృష్టిలో ఉంచుకొని పెద్దమొత్తంలో విద్యుత్ అభివృద్ధి పనులకు శ్రీకారం పలికారు. తొలి ఏడాదిలోనే రూ.83 కోట్లతో నియోజకవర్గంలో విద్యుత్ అభివృద్ధి పనులను చేపట్టారు. నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించే క్రమంలో ఏల్చూరులో 132/33 కేవీ సబ్ స్టేషన్‌తోపాటు అద్దంకి పట్టణంలో రెండు, బల్లికురవ మండలం మల్లయ్యపాలెం, సంతమాగులూరు మండలం కుప్పరంలో నాలుగు 33/11 కేవీ సబ్ స్టేషన్ల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. ఇక ఆయా సబ్ స్టేషన్లలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని 3.15 నుంచి 5 ఎంవీఏ పెంచేందుకు చర్యలు తీసుకొని రూ.1.30 కోట్లు మంజూరు చేశారు. అలాగే బల్లికురవ మండలం కొప్పెరపాడు, సంతమాగులూరు మండలం, కొమ్మాలపాడు సబ్ స్టేషన్లలో ఐదు ఎంవీఏ సామర్థ్యం కలిగిన పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా ఆయా సబ్ స్టేషన్ల సామర్థ్యాన్ని రెట్టింపు చేసేందుకు రూ.2.38 కోట్లు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు కూడా అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. రూ.4.10 కోట్ల వ్యయంతో 254 కిలో మీటర్ల మేర నూతన 11 కేవీ లైన్లు ఏర్పాటు చేశారు. రూ.21 లక్షల వ్యయంతో 19 కిలో మీటర్ల పొడవున 6.3 కెవీ విద్యుత్ లైన్‌ను 11 కేవీ లైన్‌గా మార్పుచేయడం జరిగింది. అలాగే మరో 1.24 కోట్లతో 90 కిలోమీటర్ల పొడవున ఉన్న ఫేజ్-3 లైన్‌ను 3ఫేజ్ ఐదు వయర్ల లైన్‌గా మార్పు చేశారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం మరో ప్రాంతంలో 71 కిలో మీటర్ల పొడవున రూ.1.14 కోట్ల వ్యయంతో కండక్టర్ ఎల్‌టీ లైన్‌ను ఏర్పాటు చేశారు. అలాగే మరో రూ.2.44 కోట్ల వ్యయంతో 117 కిలో మీటర్ల పొడవునా ఏబీ కేబుల్ ఎల్‌టీ లైన్ ఏర్పాటు చేశారు. ఇలా ఆయా విద్యుత్ లైన్ల సామర్థ్యాన్ని పెంచడం ద్వారా వ్యవసాయ రంగానికి ఇతోధికంగా మేలు చేకూరనుంది. లోఓల్టేజీ సమస్యను నివారించేందుకు రూ.7.09 కోట్ల వ్యయంతో 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు 66 ఏర్పాటుతోపాటు మరో రూ.2.26 కోట్లతో 63 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను 25 ఏర్పాటు చేయడం జరిగింది. అలాగే మరో రూ.3.12 కోట్లతో నూతన సింగిల్ ఫేజ్ 16 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు 86 ఏర్పాటు చేశారు. నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం రూ.6.2 కోట్లతో 25 కేవీఏ సామర్థ్యం ఉన్న 151 ట్రాన్స్‌ఫార్మర్లు కొత్తగా ఏర్పాటు చేశారు. ఈ చర్యల ద్వారా నియోజకవర్గంలో గత ఏడాది జూన్ నుంచి ఇప్పటి వరకు 950 నూతన వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు మంజూరు చేయడం విశేషం. అలాగే ఎప్పుడో వేసిన పొట్టి విద్యుత్ స్తంభాలను తీసివేసి వాటి స్థానంలో 9.1 మీటర్ల పొడవైన 1,599 కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.



ఇందుకోసం రూ.4.31 కోట్లు వెచ్చించారు. తన శాఖ పరిధిలోని విద్యుత్ రంగానికి సంబంధించి నియోజకవర్గంలో పూర్తిస్థాయి అభివృద్ధికి ఆయన ముందుగానే ఒక ప్రణాళిక రూపొందించుకున్నారు. అందుకు అనుభవం కలిగిన విద్యుత్ అధికారులను నియోజకవర్గానికి పంపించి ఆ ప్రణాళికను రూపొందించారు. స్థానికంగా తన పరిధిలో ఉండే నిధులకు తోడు కేంద్రం నుంచి ప్రత్యేక నిధులు తెచ్చి నియోజకవర్గంలో విద్యుత్ రంగ అభివృద్ధికి పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోబోతున్నట్లు మంత్రి రవికుమార్ తెలిపారు.

రవికుమార్‌కు మరిన్ని బాధ్యతలు

- రెండు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రి
- ఉమ్మడి జిల్లాలోనూ ప్రాధాన్యం
- మహానాడు లాంటి ముఖ్యమైన కార్యక్రమాల్లోనూ ప్రత్యేక బాధ్యతలు



రాష్ట్రంలో పలు విద్యుత్ ప్రాజెక్టులను వర్చువల్ విధానంలో ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి రవికుమార్ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

సీఎం చంద్రబాబు అందర్నీ నమ్మరు. ఎవర్ని నమ్మితే వారికి అదనపు బాధ్యతలు ఇస్తారు. ఇది జగమెరిగిన సత్యం. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ విషయంలో చంద్రబాబు అనుసరిస్తున్న విధానం ఆ అంశాన్ని జ్ఞప్తికి తెస్తుంది. ప్రస్తుతం మంత్రి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గం బాపట్ల జిల్లాలో ఉంది. సహజంగానే సొంత జిల్లా బాధ్యతలు మంత్రిపైనే ఉంటాయి. దీనికితోడు ఉమ్మడి ప్రకాశం జిల్లా విషయంలో కూడా అనేక అంశాల్లో ఆయన జోక్యాన్ని సీఎం కోరుకుంటున్నారు. ఉమ్మడి సమస్యలు, అంశాలకు తోడు పార్టీ పరమైన విషయాల్లోనూ సీఎం చంద్రబాబు మంత్రి గొట్టిపాటితో చర్చిస్తుంటారు. వీటికితోడు రవికుమార్‌ను పశ్చిమగోదావరి, పల్నాడు జిల్లాలకు ఇన్‌చార్జి మంత్రిగా నియమించడం గమనార్హం. రాష్ట్ర ప్రభుత్వంలో ఇన్‌చార్జి మంత్రుల పాత్ర గణనీయం. వారికి ఉండే అధికారాలు అపారం. వాటికి తోడు ఇన్‌చార్జి మంత్రులు నెలకు రెండుసార్లు ఆ జిల్లాలకెళ్లాలని, మూడు మాసాలకోసారి డీఆర్సీ సమావేశం నిర్వహించాలని, అంతేగాక పార్టీ కార్యక్రమాల్లోనూ విరివిగా పాల్గొనాలని సీఎం స్పష్టమైన ఆదేశాల ఇచ్చారు. ఆయా జిల్లాలకెళ్లినప్పుడు పార్టీ సమావేశంలో జిల్లా మంత్రికంటే ఇన్‌చార్జి మంత్రిని పక్కన కూర్చోబెట్టుకుని చంద్రబాబు సమీక్షలు చేస్తున్నారు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న నేపథ్యంలో కూడా రవికుమార్‌కు కీలకమైన రెండు జిల్లాల ఇన్‌చార్జి మంత్రి బాధ్యతలు ఇవ్వడం విశేషం. రవికుమార్ కూడా అంతే అంకితభావంతో తన బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అటు పల్నాడు, ఇటు పశ్చిమగోదావరి జిల్లాల్లో రవికుమార్ అనుసరించిన విధానాలను మిగిలిన వారు అనుసరించాలని ఒక టెలీకాన్ఫరెన్స్‌లో చంద్రబాబు చెప్పడం విశేషం. అంతేగాక సాగునీటి సంఘాల ఎన్నికల సమయంలో పల్నాడు జిల్లాలో ఇన్‌చార్జి మంత్రిగా రవికుమార్ అనుసరించిన విధానాన్ని మిగిలిన జిల్లాల్లోనూ అమలు చేయాలని సీఎం సూచించారు. ఇలా ఇన్‌చార్జి మంత్రిగా రెండు జిల్లాల్లో, అటు సొంత జిల్లా బాపట్లలో, ఇటు ఉమ్మడి జిల్లాగా ప్రకాశంలో అనేక ముఖ్యమైన కార్యక్రమాల్లో ఆయన హాజరవుతూ పాలనలోనూ.. పార్టీ వ్యవహారాల్లో చూపుతున్న చొరవ చంద్రబాబును, లోకేష్‌ను ఆకట్టుకుంది. ఇచ్చిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారన్న నమ్మకంతో కాబోలు టీడీపీ వ్యవహారాల్లో కూడా రవికుమార్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. 2022లో ఒంగోలులో జరిగిన మహానాడు జయప్రదంలో కూడా రవికుమార్ కృషిని గుర్తించారు. కడపలో నిర్వహించిన మహానాడులో కీలకమైన జనసమీకరణతోపాటు రెండు బాధ్యతలను రవికుమార్‌కే అప్పగించారు.

అందంగా అద్దంకి


అద్దంకిలో నిర్మించిన సీసీ రోడ్డు

- మంత్రి రవికుమార్ ప్రత్యేక కార్యాచరణ
- రూ.5 కోట్లతో సీసీ రోడ్లు, సైడ్‌డ్రెయిన్‌లు
- మినీ బైపాస్ నిర్మాణానికి నిధులు మంజూరు
- సమగ్ర మంచినీటి పథకం పనుల పునఃప్రారంభానికి చర్యలు

అద్దంకి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి పట్టణాన్ని అందంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నారు. ఇప్పటికే పట్టణంలోని 20 వార్డులలో సుమారు రూ.2 కోట్లతో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో రూ.3 కోట్లతో వీటి నిర్మాణానికి టెండర్‌లు పూర్తయ్యాయి. ఇక శివారు కాలనీలలో సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్‌ల నిర్మాణంపై దృష్టి రవికుమార్ దృష్టి సారించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అద్దంకి పట్టణంలోని రేణింగవరం రోడ్డు నుంచి నామ్ రోడ్డు వరకు ఉన్న అద్దంకి మేజర్ కాలువకు రెండు వైపులా అభివృద్ధి చేసి మినీ బైపాస్‌గా మార్చేందుకు సుమారు రూ.15 కోట్లు మంజూరయ్యాయి. కాలువ కట్టలపై నివాసం ఉంటున్న సుమారు 50 కుటుంబాలకు శింగరకొండ సమీపంలో అద్దంకి కొండ వద్ద స్థలాల కేటాయింపునకు ఏర్పాట్లు చేస్తున్నారు. భూమి చదును చేసి, మౌలిక వసతుల కల్పనకు కూడా చర్యలు చేపడుతున్నారు. అదే సమయంలో రెండో విడతలో రేణింగవరం రోడ్డు నుంచి టిడ్కో ఇళ్ల మీదుగా శింగరకొండ సమీపంలోని 99 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం వరకు మినీ బైపాస్ రోడ్డును పొడిగించే విధంగా కూడా చర్యలు తీసుకుంటున్నారు. మినీ బైపాస్ పూర్తయితే అద్దంకి పట్టణంలో రోడ్డు ప్రమాదాలు తగ్గే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.


అద్దంకి లో మినీ బైపాస్‌గా అభివృద్ధి చేయనున్న కాలువ కట్ట ప్రాంతం

ఇప్పటికే రూ.1.5 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మాణం పూర్తయ్యింది. ఎన్‌ఎస్‌పీ కాలనీ, ద్వారకానగర్‌ల వద్ద రెండు విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. శింగరకొండ రోడ్డులో అగ్నిమాపక కేంద్రం భవనం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నంబూరివారిపాలెంలో అంబేడ్కర్ భవన్‌లో అదనపు భవనం నిర్మాణం పూర్తయ్యింది. పలు కాలనీలలో సుమారు నాలుగు దశాబ్దాల నాడు ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరడతో అన్నింటినీ మార్పు చేశారు. అదే సమయంలో అదనపు స్తంభాలు ఏర్పాటు జరిగింది. దీంతో పట్టణంలో విద్యుత్ సమస్యలకు పరిష్కారం లభించింది.



తోపుడు బండ్ల వ్యాపారులకు తోడ్పాటు

- రోజువారీ అద్దె చెల్లింపు నుంచి విముక్తి
- పెరిగిన ఆదాయంతో కుటుంబాలు సంతోషం


తోపుడు బండ్లను పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్, ఎంపీ కృష్ణప్రసాద్ (ఫైల్)

అద్దంకి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : మండుటెండలో రోజంతా నిలబడి వ్యాపారం చేసుకునే తోపుడు బండ్ల వ్యాపారులకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ అండగా నిలిచారు. వారికి అద్దెభారం నుంచి విముక్తి కల్పించి, ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటునందించారు. చిరువ్యాపారులు అద్దెకు తోపుడు బండి తీసుకొని ఆ అద్దెను రోజువారీ చెల్లించాల్సి ఉంటుంది. ఇలా నెలవారీ రూ.3 వేల నుంచి రూ.5 వేల వరకూ అద్దె చెల్లించాల్సి వచ్చేది. ఈనేపథ్యంలో వారికి అండగా నిలిచేందుకు పారిశ్రామిక వేత్తల సహకారంతో తోపుడు బండ్ల పంపిణీకి మంత్రి రవికుమార్ శ్రీకారం పలికారు. మొత్తం 300 మందిని గుర్తించి ఇప్పటికే 150 మందికి తోపుడు బండ్లను అందజేశారు. దీంతో వారికి అద్దె బాధ తప్పింది. రోజు వారీ వచ్చే ఆదాయం పెరిగింది. నెలవారీ రూ.5 వేలు ఎక్కువ మిగులుతుండటంతో ఆయా కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన 150 మందికి కూడా త్వరలోనేబండ్లను అందజేయనున్నారు.

రూపురేఖలు మారిన రోడ్లు

ఏడాదిలో రూ.70 కోట్లతో మరమ్మతులు, అభివృద్ధి

- రెండు దశాబ్దాల నాటి రహదారులు పునర్నిర్మాణం
- గ్రామాల్లో పెద్దఎత్తున సీసీ రోడ్లు


పనులు జరుగుతున్న చెన్నుపల్లి-వైదన రోడ్డు

అద్దంకి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ రోడ్లకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ పట్టింది. ఏడాది కాలంలోనే అనేక రహదారుల రూపురేఖలు మారిపోయాయి. గత వైసీపీ ఐదేళ్ల పాలనలో రోడ్ల నిర్మాణం అటుంచి ఉన్న వాటికి కనీస మరమ్మతులు కూడా మృగ్యమయ్యాయి. దీంతో గోతులమయమైన రోడ్లపై వాహనచోదకులు నరకయాతన అనుభవించారు. కొన్నిచోట్ల బిక్కుబిక్కుమంటూ ప్రయాణించే వారు. 2024లో అధికారంలోకి వచ్చిన ప్రస్తుత ప్రభుత్వం ఒకవైపు సంక్షేమ పథకాలను అమలు చేస్తూనే మరోవైపు అభివృద్ధి పనులను వేగవంతం చేసింది. అందులో భాగంగా రోడ్ల అభివృద్ధి, మరమ్మతులకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చింది. విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తనదైన శైలిలో అద్దంకి నియోజకవర్గానికి రూ.70కోట్లు మంజూరు చేయించారు. వీటిలో పలు గ్రామీణ రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తయ్యింది. మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. అన్ని గ్రామాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో పల్లెల్లో అభివృద్ధి ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

ఉపాధి హామీ కింద రూ.14.56 కోట్లు మంజూరు

ఉపాధి హామీ పథకం కింద మొత్తం రూ.14.56 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో తిమ్మనపాలెం-యర్రబాలెం రోడ్డు, బండివారిపాలెం-మిన్నెకల్లు, సంతమాగులూరు-నెహ్రూనగర్, జాతీయ రహదారి-పి.గుడిపాడు, జాతీయ రహదారి నుంచి కుర్రవానిపాలెం రోడ్డు పనులు చేపట్టారు. పి.గుడిపాడు నుంచి అలవలపాడు, నామ్ రోడ్డు నుంచి గోవాడ, వైదన నుంచి చెన్నుపల్లి, సంతమాగులూరు మండలం సజ్జాపురం రోడ్డు, మేదరమెట్ల నుంచి తమ్మవరం రోడ్లకు కూడా నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయి.

పలు రోడ్ల పునర్నిర్మాణం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి రూ.9.85 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రెండు దశాబ్దాల క్రితం నిర్మించి పూర్తి శిథిలావస్థకు చేరిన అద్దంకి మండలం శాంతినగర్-మైలవరం వయా వెంపరాల, ఉప్పలపాడు రోడ్డు, బల్లికురవ మండలం వి.కొప్పెరపాడు-జమ్మలమడక వయా కొత్తూరు, వెలమవారిపాలెం రోడ్డుల పునర్నిర్మాణం చేయనున్నారు. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ఆర్‌అండ్‌బీ నుంచి రూ.15.50 కోట్లు

ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి అద్దంకి నియోజకవర్గానికి రూ.15.50 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటికే రూ.9.50 కోట్లతో పలు రోడ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డులో వల్లాపల్లి సమీపంలో అద్దంకి బ్రాంచి కెనాల్‌పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2 కోట్లు, అద్దంకి-బల్లికురవ-సంతమాగులూరు రోడ్డుకు రూ.కోటి, బల్లికురవ నుంచి కొణిదెన మీదుగా జాతీయ రహదారి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్లు, ముప్పవరంలో బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.కోటి కేటాయించారు. పల్లె పండుగ కింద నియోజకవర్గంలో సుమారు రూ.30 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రెయిన్‌లు, గోకులం షెడ్‌లు, పంట కాలువలు, సేద్యపు నీటి కుంటల నిర్మాణాలు జరిగాయి. జిల్లా మినరల్ ఫండ్ కింద అద్దంకి నియోజకవర్గంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.7 కోట్లను కలెక్టర్ మంజూరు చేశారు.


పునర్నిర్మించిన గోవాడ రోడ్డు


పూడికతీత, చిల్ల చెట్లు తొలగించడంతో రూపుమారిన పమిడిపాడు మేజర్ కాలువ (ఇన్‌సెట్‌లో) గతంలో చిల్లచెట్లతో మూసుకుపోయి ఉన్న కాలువ

మేజర్ కష్టాల నుంచి విముక్తి

పమిడిపాడు ప్రధాన కాలువతోపాటు మైనర్‌ల ఆధునికీకరణ

పంగులూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : సాగర్ ఆయకట్టు రైతులకు ఈ ఏడాది కష్టాలు తీరనున్నాయి. పమిడిపాడు మేజర్‌తోపాటు మైనర్ కాలువల ఆధునికీకరణ పనులు పూర్తవడంతో రైతులు అనందం వ్యక్తం చేస్తున్నారు. గత ఐదేళ్లుగా అద్దంకి బ్రాంచి కెనాల్ (ఏబీసీ) పరిధిలోని మేజర్లు, మైనర్లకు మరమ్మతులు కరువవడంతో పూడిక పేరుకుపోయింది. కాలువలతోపాటు కట్టలను సైతం చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో సాగునీరు సక్రమంగా ప్రవహించక, కట్టలపై రాకపోకలు సక్రమంగా సాగించలేక రైతులు అవస్థలు పడ్డారు. అప్పట్లో ప్రతిపక్ష శాసనసభ్యుడిగా రైతులు సాగు నీటి కోసం పడిన ఇబ్బందులను రవికుమార్ ప్రత్యక్షంగా గమనించారు. ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చింది. రవికుమార్ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆవెంటనే ఆయన కాలువల ఆధునికీకరణపై దృష్టి సారించారు. అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలో 16 కిలో మీటర్ల వరకు విస్తరించి ఉన్న పమిడిపాడు మేజర్‌తోపాటు దానికి అనుబంధంగా ఉన్న కోటపాడు, బొమ్మనంపాడు, పంగులూరు, తూర్పు కొప్పెరపాడు, మణికేశరం, తమ్మవరం మైనర్ల ఆధునికీకరణకు రూ. 80 లక్షల ఎస్‌డీఎంఎఫ్ నిదులు మంజూరు చేయించారు. ఈ నిధులతో పంట సాగుకు ముందే కాలువల్లో పేరుకున్న పూడికతీయడంతోపాటు కాలువలను, కట్టలను కమ్మేసిన చిల్లచెట్లను అధికారులు తొలగింపజేశారు. కట్టలపై ఏర్పడిన గోతులకు మరమ్మతులు చేయించారు. దీంతో ఈ వేసవిలో తాగునీటికి విడుదల చేసిన సాగర్ జలాలు సాఫీగా చెరువులకు చేరాయి. ఈ ఏడాది సాగర్ నీరు విడుదల చేస్తే చివరి ఆయకట్టు వరకూ చేరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి గొట్టిపాటి కృషితో కాలువలకు మరమ్మతులు



రాష్ట్ర విద్యుత్‌శాఖామంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషి, సహకా రంతో అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని పమిడిపాడు మేజర్‌తోపాటు పలు మైనర్లకు మరమ్మతులు జరిగాయి. గత ఐదేళ్లుగా నీటి పారుదల సరిగా లేక, పొలాలకు నీరందక రైతులు పడిన ఇబ్బందులు తొలిగిపోయాయి. మంత్రికి రైతులందరి తరఫున కృతజ్ఞతలు.

\- కుక్కపల్లి ఆంజనేయులు, డీసీ చైర్మన్

సాగర్ ఆయకట్టుకు జీవం

- రూ.3.53 కోట్లతో మేజర్, మైనర్‌ల అభివృద్ధి
- చివరి భూమి వరకూ నీరందేలా చర్యలు
- గతంలో చిట్టడవిలా ఉన్న కాలువలు
- తీరనున్న రైతుల సాగునీటి కష్టాలు

బల్లికురవ. జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ పాలనలో సాగర్ కాలువల అభివృద్ధి ఊసే కరువైంది. మేజర్లు, మైనర్లు కనీస మరమ్మతులకు కూడా నోచుకోలేదు. ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయింది. కాలువలను చిల్లచెట్లు కమ్మేశాయి. దీంతో నీటి ప్రవాహం సాఫీగా సాగక రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పంటలను దక్కించుకునేందుకు పడరానిపాట్లుపడ్డారు. చుక్కనీరు అందక చివర ఆయకట్టుదారులు మరింత దయనీయ పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఆ కష్టాలన్నీ ఇప్పుడు తీరిపోయాయి. ప్రస్తుత ప్రభుత్వం సాగర్ కాలువల మరమ్మతులపై ప్రత్యేక దృష్టి సారించింది. విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో అద్దంకి నియోజకవర్గంలో ఉన్న అన్ని మేజర్‌లు, మైనర్‌ల అభివృద్ధికి రూ.3.53 కోట్లను మంజూరు చేసింది. పనులు శరవేగంగా పూర్తయ్యాయి. బల్లికురవ మండలంలోని గుంటుపల్లి, వైదన, వెంపరాల, చెన్నుపల్లి, గొర్రెపాడు, ముక్తేశ్వరం మేజర్లతోపాటు, అన్ని మైనర్ కాలువల్లో వ్యర్థాలను తొలగించారు. జంగిల్ క్లియరెన్స్ చేశారు. ఈసారి కాలువల్లో నీటి ప్రవాహానికి ఎలాంటి అవరోధం లేకుండా పొలాలకు చేరుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


అభివృద్ధి చేసిన గుంటుపల్లి మేజర్ కాలువ


కేజీబీవీలో నిర్మాణంలో ఉన్న వసతి గదులు

బాలికా విద్యకు పెద్దపీట

- బల్లికురవ, సంతమాగులూరు కేజీబీవీలలో రూ.3.24 కోట్లతో వసతి గదుల నిర్మాణం
- వైదన వసతి గృహానికి రూ.50 లక్షలు మంజూరు
- మంత్రి గొట్టిపాటి కృషితో శరవేగంగా పనులు

బల్లికురవ. జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం బాలికా విద్యకు పెద్దపీట వేసింది. గ్రామాల్లో అడపిల్లలకు మెరుగైన విద్యను అందించేలా నిధులు ఇస్తోంది. దీన్ని సద్వినియోగం చేసుకున్న విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.కోట్ల నిధులు మంజురు చేయించారు. వాటితో పలుగ్రామాలలో విద్యాలయాలు, వసతి గృహాల అభివృద్ధి, గదుల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. బల్లికురవ మండలం గుంటుపల్లిలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులు ఉండేందుకు గదులు లేక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని తల్లిదండ్రులు మంత్రి గొట్టిపాటి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన ఆరు వసతి గదుల నిర్మాణానికి రూ.1.64 కోట్లు మంజూరు చేయించారు. రెండు మాసాల క్రితం భూమి పూజ కూడా చేశారు. ఆవెంటనే పనులు ప్రారంభమయ్యాయి. ప్రస్తుతం లెంటల్ దశకు చేరాయి. ఈ గదులు పూర్తయితే కార్పొరేట్ కళాశాల మాదిరి విద్యార్థినులకు వసతులు మెరుగుపడనున్నాయి. సంతమాగులూరు మండలం ఏల్చూరులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో కూడా ఆరు వసతి గదులకు ప్రభుత్వం రూ.1.60 కోట్లను మంజూరు చేసింది. పనులు జరుగుతున్నాయి. వైదన గ్రామంలో మరమ్మతులకు నోచుకోక రెండేళ్ల నుంచి మూతపడి ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహం మరమ్మతులకు మంత్రి రవికుమార్ రూ.50 లక్షలు మంజూరు చేయించారు. ఈ ఏడాది నుంచి ఇది పునఃప్రారంభంకానుంది. బాలికలకు అన్ని రకాల వసతులతో విద్య అందించేలా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక ద్వారా ముందుకు వెళ్తుండటం, మంత్రి రవికుమార్ కూడా భారీగా నిధులు సాధించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే ఎంతో కాలంగా ఉన్న సమస్యలు తీరిపోయాయని విద్యార్థినులు తెలిపారు.


సైకిళ్ల పంపిణీ అనంతరం విద్యార్థినులతో మంత్రి రవికుమార్ (ఫైల్)

విద్యార్థినులకు సైకిళ్లు

- 10 వేల మందికి పంపిణీ లక్ష్యం
- ఈ విద్యా సంవత్సరంలోనే అందజేతకు రవికుమార్ ప్రణాళిక

అద్దంకి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : బాలికా విద్యను ప్రోత్సహించే లక్ష్యంతో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ హైస్కూల్ విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీకి శ్రీకారం చుట్టారు. గత విద్యాసంవత్సరం చివరలో అద్దంకి పట్టణంలోని ప్రకాశం ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో రెండు విడతలుగా సీఎస్‌ఆర్ గ్రాంట్ ద్వారా 550 మంది విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలో అన్ని హైస్కూళ్లలో మొత్తం 10 వేల మంది విద్యార్థినులు విద్యభ్యసిస్తున్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభమవుతున్న నేపథ్యంలో ఈ విద్యాసంవత్సరం నియోజకవర్గంలోని విద్యార్థినులందరికీ సైకిళ్లు అందజేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గ్రామాల నుంచి హైస్కూళ్లకు విద్యార్థినులు ఎక్కువమంది ఆటోలలో వస్తున్నారు. కొందరిని తల్లిదండ్రులు పాఠశాల వరకు వదిలి వెళ్లాల్సి వస్తోంది. దీంతో పలు సందర్భాలలో ఆలస్యమవుతోంది. అదేసమయంలో ఆటోలలో రావడానికి డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. సైకిళ్ల పంపిణీతో వాటిపై బాలికలు స్కూల్‌కు వచ్చే అవకాశం ఉంటుంది.

76 పాఠశాలల్లో మౌలిక వసతులు

నియోజకవర్గంలోని 76 స్కూళ్లలో మౌలిక వసతులు కల్పిస్తున్నారు. సుమారు రూ.50 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో ప్రధానంగా ఫ్యాన్‌లు, లైట్లు ఏర్పాటు చేయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు మెరుగు పడనున్నాయి. చందలూరు హైస్కూల్‌లో రూ.35 లక్షలతో డైనింగ్ హాలు నిర్మాణం జరుగుతోంది. అద్దంకి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో డైనింగ్ హాలు నిర్మాణానికి రూ.25 లక్షల సీఎస్‌ఆర్ గ్రాంట్ మంజూరైంది. ఇలా ప్రభుత్వ విద్యాలయాలలో మౌలిక వసతులు, అదనపు గదుల నిర్మాణానికి మంత్రి రవికుమార్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించారు.

తీరనున్న రహదారి కష్టాలు


తమ్మవరం రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

- నిధులు మంజూరు చేయించిన మంత్రి రవి
- ఎస్సీ, బీసీ కాలనీల్లో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.1.25 కోట్లు మంజూరు

మేదరమెట్ల, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : కొరిశపాడు మండలంలోని పలు గ్రామీణ రోడ్లకు మంత్రి గొట్టిపాటి రవికుమార్ నిధులు మంజూరు చేయించారు. మండలంలో పూర్తిగా తారు రోడ్డులేని ఏకైక గ్రామం ఎర్రబాలెం. ఎప్పుడో 90వ దశకంలో తిమ్మనపాలెం నుంచి 1కిలో మీటరు తారువేశారు. ఆతర్వాత నాలుగైదు సంవత్సరాలకే అది మట్టి రోడ్డు కన్నా దారుణంగా తయారైంది. గుంతలు పడి అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు గత వైసీపీ ఐదేళ్ల పాలనలో మరింత దయనీయంగా తయారైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొరిశపాడు మండలంలో తొలిసారి మారోడ్డుకే మంత్రి రవికుమార్ రూ.1.20 కోట్లు మంజూరు చేయించారని ఎర్రబాలెం ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలో పనులు ప్రారంభించనున్నారు. నిత్యం వందలాది వాహనాలు తిరిగే తమ్మవరం రోడ్డు అత్యంత దయనీయ స్థితికి చేరుకుంది. అప్పుడెప్పుడో ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజనలో నిర్మించిన రోడ్డు పూర్తి శిథిలావస్థకు చేరింది. పైపుల తయారీ ఫ్యాక్టరీ, గాలిమరలు వంటి భారీ పరికరాలను తయారు చేసే ఫ్యాక్టరీలు, కొత్తగా వచ్చిన ఇథనాల్ ఫ్యాక్టరీతోపాటు నిత్యం గ్రావెల్ తరలింపుతో రోడ్డు పూర్తిగా దెబ్బతింది. గ్రామస్థుల కోరిక మేరకు మేదరమెట్ల-తమ్మవరం రోడ్డుకు మంత్రి రవికుమార్ రూ.1.44 కోట్లు మంజూరు చేయించారు. ఇటీవల పనులకు భూమి పూజ జరిగింది.


మండలంలోని ఎస్సీ, బీసీ సామాజికవర్గాలు వేడుకలు జరుపుకోవడానికి, సమావేశం కావడానికి అనుగుణంగా కమ్యూనిటీ హాల్స్ నిర్మాణానికి మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.1.25కోట్లు మంజూరు చేయించారు. మేదరమెట్లలోని ఎస్సీ కాలనీకి రూ.25 లక్షలు, తిమ్మనపాలెంలో బీసీ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.30 లక్షల, రాచపూడిలో ఎస్సీ కమ్యూనిటీహాలు నిర్మాణానికి రూ.20లక్షలు, పమిడిపాడు ఎస్సీ కాలనీలో ఏర్పాటుకు రూ.30 లక్షలు, ప్రాసంగుపాడు ఎస్సీ కాలనీలో రూ.30 లక్షలు, రావినూతలలో రూ.20 లక్షలు మంజూరు చేయించారు. ఆయా కాలనీల వాసులు రవికుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. మేదరమెట్లలోని 374 ఎస్టీ కుటుంబాలకు శాశ్వత నివాస ధ్రువీకరణ పత్రాలను మంత్రి అందజేశారు.

చెంచులపై రవికిరణాలు

- విద్యుత్ వెలుగులకు ప్రత్యేక కార్యాచరణ
- 84 చెంచుగూడేలలో విద్యుదీకరణ పనులు
- మంత్రి గొట్టిపాటిపై మక్కువ పెంచుకున్న గిరిజనులు

త్రిపురాంతకం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : చెంచు గిరిజన గూడేలపై విద్యుత్ వెలుగులు విరజిమ్ముతున్నాయి. ఎక్కడివి ఈ వెలుగులు అని ఆ గిరిజన ప్రజలను అడిగితే ఇవి రవి కిరణాలు అనే సమాధానం వినిపిస్తోంది. ఎన్నో ఏళ్లుగా విద్యుత్ సమస్యలతో సతమతమవుతున్న గిరిజనులకు ఆశా కిరణంలా వచ్చిన విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పశ్చిమప్రాంతంలోని నల్లమల అడవిలో ఉన్న పలు గూడేలకు విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టేందుకు ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు వినతి మేరకు ఇట్టే నిధులు మంజూరు చేశారు. నల్లమలలోని మొత్తం 84 చెంచుగూడేలలో విద్యుత్ పునరుద్ధరణ పనులకు రూ.2కోట్ల 22లక్షల 83వేలు మంజూరు చేశారు. ఈ క్రమంలో ఎర్రగొండపాలెం నియోజకవర్గం పరిధిలో ఎర్రగొండపాలెం మండలంలోని 19 చెంచుగూడెంలు, పుల్లలచెరువు మండలంలో 15, దోర్నాల మండలంలో 33, పెద్దారవీడు మండలంలో 6, గిద్దలూరు నియోజకవర్గంలోని అర్ధవీడు మండలంలో 7, ముండ్లపాడులో 2 చెంచు గూడేలలో ఈ పనులు చేపట్టారు. నిధులు మంజూరుతోపాటు తక్షణమే పనులు కూడా చేపట్టి విద్యుత్ సమస్యలు లేని గిరిజన గూడేలుగా వాటిని తయారు చేయడంతో మంత్రి రవికుమార్‌పై చెంచు గిరిజనులు మక్కువ పెంచుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు అసలు విద్యుత్ సౌకర్యం లేని పుల్లలచెరువు మండలంలో 240 గృహాలు, ఎర్రగొండపాలెం మండలంలో 130, దోర్నాల మండలంలో 455 గృహాలకు విద్యుత్ సౌకర్యం కల్పించారు.


పనుల ప్రారంభానికి ముందు పూజలు చేస్తున్న మంత్రి రవికుమార్ (ఫైల్)


నల్లమలలోని చెంచు గిరిజన గూడెం (ఫైల్)

వీలులేనిచోట సోలార్ వెలుగులు

విద్యుత్ సౌకర్యం లేని, విద్యుత్ సౌకర్యం కల్పించటానికి వీలుపడని గూడేలకు సోలార్ ద్వారా వెలుగులు నింపేందుకు మంత్రి గొట్టిపాటి ప్రత్యేక కార్యాచరణ చేపట్టారు. పాలుట్ల, దద్దనాల, చిన్నారుట్ల, ఇష్టకామేశ్వరి వంటి ప్రాంతాల్లో మొత్తం 611 సోలార్ ప్యానెళ్లను 611 గృహాలపై ఏర్పాటు చేసి వారి ఇంట వెలుగులు నిండేలా నిధులు మంజూరు చేయించారు. ఇందు కోసం ఒక్కో గృహానికి రూ.50వేలు చొప్పున ప్రభుత్వం ఖర్చు చేయబోతోంది. ఈపనులు కూడా ప్రస్తుతం టెండర్లు పూర్తి చేసుకొని త్వరలో ప్రారంభం కాబోతున్నాయి. అడవి బిడ్డల కోసం ప్రత్యేక శ్రద్ధతో తమ గూడేలలో వెలుగులు నింపిన మంత్రి రవికుమార్‌పై చెంచులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

విద్యుత్ పునరుద్ధరణ పనులు

పాత ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవాటిని ఏర్పాటు చేశారు. ఎన్నో ఏళ్లుగా శిథిలావస్థలో ఉండి కూలేందుకు సిద్ధంగా ఉన్న 623 కరెంట్ స్తంభాలను తొలగించి కొత్తవాటిని పాతారు. పాత కాలపు విద్యుత్ తీగలు (కండక్టర్ వైరు) ఎప్పుడు తెగి పడతాయో అని భయపడే స్థితి నుంచి వాటిని తొలగించి కొత్త తీగలు ఏర్పాటు చేశారు. ప్రతి ఇంటికీ విద్యుత్ మీటరు ఏర్పాటు వంటి పనులు వెను వెంటనే చేపట్టి పూర్తి చేశారు. మంత్రిగా రవికుమార్ తమ గూడేలపై చూపిన ఆసక్తిని గిరిజనులంతా ముక్తకంఠంతో కొనియాడుతున్నారు. గతంలో మాటలు చెప్పి తమపై వివక్ష చూపడమే తప్ప ఇటువంటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపి పనులు చేసినవారెవరూలేరని వారంటున్నారు.

గ్రానైట్ పరిశ్రమకు ఊపిరి

- తగ్గిన అధికారుల దాడులు
- పెరిగిన ఉపాధి అవకాశాలు

బల్లికురవ, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో అధికారుల వరుస దాడులతో గ్రానైట్ పరిశ్రమల నిర్వాహకులు బెంబేలెత్తిపోయారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగా వీటిని చేపట్టడం అప్పట్లో విమర్శలకు తావిచ్చింది. అదేసమయంలో అస్తవ్యస్త విధానాలతో పరిశ్రమ ఒడిదొడుకులను ఎదుర్కొంది. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వాహకులు ఊపిరిపీల్చుకున్నారు. అధికారుల దాడులు తగ్గడంతో, ప్రభుత్వపరంగా తీసుకొన్ని కొన్ని నిర్ణయాలతో పరిశ్రమ గాడినపడింది. ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయి. బల్లికురవ మండలంలోని వీర్లకొండ వద్ద సుమారు 20 గ్రానైట్ క్వారీలు, మండల పరిధిలోని వేమవరం, మల్లాయపాలెం, బల్లికురవ, ఉప్పుమాగులూరు గ్రామాల పరిధిలో 125 గ్రానైట్ ఫ్యాక్టరీలు ఉన్నాయి. వీటి నిర్వహణ గత వైసీపీ పాలనలో ఎంతో భారంగా ఉండేది. తరచూ మైనింగ్, విజిలెన్స్ అధికారులు దాడులు చేసి పెద్దఎత్తున జరిమానాలు విధించారు. వీటితోపాటు వివిధ పన్నులతో వైసీపీ ప్రభుత్వంలో కొందరు పరిశ్రమలు నిర్వహించడం కష్టం అని చేతులెత్తేశారు. గతంలో గ్రానైట్ ఫ్యాక్టరీల యజమానులు విజిలెన్స్ అధికారుల దాడులను ఖండిస్తూ పెద్దఎత్తున ఆందోళనలు కూడా చేపట్టారు. ఎన్నికల సమయంలో అప్పటి చంద్రబాబును కలిసిన పరిశ్రమల వారు తనిఖీల నుంచి పరిశ్రమలను కాపాడాలని వినతిపత్రం అందజేశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే వారు అంతా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. ఆయన వాటిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో గత కొంత కాలం నుంచి గ్రానైట్ రంగంపై అధికారుల తనిఖీలు నిలిచిపోయాయి. సక్రమంగా రవాణా సాగుతుండంతో వ్యాపారులు సైతం సంతోషంగా ఉన్నారు. గతంలో మాదిరిగా మామూళ్ల బెడద తగ్గిందని వ్యాపారులు అంటున్నారు. ఈ ఏడాదిలోనే ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని వారు చెప్తున్నారు. మరికొన్ని సమస్యలు ఉంటే త్వరలో పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని వారు తెలిపారు. గతంలో కంటే ఫ్యాక్టరీల సంఖ్య గణనీయంగా పెరిగాయి, ఉత్పత్తి కూడా అధికంగా ఉంటున్నదని చెప్పారు.

బల్లికురవ వీర్లకొండ వద్ద ఉన్న గ్రానైట్ క్వారీ



అద్దంకిలో దివ్యాంగుడికి మూడు చక్రాల స్కూటర్‌ను అందజేస్తున్న విద్యుత్‌శాఖ మంత్రి రవికుమార్ (ఫైల్)

దివ్యాంగులకు ఆసరా

- రూ.1.11 కోట్లతో మూడు చక్రాల స్కూటర్‌లు, ఎలక్ట్రికల్ ట్రైసైకిళ్లు పంపిణీ

అద్దంకి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగులకు మంత్రి రవికుమార్ ఆసరాగా నిలిచారు. పారిశ్రామికవేత్తల సహకారంతో నియోజకవర్గంలో 110 మంది దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు, ఎలక్ట్రికల్ బ్యాటరీ చార్జింగ్ ట్రైసైకిళ్లను పంపిణీ చేశారు. వాటిని అందుకున్న దివ్యాంగులు తన దైనందిన కార్యక్రమాలకు ఉపయోగించుకుంటున్నారు. 50 మంది దివ్యాంగులకు రూ.21 లక్షల వ్యయంతో (ఒక్కొక్కటి రూ.42వేలు) ఎలక్ట్రికల్ బ్యాటరీ చార్జింగ్ ట్రై సైకిళ్లను మంత్రి అందజేశారు. మరో 60 మంది దివ్యాంగులకు రూ.90 లక్షల రూపాయలతో (ఒక్కొక్కటి రూ.1.50 లక్షలు) మూడు చక్రాల స్కూటర్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ఇంకా మిగిలిపోయిన దివ్యాంగులను గుర్తించి వారికి కూడా పంపిణీ చేసేందుకు మంత్రి రవికుమార్ సిద్ధమవుతున్నారు. దదీంతో దివ్యాంగుల కుటుంబాలు ఆనందం వ్యక్తం చేస్తున్నాయి.

తోపుడు బండితో అద్దె భారం తగ్గింది



తోపుడు బండి అద్దెకు తీసుకోవడం ద్వారా నెలకు రూ.3 వేల వరకు అద్దె చెల్లించాల్సి వచ్చేది. రోజు వారీ సంపాదనలో రూ.100 దానికే వెళ్లేది. మంత్రి రవికుమార్ ఇటీవల తోపుడు బండి ఇవ్వడంతో రోజు వారీ అద్దె చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది.

- షేక్ షకీల, చిరు వ్యాపారి, అద్దంకి

మూడు చక్రాల స్కూటీపైనే ఆఫీసుకు..



నేను అద్దంకిలోని పాత బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేటు కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాను. గతంలో ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్లేందుకు ఎంతో ఇబ్బంది పడేవాడిని. మంత్రి రవికుమార్ దివ్యాంగులకు మూడు చక్రాల స్కూటీలు ఇచ్చే సమయంలో నాకు కూడా ఇచ్చారు. ఇంటి నుంచి ఆఫీస్‌కు వెళ్లేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతోంది.

- ఘంటసాల రామకృష్ణ, దివ్యాంగ ప్రైవేటు ఉద్యోగి, అద్దంకి

విద్యుత్ సమస్య పరిష్కారమైంది..



అద్దంకి పట్టణంలోని నంబూరివారిపాలెంలో సుమారు 40 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభాలు, లైన్‌లు కావడంతో తరచూ సరఫరాలో అంతరాయం ఏర్పడేది. కరెంటు లైన్‌లు ఇళ్ల మీదుగా వెళ్లేవి. దీంతో భయంతో గడపాల్సి వచ్చేది. సమస్యను రవికుమార్ దృష్టికి తీసుకెళ్లడంతో కాలనీ మొత్తం పాత స్తంభాలను మార్చి కొత్తవి వేయించారు.

- గోవాడ శ్రీకాంత్, నంబూరివారిపాలెం,అద్దంకి

మైనారిటీల అభివృద్ధికి తోడ్పాటు



ప్రస్తుత ప్రభుత్వం మైనారిటీల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు అందిస్తోంది. విదేశీ విద్య, నైపుణ్యాభివృద్ధి పథకాలు ముస్లింలకు అందేలా చర్యలు చేపట్టింది. నియోజకవర్గంలో ముస్లింలు ఎక్కువగా ఉండే ఏల్చూరు, అలవలపాడు, వైదన, పంగులూరులలో షాదీఖానాల నిర్మాణం కోసం మంత్రి గొట్టిపాటి హామీ ఇచ్చి నిధుల మంజూరుకు చర్యలు చేపడుతున్నారు.

- షేక్ మస్తాన్‌వలి, మణికేశ్వరం, అద్దంకి మండలం

అంతర్గత రోడ్లు అభివృద్ధి చెందాయి



ప్రస్తుత ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే గ్రామాలలో ఉన్న అంతర్గత రోడ్లు పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందాయి. పదేళ్లుగా మోకాటి లోతు గోతులతో ఉన్న చెన్నుపల్లి - వైదన పంచాయతీ రాజ్ రోడ్డును రూ.3కోట్లతో నిర్మిస్తున్నారు. ఇది పూర్తయితే ప్రయాణ బాధలు తొలగిపోతాయి. గ్రామాలలో అంతర్గత రోడ్లన్నింటినీ సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు.

- అర్వపల్లి స్వామి, ముక్తేశ్వరం, బల్లికురవ మండలం

పింఛన్ సొమ్ము పెంచడం వలన ఎంతో మేలు



గత వైసీపీ ప్రభుత్వంలో మూడు వేలు ఉన్న పింఛన్ సొమ్మును కూటమి ప్రభుత్వం రాగానే నాలుగు వేలకు పెంచింది. ప్రతి నెలా ఒకటో తేదీనే పింఛన్ ఠంచన్‌గా ఇస్తున్నారు. పింఛన్ రూ.నాలుగు వేలు ఇవ్వడం వలన మా కుటుంబ జీవనం మెరుగుపడింది.

- అమర్తపూడి సుబ్బయ్య, బల్లికురవ

పంట కాలువలను అభివృద్ధి చేశారు



మా గ్రామంలో ఉన్న మేజర్, మైనర్ కాలువలను ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రాగానే పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. రైతులు పడుతున్న సాగునీటి ఇబ్బందులను గుర్తించి మంత్రి రవికుమార్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేయించారు. గత ప్రభుత్వం కాలువల గురించి పట్టించుకోలేదు. దీంతో ఐదేళ్లుగా అనేక ఇబ్బందులు పడ్డాం. ఈ ఏడాది పంట కాలువలను బాగు చేయడం వలన సాగునీటి ఇబ్బందులు ఉండవు.

- దద్దాల మోహన్‌రావు, అంబడిపూడి, బల్లికురవ మండలం

ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చి నేటికి సరిగ్గా ఏడాది అయ్యింది. ఈ ఏడాదిలో జిల్లా ప్రజలకు జరిగిన మేలేమిటి!? ఐదేళ్ల వైసీపీ పాలనతో పోల్చితే ప్రజలకు కొత్తగా ఒరిగిందేమిటి!? అనే కోణంలో పరిశీలిస్తే ఏడాది కాలం పూర్తి చేసుకున్న కూటమి ప్రభుత్వం జిల్లా ప్రజలకు ప్రశాంతతను ఇచ్చింది. రాజకీయ కక్షలు, కార్పణ్యాలు లేని పాలన అందించింది. మౌళిక వసతులకు పెద్ద పీట వేసింది. గుంతలమయమైన జిల్లా రహదారులకు వందల కోట్ల రూపాయలతో మరమ్మతులు చేసింది. డొక్కు బస్సుల స్థానంలో కొత్త బస్సులను తెచ్చింది. యువతకు ఉద్యోగ కొలువులు ఇప్పించింది. ఇచ్చిన మాట ప్రకారం అవ్వా తాత పింఛను మొత్తాన్ని రూ.4 వేలకు పెంచింది. నిర్వీర్యమైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ కార్పోరేషన్లకు జీవం పోసింది. మళ్లీ సబ్సిడీ రుణాల పంపిణీకి శ్రీకారం చుట్టింది. పారిశ్రామిక ప్రగతిని పరుగులెత్తించింది. ఇలా చెప్పుకుంటూ పోతే ఏడాది కూటమి పాలనలో జిల్లా అభివృద్ధిని పట్టాలెక్కించింది. గురువారం నాటికి కూటమి ప్రభుత్వ పాలన ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రత్యేక కథనం...

- ఆంధ్రజ్యోతి బృందం



ప్రగతి పరుగు.. ఏడాదిలో మెరుగు

కూటమి పాలనలో కూతపెడుతున్న అభివృద్ధి



యువతకు ఉద్యోగాలు

వైసీపీ పాలనలో ఒక్కసారి కూడా డీఎస్సీ నిర్వహించలేదు. కానీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే మెగా డీఎస్సీ నిర్వహించింది. జిల్లాలో 673 టీచర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇక వైసీపీ ప్రభుత్వం 2022లో పోలీసు కానిస్టేబుల్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023, జనవరి 22న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించింది. అప్పటి నుంచి ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన నెలల వ్యవధిలోనే ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ ఏడాది, జనవరి నెల 30 నుంచి పోలీసు పెరేడ్ మైదానంలో ఫిజికల్ టెస్ట్‌లు నిర్వహించారు. ఉత్తీర్ణులైన వారికి మెయిన్ పరీక్షను పూర్తి చేసి ఫలితాలను విడుదల చేసింది. త్వరలోనే ఎంపికైన కానిస్టేబుళ్లు ఉద్యోగాల్లో చేరనున్నారు.







వైసీపీ హయాంలో కావలి-తుమ్మలపెంట రోడ్డుపై ప్రయాణమంటే వాహనదారులు హడలిపోయేవారు. ప్రతిరోజూ ఏదో ఒకచోట ప్రమాదాలు జరగడం, వాహనదారులు ఆసుపత్రిపాలుకావడం జరిగేది. అయితే, కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.14.76 కోట్లతో రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. త్వరలోనే ఈ పనులు ముగింపు దశకు చేరుకోనున్నాయి.

ఆర్టీసీకి కొత్త కళ

వైసీపీ హయాంలో కొత్త బస్సులు కావాలని అధికారులు పదేపదే ఇండెంట్లు పెడితే ఐదేళ్లలో రెండు బస్సులను జిల్లాకు పంపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నెల్లూరు రీజియన్‌కు 133 కొత్త బస్సులు వచ్చాయి. ఆత్మకూరు డిపోకు 9 బస్సులు, కందుకూరుకు 25, కావలికి 12, నెల్లూరు-1వ డిపోకు 31, నెల్లూరు-2వ డిపోకు 19, రాపూరుకు 7, ఉదయగిరికి 30 బస్సులు వచ్చాయి.



- జిల్లాలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని హాస్టళ్ల భవనాలకు మరమ్మతులు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం రూ.9.32 కోట్లు మంజూరు చేసింది. ఇక 79 బీసీ సంక్షేమ హాస్టళ్లలో 32 హాస్టళ్లకు ప్రభుత్వం రూ.72 లక్షలు కేటాయించింది.

బాగుపడిన రోడ్లు

ఐదేళ్లపాటు కనీస నిర్వహణ లేక ఏర్పడిన గోతులకు తట్టెడు మన్నువేసే దిక్కులేక దారుణంగా ఉన్న రోడ్ల కోసం వంద కోట్లకుపైగా ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.40 కోట్లతో ఆర్అండ్‌బీ రోడ్లు బాగుపడగా, 84 కోట్లతో ఎన్‌డీబీ రోడ్ల పనులను చేపట్టింది. 34 కోట్లతో పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతులు చేస్తోంది. పంచాయతీరాజ్ పరిధిలో కొత్త రోడ్ల కోసం 60 కోట్లు మంజూరు చేసింది.

వ్యవసాయ యాంత్రీకరణ

కూటమి ప్రభుత్వం రైతులకు వ్యక్తిగతంగా ఇచ్చే విధానాన్ని ప్రారంభించింది. ఈ ఏడాది 1452 యంత్ర పరికరాలను 50 శాతం సబ్సిడీ కింద రైతులకు అందజేసింది. పరికరాలు ఎంపిక చేసుకొని కొనుగోలు చేసుకునే అవకాశం రైతులకు కల్పించింది. 50 శాతం సబ్సిడీ మొత్తాన్ని రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేసింది. పెట్టుబడి సాయం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న రూ.12వేల అన్నదాత సుఖీభవ మొత్తాన్ని కూటమి ప్రభుత్వం రూ.20 వేలకు పెంచింది. ఇందులో కేంద్రం వాటా 6వేలు కాగా 14వేల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తుంది. ఈ నెలలో ఈ మొత్తం రైతుల ఖాతాలో జమకానుంది.

- ఈ నెలలోనే అమ్మఒడి పథకం కింద ఇంట్లో ఎంత మంది పిల్లలు ఉంటే అంతమందికి రూ.15వేలు చొప్పున తల్లుల బ్యాంకు ఖాతాలో జమ కాబోతుంది. రైతు భరోసా పథకం మొత్తాన్ని 20వేలుకు పెంచింది. ఆ మొత్తం ఈ నెలలోనే పడనుంది.
- డిజిటల్ లక్ష్మి (డిజి లక్ష్మి) పథకం ద్వారా ప్రభుత్వం పొదుపు మహిళ చేత కామన్ సర్వీస్ సెంటర్లను ఏర్పాటు చేయిస్తోంది. ఈ సెంటర్ల ద్వారా రూ.30-40 లక్షల ఆదాయం పొదుపు మహిళకు వస్తుంది. డిగ్రీ చదివిన పొదుపు సంఘానికి చెందిన మహిళను ఈ డిజీ లక్ష్మి పథకానికి ఎంపిక చేశారు.

కడుపు నిండుతోందయ్యా!



ఐదు రూపాయలకు ఏం వస్తుందో చెప్పండయ్యా. ఇదిగో ఇక్కడ మాత్రం కడుపు నిండా భోజనం దొరుకుతోంది. మాలాంటి పేదలకు ఇంత కన్నా ఇంకేం కావాలి. ఉదయం టిఫిన్, రెండు పూటలా భోజనం దొరుకుతోంది. హోటల్లో భోజనం చేయలని వారికి అన్నా క్యాంటీన్ ఓ వరం.

- పైడి బాలయ్య, వైకుంఠపురం, కావలి

వైద్య ఖర్చులకు ఊతం



కొన్నేళ్లుగా నేను కిడ్నీల సమస్యతో బాధ పడుతున్నాను. వారానికి మూడు సార్లు డయాలసిస్ చేయించుకోవాలి. నా వైద్య ఖర్చుల కోసం అప్పులు చేయాల్సి వస్తుంది. ప్రభుత్వం రూ.10 వేలు ఇస్తుండటంతో వైద్యఖర్చులకు ఎంతో ఉపయోగపడుతోంది.

- చెవుల లక్ష్మి, ఉదయగిరి

- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్య, మత్స్యకార, కల్లుగీత కార్మిక, ఒంటరి మహిళలు, చర్మకారులు, డప్పు కళాకారులు, హెచ్‌ఐవీ బాధితులకు ఇస్తున్న పెన్షన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి 4వేలకు పెంచింది. దివ్యాంగుల పెన్షన్‌ను రు.3వేల నుంచి రూ.6వేలకు పెంచింది. జిల్లాలో 3,05,804 మంది సామాజిక పెన్షనర్లు ఉండగా ప్రతి నెలా వీరికి రు.132.37 కోట్లు అందిస్తున్నారు. ప్రతినెలా ఒకటో తేదీనే 99 శాతం మందికి పెన్షన్ అందుతోంది.
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.51.81 కోట్లతో 1240 మంది లబ్ధిదారులకు పలు యూనిట్ల మంజూరుకు దరఖాస్తులు స్వీకరించారు. ఇందులో రూ.20.46 కోట్లు సబ్సిడీ, రూ.28.75 కోట్లు బ్యాంకు రుణాలు, రు.2.59 కోట్లు లబ్ధిదారుల వాటాగా నిర్ణయించారు. త్వరలో లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు కానున్నాయి.
- బీసీ కార్పొరేషన్ ద్వారా బీసీలకు 1328 యూనిట్లు, ఈడబ్ల్యుఎస్‌కు 410 యూనిట్లు, మేదర, కుమ్మరులకు 100 యూనిట్లు, కాపులకు 231 యూనిట్లు, జనరిక్ మందుల షాపులు 96 యూనిట్లు జిల్లాకు కేటాయించారు. అలాగే, బీసీ కార్పొరేషన్ ద్వారా 26 ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాలను ఏర్పాటు చేయగా, ఒక్కో కేంద్రంలో 72 మంది మహిళలకు శిక్షణ ఇస్తున్నారు.
- మైనార్టీ కార్పొరేషన్ ద్వారా 1449 మంది లబ్ధిదారులకు రూ.11.15 కోట్ల సబ్సిడీతో రూ.22.31 కోట్ల రుణలక్ష్యాన్ని ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించింది. యూనిట్ విలువ రూ.1లక్ష నుంచి 8లక్షల వరకు ఈ స్వయం ఉపాధి రుణాలు మంజూరు చేయనున్నారు.
- వర్క్‌ఫ్రం హోం సర్వే పేరుతో జిల్లాలో 18 నుంచి 50 ఏళ్లలోపు వయసున్న 7.48లక్షల మంది ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వీరిలో ఇంటి వద్దనే పని చేస్తున్న వారు 14,182 మంది ఉన్నారు. 2,18,898 మంది వివిధ రకాల పనుల్లో ఉన్నారు. జిల్లాలో 5,95,817 కుటుంబాలు ఉండగా, 25.67 లక్షల జనాబా ఉంది.
- పేద మహిళలకు చేయూత ఇస్తూ మెప్మా ఆధ్వర్యంలో తృప్తి క్యాంటీన్లను రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా నెల్లూరులోని ఆత్మకూరు బస్టాండ్ వద్ద క్యాంటీన్‌ను ఏర్పాటు చేశారు.

వేగంగా పారిశ్రామిక అడుగులు

- రామాయపట్నం పోర్టు అనుసంధానంగా అంతర్జాతీయ సంస్థలైన బీపీసీఎల్ దాదాపు రూ.90వేల కోట్లతో ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకుంది. అదేవిధంగా రూ.43వేల కోట్ల పెట్టుబడులతో ఇండోసోల్ (సోలార్ ప్యానల్స్ తయారీ) కంపెనీ ఏర్పాటుకు ముందుకొచ్చారు. వీటితోపాటు జాన్సన్ ఇన్‌ఫ్రా,ఉత్కర్ష లిమిటెడ్, శ్రీచక్ర లిమిటెడ్, హెచ్‌పీసీఎల్, జేఎస్‌డబ్ల్యూ వంటి అనేక అంతర్జాతీయ పరిశ్రమలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ఇప్పటికే ఒప్పందాలు చేసుకున్నాయి అదేవిధంగా మనుబోలు ప్రాంతంలో విశ్వసముద్ర, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ, ఎస్ఆర్‌సీ యుకోటెక్స్ లిమిటెడ్ కంపెనీల నిర్మాణ పనులు చివరి దశకు చేరుకొన్నాయి.
- ప్రతి నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ ఏర్పాటులో భాగంగా ఇప్పటికే భూసేకరణ పూర్తిచేశారు. ప్రతి పార్క్ 50 నుంచి 100 ఎకరాల్లో ఉండేలా చర్యలు చేపట్టారు. నెల్లూరు నగరంలో మాత్రం 2.4 ఎకరాల్లో ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ (ఎఫ్‌ఎఫ్‌సీ) నిర్మించేందుకు ప్రభుత్వం రూ.12కోట్లు విడుదల చేసింది.
- ఇఫ్కో కిసాన్‌సెజ్‌లో దాదాపు 2700 ఎకరాల భూ సమస్యలు, కోర్టు కేసులతో 1997 నుంచి నిలిచిపోయి ఉన్నది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరించింది. దీంతో ఈ సెజ్‌లో పరిశ్రమల ఏర్పాటుకు 12 అంతర్జాతీయ స్థాయి సంస్థలు ఆసక్తి చూపుతున్నట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా ఆమంచర్లలో అటవీ శాఖ అడ్డంకులు తొలగడంతో తొలుత 100 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్క్‌కు భూమిని కేటాయించారు. క్రిష్ణపట్నంపోర్టు సమీపంలోని 1500 ఎకరాల రిలయన్స్ భూముల సమస్య పరిష్కరించడంతో ఇక్కడ సోలార్ ప్యానళ్ల తయారీ పరిశ్రమను పెట్టనున్నట్లు అనిల్ అంబానీ ప్రకటించారు.
- కాకుటూరు ప్రాంతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రెడీమేడ్ గార్మెంట్స్ క్లస్టర్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే రూ.10కోట్లు మంజూరయ్యాయి. అలాగే ప్రింటింగ్ క్లస్టర్‌ను జిల్లాలో ఏర్పాటు చేసేందుకు జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు.
- రాష్ట్రంలో ఎక్కడైన పరిశ్రమ స్థాపించాలనే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలతోపాటు అంతర్జాతీయంగా పారిశ్రామికవేత్తలను సైతం ఆకట్టుకొనేలా ఇండస్ట్రీయల్ ప్రాక్స్ పాలసీ 4.0ని రూపొందించారు. ఇందులో ప్రైవేటు భూమి కొనుగోలు చేసిన వారికి ఎకరాకు రూ.3లక్షల సబ్సిడీ ఇస్తారు. అలాగే అనేక చార్జీల్లో 100 శాతం రాయితీలు, భూమి కొనుగోలు చేసిన వెంటనే పారిశ్రామికవేత్త పేరుతో సేల్‌డీడ్ చేయడం లాంటి విధానాలు అమలులోకి వచ్చాయి.



ఆత్మకూరు : నారంపేట ఎంఎస్ఎంఈ పార్కను ప్రారంభిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు.(ఫైల్)



ఏరువాక పౌర్ణమి కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారి సత్యవాణి, రైతులు, టీడీపీ నాయకులు

ఏరువాక సాగించారు !

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని రావులుకొల్లు గ్రామంలో ఏరువాక పౌర్ణమిని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయశాఖాధికారిణి పీ. సత్యవాణి ముందుగా రైతులకు అధిక దిగుబడులు రావాలని ఆకాంక్షిస్తూ ఎడ్లతో పొలాన్ని దున్ని ఏరువాక సాగించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా ఏరువాక పౌర్ణమిని జరుపుకోవడం రైతులకు ఆనవాయితీగా వస్తున్నదని, ఈ సందర్భంగా ఎడ్లను, అరకలను పూజించి నాగలికట్టి భూమిని దున్నుతుంటారని తెలిపారు. వర్షరుతువు ఆరంభంలో వచ్చే ఏరువాక పౌర్ణమి రోజున రైతులు దుక్కులు దున్ని పంటలు పండిస్తే దిగుబడులు పెరుగుతాయన్నారు. ప్రస్తుత సీజన్‌లో వ్యవసాయశాఖ పచ్చిరొట్ట విత్తనాలు, పీఎండీఎస్ కిట్లు, భూసార పరీక్షలు ఆధారంగా జింకు, జిప్సంను రాయితీతో అందచేస్తున్నదని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ కేతా విజయభాస్కర్‌రెడ్డి, ఆత్మకూరు టీడీపీ పట్టణ, రూరల్ అధ్యక్షులు తుమ్మల చంద్రారెడ్డి, సుంకర పెంచలచౌదరి, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెన్నాలో ఇసుక తవ్వకాలపై మైనింగ్ శాఖ దాడులు

- పలు ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా గుంతలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జూన్ 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా పెన్నానదిలో ఇసుక తవ్వకాలపై మైనింగ్ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. జాతీయ గ్రీన్ ట్రిబునల్ ఆదేశాల మేరకు ఈ నెల 1 నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు నదుల్లో ఇసుక తవ్వకాలు నిషేధం. అయితే, జిల్లాలోని పెన్నానదిలో విచ్చలవిడిగా ఇసుక తవ్వకాలు జరుపుతున్నట్టు ఈ నెల 9వ తేదీన ఆంధ్రజ్యోతిలో 'డోంట్‌కేర్' శీర్షికతో ఓ కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన రెవెన్యూ, మైనింగ్ అధికారులు జిల్లావ్యాప్తంగా దాడులు చేశారు. నదుల్లోకి ప్రవేశించే ప్రాంతాల్లో వాహనాలు వెళ్లకుండా మైనింగ్ ఆర్ఐ స్వాతి ఆధ్వర్యంలో అధికారుల బృందం గుంతలు తీయించారు. 8 స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక లభ్యమవు తుందని, అక్కడ నుంచే ఇసుక తరలించేందుకు అనుమతి ఉందని నెల్లూరు ఆర్డీవో అనూష తెలిపారు. అలాకాకుండా పెన్నానదిలోకి ప్రవేశించి ఇసుక తరలించేందుకు యత్నిస్తే క్రిమినల్ చర్యలతో పాటు వాహనాలు సీజ్ చేస్తామని హెచ్చరించారు.

జిల్లాలో ఇసుక అందుబాటులో ఉన్న స్టాక్ పాయింట్లు

ఇసుక నిల్వ కేంద్రం	మండలం	టన్ను ధర (రూ.లలో)	ఫోన్ నెం.
పోతిరెడ్డిపాళెం	కోవూరు	250	9533111199
సంగం	సంగం	250	9866722126
సూరాయపాళెం-1	పొదలకూరు	250	7997997109
సూరాయపాళెం-2	పొదలకూరు	250	9440492441
భీమవరం	ఉలవపాడు	184	9494427678
పల్లెపాడు	ఇందుకూరుపేట	82	9000233585
మినగల్లు	బుచ్చి	93	9000233585
విరువూరు	పొదలకూరు	93	7997997109

జిల్లాలో మరో రెండు కరోనా కేసులు

నెల్లూరు (వైద్యం) (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బుధవారం మరో రెండు కరోనా కేసులు నమోదయ్యాయి. నగరానికి చెందిన ఇద్దరు యువతులు కరోనా బారినపడినట్లు వైద్య పరీక్షల్లో నిర్ధారణ అయ్యింది. దీంతో జిల్లాలో మొత్తం కొవిడ్ కేసుల సంఖ్య 11కు చేరింది. వీటిలో అత్యధికంగా నెల్లూరు నగరంలోనే 7 కేసులు ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో కొవిడ్ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

మాలకొండ ఆలయ డీసీగా చంద్రశేఖర్

వలేటివారిపాలెం (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయ డిప్యూటీ కమిషనర్‌గా ఎస్.చంద్రశేఖర్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. అన్నవరం దేవస్థానం డీసీగా ఉన్న ఆయన బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడున్న కేవీ.సాగర్‌బాబు చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయ డీసీగా బదిలీపై వెళ్లారు.

గరుడుడిపై వేదగిరీశుడు

- పౌర్ణమి గిరి ప్రదక్షిణ



జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా వేదగిరి క్షేత్రంలో లక్ష్మీ నరసింహస్వామి బుధ వారం చిన్న గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. ముందుగా ఉత్సవ మూర్తులకు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం దేవేరులు, స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడ వాహనంపై కొలువుదీర్చి గిరిప్రదక్షిణ ఉత్సవం నిర్వహించారు.

- నెల్లూరురూరల్ (ఆంధ్రజ్యోతి)


వైభవంగా రంగడి వసంతోత్సవం



నెల్లూరు (సాంస్కృతికం) : నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో బుధవారం సాయంత్రం శ్రీవారి వసంతోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథస్వామికి నవకలశ స్నపన తిరుమంజనం నేత్రపర్వంగా జరిగింది. అనంతరం విశేష అలంకరణ, దివ్య ప్రబంధ ఘోష్టి, ఆస్థాన సేవ, శాత్తుమొరై జరిగాయి. ఉభయకర్తలుగా దేవీ సుబ్రహ్మణ్యం కుటుంబం వ్యవహరించింది. ఆలయ ఈవో శ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

ఆటలకు టాటా... ఇక బడి బాట!

- నేడు పాఠశాలల పునఃప్రారంభం



49 రోజుల విరామం తర్వాత బడి తలుపులు గురువారం తెరుచుకోనున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో పిల్లలు స్కూళ్ల బాట పట్టనున్నారు. నిశ్శబ్దం ఆవహించిన పాఠశాలలు ప్రార్థనా గీతాలతో సందడిగా మారనున్నాయి. అయితే, ఎప్పటిలాగే స్కూళ్లలో సమస్యలు తిష్ఠ వేసి ఉన్నాయి. పాఠశాల విద్యారంగంలో అనేక మార్పులను చేపడుతున్నా మౌళిక సదుపాయాల కల్పనలో లోటు కనిపిస్తూనే ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాడు-నేడు పనులతో అందంగా తీర్చిదిద్దుతున్నామని, నాణ్యమైన విద్యావిధానం అందచేస్తామని ప్రకటనలు చేస్తున్నా బడులు తెరిచే నాటికి ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయి. గడిచిన విద్యా సంవత్సరంలో అక్కడక్కడ అరకొర పనులు మినహా పూర్తిస్థాయి పనులేమీ జరగకపోడంతో అసంపూర్తి భవనాలే దర్శమిస్తున్నాయి.

- వివరాలు 8లో..

నేడు జడ్పీ స్టాండింగ్ కమిటీ సమావేశం

నెల్లూరు (జడ్పీ), (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిషత్ స్టాండింగ్ కమిటీ సమావేశాలు జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన గురువారం జరగనున్నాయి. జడ్పీ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి ఏడు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నారు. ప్రణాళిక, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్యా, వైద్యం, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమాలకు సంబంధించిన ఈ సమావేశాలు సాయంత్రం వరకు జరగనున్నాయి. స్టాండింగ్ కమిటీ సభ్యులు, అధికారు లు హాజరుకావాలని జడ్పీ పరిపాలనాధికారి కొండయ్య ఒక ప్రకటనలో కోరారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	228
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 550

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9291
వెండి కిలో ధర	రూ. 108400
వెండి ఒక గ్రాము	రూ.111.40

యోగాతో మెరుగైన ఆరోగ్యం

కొండాపురం, జూన్ 11(ఆంధ్రజ్యోతి): యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని భీమవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ అన్నారు. యోగా కార్యక్రమంపై బుధవారం గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. గ్రామస్థులతో యోగాసనాలు వేయించి ప్రతి ఒక్కరూ తమ దైనందిన కార్యక్రమాలలో యోగాను ఒక భాగంగా రూపొందించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లపల్లి సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంటు మధు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● రూ.1.50 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలిరూరల్, జూన్11(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అన్నగారిపాలెం పంచాయతీ వెంకటేశ్వరపురంలో రూ.90 లక్షలతో నిర్మించిన రెండు సీసీ రోడ్లు, రూ.60 లక్షలతో ఏర్పాటు చేసిన త్రీఫేస్ ట్రాన్స్‌ఫార్మర్లను బుధవారం సాయంత్రం ఆర్డీవో సన్నీ వంశీకృష్ణతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వరపురం ఆనుకుని ఉన్న చిప్పలేరు పొంగినప్పుడు గ్రామంలో కొంతభాగం కోతకు గురవుతుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల పాపాలే గ్రామస్థుల పాలిట శాపాలై తాగునీటి సమస్య తలెత్తిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శ్రావణ్‌కుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీదేవి, ఈఈలు వేణుగోపాల్, లోక్‌నాథ్, విద్యుత్ శాఖ డీఈ బెనర్జీ, ఏఈలు సుబ్రహ్మణ్యం, రహమాన్, శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సబ్బులు, నూనె, చెప్పుల పంపిణీ

కావలి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలక సంఘం ప్రజా ఆరోగ్య విభాగంలో అవుట్‌సోర్స్ కార్మికులకు మున్సిపల్ కార్యాలయంలో బుధవారం సబ్బులు, నూనె, చెప్పులు పంపిణీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజరు ఫణికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్, రెవెన్యూ ఆఫీసరు అలీమ్, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సీఐ ఫిరోజ్‌కు సత్కారం

కావలిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : గుండెపోటుకు గురై రోడ్డుపై అపస్మారక స్థితిలో పడి ఉన్న దగ్గర ఇందిరమ్మ కాలనీ వాసి, హోటర్ కార్మికుడిని ఆ మార్గంలో వెళుతూ గుర్తించిన 1వ పట్టణ సీఐ ఫిరోజ్ సీపీఆర్ చికిత్స అందించి ప్రాణం పోశారు. దీంతో ఆయనను స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల వేదిక గౌరవాధ్యక్షుడు ఖాదర్‌బాషా, ఎస్‌ఐ జమాల్‌వలి, ప్రతినిధులు ప్రసాదరావు, దిలీప్, గనీ, అలీం, జమీర్, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు బాధ్యతల స్వీకరణ

వలేటివారిపాలెం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మండల తహసీల్దారుగా నయీం అహ్మద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన సెలవులో ఉండగా ప్రభుత్వ వలేటివారిపాలెంకు నియమించింది. ప్రస్తుతం ఉన్న తహసీల్దారు శ్రీనివాసులు కొండపికి బదిలీ అయ్యారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలోని అజ్మల్ నర్సింగ్‌హోం, ప్రగతి నర్సింగ్‌హోం, న్యూ లైఫ్ ఆసుపత్రిలలో బుధవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు రజని ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆమె వెంట సామాజిక ఆరోగ్య అధికారి శ్రీనివాసులు ఉన్నారు.

తైక్వాండో విజేతలకు పురస్కారాలు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఒడిశా రాష్ట్రంలోని కటక్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించిన కందుకూరుకు చెందిన క్రీడాకారులకు శ్రీరామసాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. బంగారు పతకాలు సాధించిన బి.లక్ష్మీఅక్షర, సి.లక్ష్మీప్రియ, ఏ.మన్విత్‌రాజ్, జి.త్రినాథ్‌లతో పాటు రజిత పతకాలు సాధించిన జి.ఉత్తంప్రేమ్‌సాత్విక్, పి.సాయిశ్రీవాత్సవ్, కాంశ్య పతకం సాధించిన సి. మోహిత్ కేసరినందన్‌లను వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్షుడు రవ్వా శ్రీనివాసులుతో పాటు క్రీడాకారులను తీర్చిదిద్దిన మాస్టర్ అబ్దుల్ సలాం, అఖిల్‌లను అభినందించారు. కార్యక్రమంలో చక్కా వెంకటకేశవరావు, జయవరపు కిషోర్, బీవీఎస్ ప్రసాద్, బీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

నూతన సాంకేతికతతో అధిక లాభాలు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): వ్యవసాయంలో నూతన సాంకేతికతను ఉపయోగించుకుంటేనే లాభాలు దక్కుతాయని కందుకూరు-2 పొగాకు వేలం కేంద్రం అధికారి రాజగోపాలరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కోవూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఐసీఏఆర్, కేవీకే ఆధ్వర్యంలో రైతులకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రాజగోపాలరెడ్డి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా 1.5 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరుతుందని, గ్రామాలకు శాస్త్రవేత్తలు వెళ్లి సాంకేతికత వల్ల ప్రయోజనాలు, పెట్టుబడి వ్యయం తగ్గించుకునే మార్గాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్ శాస్త్రవేత్త గంగాధర్, పౌల్ట్రీ శాస్త్రవేత్త రాజారవీంద్ర, పాల్గొన్నారు.

పేదలకు కళ్లాద్దాల పంపిణీ



కళ్లాద్దాలు అందచేస్తున్న సుధాకర్‌నాయుడు

దగదర్తి(బిట్రగుంట), జూన్ 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు చెందిన పేదలకు కంటి పరీక్షల అనంతరం బుధవారం కళ్ల అద్దాలు పంపిణీ చేశారు. దగదర్తిలోని మాలేపాటి సోదరుల ఇంటి ఆవరణలో మాలేపాటి రవీంద్ర నాయుడు కుమారుడు, టీడీపీ యువ నేత భానుచందర్‌నాయుడు పుట్టిన రోజు సందర్భంగా మాలేపాటి రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాలేపాటి అభిమానులు కంచర్ల కృష్ణ, ఒట్టిగుంట గోపాలు, పేపల్ల సూరిబాబు, ముప్పాళ్ల వెంకటేశ్వర్లు వద్దినేని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో ఖాళీ సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

లింగసముద్రం, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్‌లో 6 నుంచి 9వ తరగతి వరకు, జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్‌లలో ఖాళీగా ఉన్న సీట్లకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. ఖాళీ సీట్ల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చినందున ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

వసతి గృహంలో ప్రవేశానికి...

మోడల్ స్కూల్‌కు 5 కి.మీ దూరంలో ఉన్న 9వ తరగతి, జూనియర్, సీనియర్ ఇంటర్మీడియట్ విద్యార్థిను మోడల్ స్కూల్ ఆవరణలోని వసతి గృహంలో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. మోడల్ స్కూల్ ఆవరణలో నిర్మించిన బాలికల వసతి గృహంలో మొత్తం 40 సీట్లు ఉన్నాయని పేర్కొన్నారు. దూర ప్రాంతాల విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

చుండి మోడల్‌స్కూల్ వసతిగృహంలో...

వలేటివారిపాలెం : మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లోని బాలికల వసతి గృహంలో ప్రవేశానికి దూరప్రాంతాలకు చెందిన 9, 10, 11, 12వ తరగతుల బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్స్‌పాల్ శ్రీవెంకటేశ్వర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వసతి గృహంలో మొత్తం 50 సీట్లు మాత్రమే ఉన్నాయని, రిజర్వేషన్ల ప్రకారం సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు.

అట్టహాసంగా ఏరువాక పౌర్ణమి



విత్తనాలు చల్లుతున్న పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు

కలిగిరి, జూన్ 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దపాడులో బుధవారం ఏరువాక పౌర్ణమి స్థానిక పొగాకుబోర్డు అధికారుల ఆధ్వర్యంలో రైతులు ఘనంగా నిర్వహించారు. వ్యవసాయ సీజన్ ప్రారంభానికి గుర్తుగా రైతులు జరుపుకునే ఏరువాక పౌర్ణమి పండుగ ఈ ఏడాది సమృద్ధిగా వర్షాలు కురవడంతోపాటు పాడి పంటలతో అన్నదాత కుటుంబాలు సస్యశ్యామలంగా అండాలని బోర్డు అధికారులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పొగాకు బోర్డు ద్వారా ఐదుగురు రైతులకు నవధాన్యాలు అందజేసి వాటిని స్థానిక రైతులతో కలిసి పొలాల్లో చల్లారు. ఈ కార్యక్రమంలో పొగాకుబోర్డు సూపరింటెండెంట్ నివేష్‌కుమార్ పాండే, ఫీల్డ్ ఆఫీసర్ సంతోష్‌కుమార్, బోర్డు సిబ్బంది, రైతు నాయకుడు రావూరి శ్రీకాంత్‌బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉమామహేశ్వరరావుకు లోకం పోకడ రామచంద్రరావు స్మారక అవార్డు

కావలిటౌన్, జూన్ 11(ఆంధ్రజ్యోతి) : లోకం పోకడ పత్రిక సంపాదకులు రామచంద్రుని రామచంద్రారావు స్మారక ఉత్తమ జర్నలిస్ట్ అవార్డును హైద్రాబాద్ రచన కళాశాల ప్రిన్సిపాల్, కావలి వాసి రేవూరి ఉమామహేశ్వరరావుకు అందజేశారు. సీనియర్ జర్నలిస్ట్ సిద్ధి జయప్రతాప్ రెడ్డి అధ్యక్షతన బుధవారం ప్రభాకర్‌నాయుడు ఆసుపత్రిలోని సమావేశ మందిరంలో జరిగిన సభలో ముఖ్యఅతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ ప్రభాకర్ నాయుడు పాల్గొని మాట్లాడుతూ రామచంద్రుని పేరిట కుటుంబ సభ్యులు ప్రతి ఏటా ఉత్తమ జర్నలిస్ట్ నగదు అవార్డు అందించడం మంచి సాంప్రదాయమని అభినందించారు. ఈ కార్యక్రమంలో రామచంద్రరావు సోదరుడు పట్టాభిరామారావు, కళారత్న హంస అవార్డు గ్రహీత, మెజీషియన్ మాధవరావు, సీనియర్ జర్నలిస్ట్‌లు మస్తాన్, నున్నా మురళి, విశ్రాంత బ్యాంక్ మేనేజర్ చంద్రశేఖర్, విశ్రాంత ఎంపీడీవో కళాధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సిమెంటురోడ్డును ప్రారంభించిన సబ్ కలెక్టరు

కందుకూరు, జూన్ 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సాయినగర్‌లో రూ.18 లక్షలతో నూతనంగా నిర్మించిన సిమెంటురోడ్డు, డ్రైన్‌లను సబ్ కలెక్టరు తిరుమణి శ్రీపూజ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

బిట్రగుంట, జూన్ 11(ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో స్థల వివాదంలో పరస్పర దాడులకు దిగిన ఇరువర్గాల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ భోజ్యా తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు.. నాటకరాణి బాబు ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో కంపచెట్లు దట్టంగా పెరగడంతో నాటకరాణి ధనుంజయ్య 4 రోజుల క్రితం ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అయితే తన ఆధీనంలో ఉన్న స్థలంలో కంపచెట్లు ఎలా తొలగిస్తావని బాబు అడగటంతో మాటామాటా పెరిగి పరస్పర దాడులకు దిగారు. నాటకరాణి వెంకటరమణ, వెంకటరాయుడు, కృష్ణ, మరో ఐదుమంది దాడి చేశారని నాటకరాణి సునీత ఫిర్యాదు చేయగా నాటకరాణి సురేంద్ర, దుర్గయ్య, మరో ఐదుమంది దాడి చేసినట్లు నాటకరాణి బాబు ఫిర్యాదు చేశారు. వీటిపై కావలి రూరల్ సీఐ బీ.పాపారావు విచారణ చేపట్టి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామంలో వివాదాలు జరగకుండా పోలీసు పికెటింగ్ ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

భవిష్యత్ తరాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలి

● రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాల అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర దేవదాయ శాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో స్వర్ణాంధ్ర 2047 ఆత్మకూరు నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్‌పై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విజన్ ప్లాన్‌తో ఆత్మకూరు నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి చేపట్టాల్సిన ప్రణాళికలపై దిశానిర్దేశం చేశారు. ముందుగా రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, ఆర్‌అండ్‌బి, ఆర్‌డబ్ల్యుఎస్, ఇరిగేషన్, విద్యుత్, సాంఘీక సంక్షేమ శాఖల అధికారులు రానున్న ఐదేళ్లలో ఆత్మకూరు నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టనున్న స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలను మంత్రి ఆనంకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించడం, పరిశ్రమల స్థాపనతో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన, పి-4 వంటి పది సూత్రాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడమే స్వర్ణాంధ్ర 2047 విజన్ యాక్షన్ ప్లాన్ లక్ష్యమని అన్నారు. ఈనెల 12 నుంచి తల్లికి వందనం పథకాన్ని ప్రారంభిస్తామని, అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20వేలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఆర్డీవో బి పావని, మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్, డీఎస్పీ రాజగోపాల్, సోమశిల ప్రాజెక్టు చైర్మన్ కేశవ చౌదరి, చీఫ్ ప్లానింగ్ అధికారి రఘురామయ్య, ఆర్‌అండ్‌బి, పిఆర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్‌ఈలు గంగాధర్ అశోక్‌కుమార్, వెంకటరమణ, పలువురు ఇంజనీరింగ్ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పలుశాఖల అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

సోమశిలలో 39.448 టీఎంసీల నీరు

అనంతసాగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నీటినిల్వ సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా బుధవారం నాటికి 39.448 టీఎంసీలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇన్‌ఫ్లో 120 క్యూసెక్కులు వస్తుండగా పెన్నా డెల్టాకు 3,850, ఉత్తర కాలువకు 300, దక్షిణ కాలువకు 350 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు యువకుడి మృతి

సీతారామపురం, : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ స్కూల్ బిల్డింగ్ శ్లాబ్ పనుల్లో అపశ్రుతి చోటుచేసుకుని ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బుధవారం జరిగింది. ప్రకాశం జిల్లా సిఎస్ పురం మండలం వడ్డిరాజు నగర్‌కు చెందిన బండారు సురేష్ (30) స్కూల్ బిల్డింగ్ శ్లాబ్ పనుల నిమిత్తం సీతారామపురం వచ్చాడు. డీసీఎం వ్యాన్, మిల్లర్ మధ్యలో ఉన్న లింకు తొలగించే క్రమంలో ఒక్కసారిగా మిల్లర్ సురేష్ మీదకు దూసుకెళ్లింది. దీంతో అతను తీవ్రంగా గాయపడడంతో 108 వాహనం ద్వారా ఉదయగిరి ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని ఉదయగిరి ఆసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ..

కలువాయి : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చైన్నైలో చికిత్స పొందుతూ ఓ యువకుడు బుధవారం ఉదయం మృతి చెందాడు. అనంతసాగరం మండలం పడమటి కంభంపాడుకు చెందిన శ్రీనివాసులు ఈ నెల 7న కలువాయి మండలం వెంకటరెడ్డిపల్లికి వచ్చి తిరిగి పడమటి కంభంపాడుకు బైక్‌పై వెళ్తూ రాజుపాళెం సమీపంలో రాత్రి 9 గంటల సమయంలో జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో అతన్ని 108లో ఆత్మకూరులోని వైద్యశాలకు తరలించి పరిస్థితి విషమంగా ఉండటంతో చైన్నైకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

హడలెత్తించిన అట్టపెట్టె పార్శిల్

బిట్రగుంట : బోగోలు మండలం ఇబ్రహీంపేట హిందూ శ్మశానవాటికి సమీపంలో జమ్ముచెట్లలో పడి ఉన్న అట్టపెట్టె పార్శిల్‌ను బుధవారం గుర్తించిన స్థానికులు హడలిపోయారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ భోజ్యా సిబ్బందితో దానిని బయటకు తీయించి చూడగా అందులో ఖాళీ బీర్లు, మద్యం సీసాలు కనిపించాయి.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పసుపు, కుంకుమ



ఉదయగిరి, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): గన్నేపల్లి పంచాయతీలో ఉన్న అడవి పేరంటాలమ్మ బ్రహ్మోత్సవాల్లో భాగం గా బుధవారం అమ్మవారికి పసుపు, కుంకుమ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గడ్డంవారిపల్లి, జెట్టి వారిపల్లి, మిట్టపల్లి, కొట్టాలపల్లి, సర్వరాబాదు, కొట్టాలపల్లి బీసీ కాలనీ నుంచి భక్తులు అమ్మవారికి పసుపు, కుంకుమతో మేళ తాళాలు, బాణసంచా వేడుకల నడుమ ఆలయం వద్దకు చేరారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కాగా, కొట్టాలపల్లికి చెందిన వెంకటేశ్వర్లు, రత్నమ్మ దంపతులు అమ్మవారికి రూ.2 లక్షల విలువైన బంగారు నగలను ఆలయ కమిటీకి అందజేశారు.

వైభవంగా సీతారామచంద్రుల కల్యాణం

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్) : కాంచెరువులోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో బుధవారం స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణం నిర్వహించారు.

గీతాశ్రమంలో హనుమాన్ చాలీసా

అల్లూరు : ఏరువాకా పూర్ణిమను పురస్కరించుకొని అల్లూరులోని గీతాశ్రమంలో బుధవారం 108 సార్లు హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు అనంతరాజు బాలకృష్ణంరాజు తెలిపారు. హనుమాన్ చాలీసాన గూడూరుకు చెందిన సుబ్బారెడ్డి పాల్గొని భక్తుల చేత పఠింపజేశారు. ఈ కార్యక్రమంలో యరటపల్లి శేఖర్‌రెడ్డి, పప్పు సుధాకర్, కందల శివరామిరెడ్డి, నాగభూషణం, మొగళ్లపల్లి సురేష్ పాల్గొన్నారు.

కారు బోల్తా : ఆరుగురికి గాయాలు

కలువాయి : రహదారిపై ఉన్న గుంటను తప్పించబోయి అదుపు తప్పి కారు బోల్తా పడిన సంఘటన కోటూరుపల్లి సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం రాత్రి జరిగింది. స్థానికుల సమాచారం మేరకు.. పెంచలకోన ఆలయంలో పూజారి శేషస్వామి కుటుంబం ఆయన అత్తగారి ఊరు కనిగిరి వెళ్లి తిరిగి కారులో కోనకు వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఆరుగురికి గాయాలు కాగా కలువాయిలో ప్రథమ చికిత్స అనంతరం నెల్లూరుకు వెళ్లారు.

ఆత్మకూరు తహసీల్దారుగా పద్మజాకుమారి

ఆత్మకూరు, జూన్ 11 (ఆంధ్రజ్యోతి) ఆత్మకూరు మండల తహసీల్దారుగా పి పద్మజాకుమారి నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వి సుధీర్ దీర్ఘకాలిక సెలవుపై వెళ్లగా సంగం తహసీల్దారు సోమ్లానాయక్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. కాగా, సుధీర్ కలెక్టరేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో కలెక్టరేట్‌లో తహసీల్దారుగా పనిచేస్తున్న పి పద్మజాకుమారి బాధ్యతలు స్వీకరించారు.

ఇంకుడు గుంటలు నిర్మించాలి

అనంతసాగరం, జూన్ 11 (ఆంధ్రజ్యోతి): పొలాల్లో ఫారం పాండ్స్, ఇళ్ల వద్ద ఇంకుడు గుంటల నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఏపీడీ ప్రతాప్‌రెడ్డి సూచించారు. బుధవారం ఎండీవో కార్యాలయంలో ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.